
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 25
సోమవారం 17-4-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


ముంబై ఫటాఫట్...
ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఐదు వికెట్లతో విజయం. -12లో


పోర్టింగ్‌తో ధీమా!
ఆరోగ్య బీమాలో మరింత మెరుగైన పాలసీ కోసం పోర్టబులిటీ అవకాశం -13లో


సూడాన్ ఘర్షణల్లో 61 మంది హతం
సూడాన్ రాజధానిలో సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య తలెత్తిన ఘర్షణల్లో ఒక భారతీయుడు సహా 61 మందికి పైగా చనిపోయారు.
- వివరాలు 6లో


కర్ణాటకలో బీజేపీకి మరో షాక్
కర్ణాటకలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ బీజేపీకి రాజీనామా చేయడం సంచలనం కలిగించింది.
- వివరాలు 6లో


అవినీతికి ప్రతీక అదానీ: రాహుల్
ప్రధానికి అదానీపై ఉన్న ప్రేమ పేదప్రజలపై లేదని కర్ణాటకలో నిర్వహించిన సభలో మోదీపై రాహుల్ విమర్శల వర్షం కురిపించారు..
- వివరాలు 6లో


జుట్టుపైనా వివక్ష!
నల్లజాతి అమ్మాయిల రకరకాల కొప్పులు అమెరికన్లకు కంటగింపుగా మారుతోంది. దీంతో ఈ వివక్షపై క్రౌన్ యాక్ట్ బిల్లు తెచ్చారు.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

అవినీతికి పాల్పడితే సీఎంలనూ వదలం



అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తేలేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్థాయిలో అవినీతి, కుంభకోణాలకు పాల్పడటానికి ప్రత్యేక అధికారాలేవీలేవని పరోక్షంగా కేజ్రీవాల్ విచారణపై ఘాటుగా స్పందించారు.
- వివరాలు 14లో

300 మందిని ముంచిన మైత్రి రియల్‌ఎస్టేట్!



పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి కూడబెట్టుకున్న డబ్బును ప్లాట్ల కొనుగోలు కోసం చెల్లిస్తే.. మైత్రి ప్రాజెక్ట్స్ రియల్‌ఎస్టేట్స్ సంస్థ వారిని నిండా ముంచింది. సుమారు 300 మంది నుంచి రూ.50 కోట్ల వరకు వసూలు చేసి.. వారికి ప్లాట్లు ఇవ్వకుండా, డబ్బులూ తిరిగివ్వకుండా బోర్డు తిప్పేసింది.
- వివరాలు 14లో

ఎస్సై తుదిపరీక్ష 'కీ'పై అభ్యంతరాలకు నేడు గడువు



ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన ఎస్సై తుది రాతపరీక్షల ప్రాథమిక 'కీ' పైనా ఏవైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు బోర్డుకు తెలియజేసేందుకు ఇచ్చిన గడువు సోమవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. ప్రాథమిక 'కీ'లోని జవాబులు, ప్రశ్నలకు ఇచ్చిన ఐచ్ఛికాలలో ఏవైనా తప్పుగా ఉన్నా తెలియజేసేందుకు టెంప్లెట్లలో ఫార్మట్‌ను సైతం బోర్డు అధికారులు పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్‌లో సూచించారు.
- వివరాలు 14లో

పెంచుకుందామంటే పడిపోయింది

ఆర్టీసీ రోజువారీ ఆదాయం రూ.14 కోట్ల నుంచి రూ.11.50 కోట్లకు పడిపోయిన తీరు - 2లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
సూచించిన నేటి గుడ్లు & చికెన్ కరీంనగర్ జోన్ ధరలు
గుడ్ల రిటైల్ ధర ₹ 47 డజన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 111
రిటైల్ లైవ్ బర్డ్ 133
డ్రెస్డ్ స్కిన్‌తో 193
స్కిన్‌లెస్ 219
Conditions Apply

కలి'విడి'గానే!

చర్చనీయాంశంగా కారు - కామ్రేడ్ల స్నేహబంధం

దూకుడుగా వ్యవహరిస్తున్న సీపీఎం... తామడిగే మొదటి సీటు పాలేరే అన్న తమ్మినేని..

వైరా, మధిర, భద్రాచలం, ఖమ్మం, నకిరేకల్, మిర్యాలగూడ, ఇబ్రహీంపట్నం, నల్లగొండపైనా గురి

- కనీసం 3 అసెంబ్లీ, 2 ఎమ్మెల్సీ, ఒక రాజ్యసభ సీటు కోరాలనే ఆలోచన
- బెల్లంపల్లి, కొత్తగూడెం, దేవరకొండ, హుస్నాబాద్, మునుగోడు, వైరా, ఇల్లందులపై సీపీఐ ఆసక్తి
- పొత్తు పెట్టుకుంటే బలహీనపడ్డామనే సంకేతాలు వెళ్తాయనే భావనలో బీఆర్ఎస్ శ్రేణులు
- పెద్దల మౌనం.. స్నేహపూర్వక పోటీతో సరిపెట్టేందుకే మొగ్గు?



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. కొన్ని పార్టీలు ఇప్పటికే ఎన్నికల కార్యాచరణను అమలు చేస్తున్నాయి. కానీ ఇంకా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగలేదు. అయినప్పటికీ అధికార బీఆర్ఎస్ – వామపక్షాల పొత్తు అంశం మాత్రం గత కొన్నాళ్లుగా చర్చనీయాంశమవుతోంది. ఆ పార్టీల నేతలు పోటీలు పడుతూ దీన్ని తెరపైకి తెస్తున్నారు. తాజాగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నియోజకవర్గంలో చేసిన వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎంలు కలిసి పోటీ చేస్తాయని, ఈ అవగాహనలో భాగంగా తాము అడిగే మొదటి స్థానం పాలేరేనని, ఇక్కడ తాము పోటీ చేస్తే మంచోళ్లంతా తమకే ఓట్లు వేయాలని ఆయన కోరారు. పొత్తు చర్చలు ప్రారంభం కాకుండానే ఆయన సీపీఎం పోటీ చేసే స్థానాలపై మాట్లాడటం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇటీవల మిర్యాలగూడలో జరిగిన ఓ సభలో కూడా ఇక్కడి నుంచి సీపీఎం కచ్చితంగా పోటీ చేస్తుందంటూ తమ్మినేని చెప్పుకొచ్చారు. తమ్మినేని మాత్రమే కాదు.. తాము కచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్న అసెంబ్లీ స్థానాల పరిధిలోని సీపీఎం, సీపీఐ నేతలు కూడా ఆయా సందర్భాల్లో బీఆర్ఎస్‌తో పొత్తు, తాము పోటీ చేసే నియోజకవర్గాలను ప్రస్తావిస్తున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కూడా బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని, కొత్తగూడెం నుంచి తాను తప్పనిసరిగా పోటీ చేస్తానని పార్టీ కేడర్‌కు చెపుతున్నారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ ఆలోచన ఏ విధంగా ఉందన్నది బయటపడక పోవడంతో.. మునుగోడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ పార్టీల మధ్య ఏర్పడిన స్నేహ బంధం ఎంత దూరం కొనసాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

గౌరవప్రదమైన స్థాయిలో అంగీకారం!

వామపక్ష పార్టీల్లో జరుగుతున్న చర్చల ప్రకారం.. బీఆర్ఎస్‌తో పొత్తు కుదిరితే మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు అడగాలని సీపీఎం, సీపీఐలు నిర్ణయించుకున్నట్టు అర్థమవుతోంది. పాలేరు, వైరా, మధిర, భద్రాచలం, ఖమ్మం, నకిరేకల్, మిర్యాలగూడ, నల్లగొండ, ఇబ్రహీంపట్నం స్థానాలు కావాలని సీపీఎం అడిగే అవకాశం ఉండగా కొత్తగూడెం, దేవరకొండ, హుస్నాబాద్, బెల్లంపల్లి, వైరా, ఇల్లందు, మునుగోడు నియోజకవర్గాలను సీపీఐ కోరే అవకాశముంది. అయితే కోరినన్ని స్థానాలు ఇవ్వకపోయినా గౌరవప్రదమైన స్థాయిలో పొత్తును అంగీకరించే యోచనలో రెండు పార్టీలూ ఉన్నట్టు సమాచారం. కనీసం మూడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎమ్మెల్సీ, ఒక రాజ్యసభ సభ్యత్వం కోసం బీఆర్ఎస్‌ను మిగతా 2వ పేజీలో ▶

నిజాలు దాచి దర్యాప్తా?

పర్సన్ కాదు.. ఫ్యాక్ట్ టార్గెట్ ఇన్వెస్టిగేషన్ కావాలి
మీడియాతో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

వివేకాది మర్డర్ అని తెలిసీ డెత్ నోట్ దాచిపెట్టిన వ్యక్తి రాజశేఖరరెడ్డి

- డాక్యుమెంట్లు చోరీ చేశామని స్వయంగా ఏ–4 దస్తగిరే చెప్పాడు
- ఆ దిశగా విచారణ చేయాలని అభ్యర్థించినా పట్టించుకోలేదు
- మునుపటి అధికారి రోల్‌నే కంటిన్యూ చేస్తున్నారు
- అప్రూవర్ అనే అబద్ధాల మీద కట్టిన కట్టడం నిలబడదు
- న్యాయస్థానాలపై గౌరవం ఉంది.. నిజాయితీ నిరూపించుకుంటాం
- విలేకరులతో మాట్లాడిన కొద్ది సేపటికే అవినాశ్‌రెడ్డికి నోటీసులు
- నేటి మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ విచారణకు సీబీఐ పిలుపు



సాక్షి, పులివెందుల: 'అత్యున్నత స్థాయి విచారణ సంస్థ దిగజారి ప్రవర్తిస్తోంది. కీలక అంశాలను మరుగు పరుస్తూ, సిల్లీ అంశాల ఆధారంగా విచారణ చేస్తోంది. పర్సన్ టార్గెట్ ఇన్వెస్టిగేషన్ కాదు.. ఫ్యాక్ట్ టార్గెట్ ఇన్వెస్టిగేషన్ చేయాలని సీబీఐ డైరెక్టర్, డీఐజీ, కొత్తగా నియమితులైన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను కలిసి అభ్యర్థించినా ఆ దిశగా కనీస విచారణ చేపట్టలేదు' అని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు ఆదివారం పులివెందులలో ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసిన నేపథ్యంలో ఎంపీ మీడియాతో మాట్లాడారు. తన తండ్రిని ఊహించని విధంగా అరెస్టు చేశారని, మాటలు రానంత మిగతా 3వ పేజీలో ▶

వైఎస్ భాస్కర్ రెడ్డి అరెస్ట్

- పులివెందులలో అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు
- హైదరాబాద్‌లో సీబీఐ న్యాయమూర్తి ఎదుట హాజరు.. 14 రోజుల రిమాండ్

3లో



కళ్లకు గంతలతోనే దర్యాప్తు

- సత్యదూరంగా సీబీఐ రిమాండ్ రిపోర్ట్.. వాస్తవాలు, కుట్రకోణాలను విస్మరించిన సీబీఐ
- హంతకుడిని అప్రూవర్‌గా మార్చి... కల్పితాలకు పెద్దపీట

3లో

ర్యాగింగ్ చేస్తే... కఠిన చర్యలు

వైద్య విద్యార్థులకు జాతీయ మెడికల్ కమిషన్ హెచ్చరిక

- విద్యార్థులు మానసిక స్థైర్యం కలిగి ఉండాలి
- రోగుల సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టొద్దు
- వారితో సహనంతో వ్యవహరించాలని స్పష్టీకరణ
- మెడికోల వృత్తిపర బాధ్యతలపై మార్గదర్శకాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడరాదని.. అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) హెచ్చరించింది. విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండాలని.. రోగులతో మర్యాదగా, సున్నితంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. మారుతున్న వైద్య విధానాలు, సాంకేతికత, చికిత్సలపై అవగాహన పెంచుకోవాలని సూచించింది. రోగులు, వారికి సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదని పేర్కొంది. దేశంలో వైద్య విద్యార్థుల వృత్తిపరమైన బాధ్యతలపై మిగతా 2వ పేజీలో ▶

ఎన్‌ఎంసీ మార్గదర్శకాల్లోని ఇతర ముఖ్యాంశాలివీ..

సమాజం నుంచి నేర్చుకోవడం వైద్యవిద్యలో ముఖ్యమైన భాగం. జీవన ప్రమాణాలు, సామాజిక పరిస్థితులు, ప్రాథమిక సౌకర్యాలు, వైద్య ఆరోగ్య వసతులు, పర్యావరణ పరిస్థితులు తెలుసుకోవాలి. రోగులు ఆస్పత్రికి వచ్చినప్పుడు వారిని, వారి సమస్యను అర్థం చేసుకోవాలంటే ఇలాంటి జ్ఞానం, అనుభవం అవసరం. వీలైనప్పుడల్లా విద్యార్థులు వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాలి.

వైద్యవిద్య కోర్సు కొన్ని ఒత్తిళ్లు, సవాళ్లతో కూడి ఉంటుంది. అవసరమైతే వృత్తిపరమైన సాయాన్ని పొందాలి. కాలేజీలు నిర్వహించే యోగా, ధ్యానం శిక్షణలో పాల్గొనాలి. తద్వారా మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలి. విద్యార్థులు ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించడానికి రెఫరల్ సిస్టమ్ ఉండాలి. కాలేజీలు స్టూడెంట్ల ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి.



మెడికల్ కాలేజీలు పరీక్షల విషయంలో నిజాయితీగా వ్యవహరించాలి. అంతర్గత మూల్యాంకన మార్కులను పెంచకూడదు.

విద్యార్థులు పేరున్న ఆస్పత్రులు నిర్వహించే వైద్యారోగ్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన ప్రచార కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనడం అవసరం.

మధ్యవర్తిత్వంపై త్వరలో చట్టం


భారత మధ్యవర్తిత్వ దినోత్సవంలో జస్టిస్ రవీంద్రన్, జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ ఎన్వీ రమణ, సింగపూర్ ఐఏఎంసీ చైర్మన్ జార్జి లిమ్, జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు

- పార్లమెంటులో కేంద్రం బిల్లు ప్రవేశపెట్టనుంది
- అమల్లోకి వస్తే కేసుల పరిష్కారం వేగవంతమవుతుంది
- 'భారత మధ్యవర్తిత్వ దినోత్సవం'లో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ
- పూర్వీకుల కాలం నుంచే 'మధ్యవర్తిత్వం' ఉంది: జస్టిస్ హిమాకోహ్లి
- పాల్గొన్న జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, జస్టిస్ రవీంద్రన్

5లో

అఫిలియేషన్లు లేకున్నా... అడ్మిషన్లు షురూ!

భారీగా ఫీజు పెంచేసిన ప్రైవేటు ఇంటర్ కాలేజీలు

- బ్రిడ్జ్, క్రాష్ కోర్సులంటూ తరగతులు ప్రారంభం
- జూన్ 1 నుంచి కాలేజీలు ప్రారంభించాలన్న నిబంధనలు బేఖాతరు
- గతేడాది అఫిలియేషన్లు రాక లక్ష మంది విద్యార్థులకు ఇబ్బందులు



సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షలు పూర్తవ్వడంతో ప్రైవేటు ఇంటర్ కాలేజీలు ప్రవేశాల ప్రక్రియను ముమ్మరం చేశాయి. నిబంధనల ప్రకారం ఇంటర్ బోర్డ్ నుంచి అనుబంధ గుర్తింపు పొందాల్సి ఉన్నా, దీన్ని పట్టించుకోవడం లేదు. కొన్ని కార్పొరేట్ కాలేజీలు ఏకంగా బ్రిడ్జ్, క్రాష్ కోర్సులంటూ తరగతులు కూడా నిర్వహిస్తున్నాయి. వాస్తవానికి జూన్ 1 నుంచి మాత్రమే అన్ని కాలేజీలూ ప్రారంభించాలని ఇంటర్ బోర్డ్ షెడ్యూల్ కూడా ఇచ్చింది. ఈలోపు అఫిలియేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పింది. గుర్తింపు లేకుండా అడ్మిషన్లు తీసుకోవద్దని స్పష్టం చేసింది. ఒకవేళ గుర్తింపు రాని పక్షంలో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంది. కాలేజీ యాజమాన్యాలు మాత్రం ఇవేవీ పట్టించుకోవడం లేదు. మండు వేసవిలో తరగతులు నిర్వహిస్తున్నా, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

రూ. లక్షల్లో ఫీజులు: ప్రైవేటు కాలేజీలు ఈసారి ఫీజులు భారీగా పెంచాయి. ఐఐటీ, నీట్, ఇంటెన్సివ్ కోర్సులంటూ మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



కబళించిన మంటలు

ఐదేళ్ల కుమారుడుసహా దంపతుల సజీవ దహనం

భవనంలోంచి బయట పడలేక మెట్ల వద్దే మృత్యువాత
కుషాయిగూడలోని టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం
పక్కనే ఉన్న మూడంతస్తుల భవనానికి వ్యాపించిన మంటలు
ప్రాణాలతో బయటపడిన ఐదు కుటుంబాలు.. ఐదుగురికి గాయాలు


ఆదివారం తెల్లవారుజామున కుషాయిగూడలోని టింబర్ డిపోలో ఎగసిపడుతున్న మంటలు

కుషాయిగూడ (హైదరాబాద్): ఆదివారం తెల్లవారుజాము 3 గంటల సమయం. కుషాయిగూడ, సాయినగర్ కాలనీలో ఉన్న ఓ టింబర్ డిపోలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే తీవ్రమైన మంటలు పక్కనే ఉన్న మూడంతస్తుల భవనానికి అంటుకుని వ్యాపించాయి. అందులో ఆరు కుటుంబాలు నివసిస్తుండగా, అందరూ ఏదో విధంగా ప్రాణాలతో బయటపడినా ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు మాత్రం అగ్నికీలల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. మరో ఐదుగురు గాయపడ్డారు. కుషాయిగూడ పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

అంతా గాఢ నిద్రలో ఉండగా..

సాయినగర్ కాలనీ ప్రధానరోడ్డు మార్గంలో ఉదయ్‌శంకర్, శివసాయి అనే అన్నదమ్ములు శ్రీ ఆదిత్యసాయి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో గత 25 సంవత్సరాలుగా టింబర్ డిపో మిగతా 5వ పేజీలో ▶


ప్రమాదంలో మృతిచెందిన నరేశ్, సుమ, జశ్వంత్ (ఫైల్)

పేలిన రెండు సిలిండర్లు..

మంటలు భారీఎత్తున ఎగసి పడటానికి భవనం కింద ఉన్న ఆటోమొబైల్ షాప్ గోదామే ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోదాంలోని టైర్లు, ఆయిల్ డబ్బాలతో పాటుగా ఇతర సామగ్రికి నిప్పు అంటుకోవడం వల్లే ఒక్కసారిగా మంటలు చెలరేగాయని అంటున్నారు. ప్రమాదం జరిగిన టింబర్ డిపోలో 8 గ్యాస్ సిలిండర్లు ఉండగా వీటిల్లో రెండు పేలిపోయాయి. టింబర్ డిపోలో అన్ని గ్యాస్ సిలిండర్లు ఎందుకున్నాయో తెలియరాలేదు. అలాగే అగ్ని ప్రమాదానికి కారణం ఏమిటన్నది కూడా తెలియరాలేదు.

లిక్కర్ స్కామ్‌లో మీ పాత్ర ఏంటి?

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రశ్నించిన సీబీఐ



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అధికారులు ఆదివారం ప్రశ్నించారు. మౌఖికంగా, లిఖితపూర్వకంగా ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. కేజ్రీవాల్ తొలుత రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీ స్మారకాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఉదయం 11 గంటలకు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్, తన కేబినెట్‌లోని కొందరు మంత్రులతో కలిసి ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. సీబీఐ అధికారులు ఉదయం నుంచి రాత్రి 8.30 గంటల దాకా.. దాదాపు 9 గంటలపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించారు. కాగా, అధికార బీజేపీ చెప్పినట్టల్లా సీబీఐ ఆడుతోందని, తనను అరెస్టు చేయాలంటూ సీబీఐని బీజేపీ ఆదేశించబోతోందని కేజ్రీవాల్ ఆరోపించారు.

- వివరాలు 6లో

రెండ్రోజులు అధిక ఉష్ణోగ్రతలే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు సాధారణం కంటే 1నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. జీహెచ్ఎంసీ మినహా మిగతా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీ సెల్సియస్ నుంచి 43 డిగ్రీ సెల్సియస్ మధ్యన నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఆదివారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత అదిలాబాద్‌లో 41.3 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.0 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.4	28.1
రాజమహేంద్రవరం	43.0	27.5
విజయవాడ	43.0	27.0
కర్నూలు	41.8	26.5
ఆదిలాబాద్	41.3	21.4
ఖమ్మం	41.0	27.0
రామగుండం	40.6	23.4
మహబూబ్‌నగర్	40.6	26.7
భద్రాచలం	40.5	27.5
మెదక్	39.6	22.0
నల్లగొండ	39.5	24.0
నిజామాబాద్	39.5	23.3
హనుమకొండ	38.5	24.0
హైదరాబాద్	37.8	24.6
హకీంపేట్	37.5	23.9
దుండిగల్	37.5	23.3



శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా...

వేధింపులపై మౌనం వద్దు

తెలంగాణ పోలీస్‌శాఖ ప్రత్యేక డ్రైవ్

సాక్షి, హైదరాబాద్: వేధింపులపై మౌనం వద్దని..ధైర్యంగా ఫిర్యాదు చేయాలని తెలంగాణ పోలీసులు భరోసా ఇస్తున్నారు. నేరుగా లేదంటే ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో పని ప్రదేశంలో లైంగిక వేధింపులను అరికట్టడమే లక్ష్యంగా నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. గృహహింసతో పాటు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపైనా ఫిర్యాదుకు డయల్ 100 లేదా 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్‌గా రాజా వరప్రసాద్



సాక్షి,హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన రాజా వరప్రసాద్‌ను రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా మోదల పురుషోత్తం, మహేశ్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని రైతు, మత్స్య, గొర్రెలు, మేకలు, మహిళా తదితర అన్ని సంఘాలకు ఇది దిశా నిర్దేశం చేసే కీలక పదవి అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సహకార సంఘాల బలోపేతం మీద దృష్టిపెట్టిన నేపథ్యంలో రాజా వరప్రసాద్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. 2001 లో పార్టీలో చేరినప్పటి నుంచి 2007 వరకు షాద్‌నగర్ పట్టణ పార్టీ అధ్యక్షుడిగా, 2007 నుంచి 2010 యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2010 నుంచి 2016 వరకు ఉమ్మడి పాలమూరు జిల్లా యూత్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో అరెస్టయినప్పుడు పెళ్లి పీటలపై నల్లబ్యాడ్జీ ధరించి నిరసన దిగారు. తనను గుర్తించి బాధ్యతలను అప్పగించిన సీఎం కేసీఆర్‌కు, సహకరించిన వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డికి రాజావరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత ఆయన మంత్రి నిరంజన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

పెంచుకుందామంటే పడిపోయింది

100 రోజుల్లో రూ. 200కోట్ల అదనపు ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ఆర్టీసీ

అదనం సంగతి దేవుడెరుగు.. సగటు ఆదాయానికే గండి

రోజువారీ ఆదాయం రూ.14 కోట్ల నుంచి రూ.11.50 కోట్లకు పడిపోయిన తీరు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ రోజువారీ ఆదాయం ఒక్కసారిగా పడిపోయింది. గత నెల సగటున రోజుకి రూ.14 కోట్లకుపైగా ఆదాయం నమోదవుతూ రాగా, ఏప్రిల్ ఒకటి నుంచి అది రూ.11.5 కోట్లకు పడిపోయింది. మార్చి చివరి వరకు ఆక్యుపెన్సీ రేషియో సగటున 68 శాతం వరకు ఉంటే అది ఇప్పుడు 58 శాతం వద్ద దోబూచులాడుతోంది. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ గాడిలో పడుతున్న తరుణంలో, ఈ వేసవిలో వంద రోజుల ప్రణాళిక పేరుతో.. స్పేర్‌లో ఉన్నవి సహా అన్ని బస్సులనూ రోడ్డెక్కించి అదనపు కిలోమీటర్లు తిప్పటం ద్వారా మరింత ఆదాయం పొందేందుకు చేసిన ప్రయత్నం ఈ నెలలో విఫలమైందనే చెప్పాలి. కనీసం రోజువారీ రూ.16 కోట్ల ఆదాయం పొందాలని లక్ష్యంగా పెట్టుకుంటే రూ.12 కోట్లు పొందటం కూడా గగనమైంది. దీంతో ఈ నెలలో నష్టాలు భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆక్యుపెన్సీ రేటును భారీగా పెంచుకుని పెద్ద మొత్తంలో అదనపు ఆదాయం ఆర్జించాలన్న ఆర్టీసీ యత్నం ఆదిలోనే బెడిసి కొట్టింది. అదనపు ఆదాయం దేవుడెరుగు సగటున రోజుకు రావాల్సిన ఆదాయానికే గండి పడుతోంది. గతేడాది ఆర్టీసీ నిర్వహించిన 100 రోజుల ప్రణాళిక సూపర్ సక్సెస్ కావడంతో రూ.178 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది మార్చి చివరి నుంచి అదనపు బస్సులతో అదే తరహాలో రూ. 200 కోట్ల అదనపు ఆదాయం లక్ష్యంగా 100 రోజుల ప్రణాళిక ప్రారంభించినా.. ఈసారి మాత్రం సగటున రోజుకి వచ్చే ఆదాయం కూడా పడిపోయింది. గతేదాది ఇదే ఎండా కాలంలో చేపట్టిన కార్యక్రమం మంచి ఫలితాన్నిస్తే, ఈసారి అదే వేసవి చుక్కలు చూపిస్తోంది.

లాభాల నుంచి నష్టాల బాటలోకి

ఇటీవలి కాలంలో వంద రోజుల ప్రణాళిక, ప్రాఫిట్ ఛాలెంజ్ లాంటి కార్యక్రమాలతో చాలా డిపోలు లాభాల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. దాదాపు 35 డిపోలు లాభాలు తెస్తుండగా, మరో 20 డిపోలు అతి తక్కువ నష్టాల జాబితాలో ఉన్నాయి. అలాంటిది ప్రస్తుతం రోజుకు రెండుమూడు డిపోలు మాత్రమే లాభాల్లో ఉంటున్నాయి. ఉదాహరణకు ఈ నెల 15వ తేదీని పరిశీలిస్తే.. 94 డిపోలు నష్టాలను చవిచూశాయి. హైదరాబాద్-1 డిపో రూ.2.27 లక్షలు, పికెట్ డిపో 80 వేల లాభాన్ని తెచ్చి పెట్టగా నార్కెట్‌పల్లి డిపో నోప్రాఫిట్/నో లాస్‌గా నిలిచింది(ఏప్రిల్ నెలకు సంబంధించి మిగతా రోజుల్లో నష్టాల్లో ఉంది). మిగతా డిపోలన్నీ నష్టాలు మూటగట్టుకున్నాయి. గతేడాది చివరలో డీజిల్ సెస్‌ను ఆర్టీసీ భారీగా పెంచటం ద్వారా టికెట్ చార్జీలు పెరిగిన విషయం తెలిసిందే. దీంతో భారీ ఆదాయం నమోదవుతోంది. గతేడాది వేసవిలో ఆ చార్జీలు తక్కువే ఉన్నాయి. అయినా గత ఏప్రిల్‌లో ప్రస్తుతం నమోదవుతున్న ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం రావటం విశేషం. ఆక్యుపెన్సీ రేషియో అప్పుడే మెరుగ్గా నమోదైంది.

శూన్య మాసం వల్లనేనా

ప్రస్తుతం శుభముహూర్తాలు లేని శూన్యమాసం నడుస్తోంది. దీంతో శుభకార్యాలు లేక ప్రయాణాలు కూడా బాగా తగ్గాయి. సాధారణంగా ఎండ తీవ్రత పెరిగాక ప్రయాణాలు చేసే వారి సంఖ్య తగ్గుతుంది. కానీ శుభకార్యాలుంటే బస్సులు కిక్కిరిసి ఆక్యుపెన్సీ రేషియో ఎక్కువగా నమోదవుతుంది. గతేడాది ఏప్రిల్‌లో ఎండలు ఎక్కువే ఉన్నా, శుభకార్యాల వల్ల ఆక్యుపెన్సీ రేషియో మెరుగ్గా నమోదైంది. ఈ నెలాఖరు వరకు శూన్యమాసమే ఉండనున్నందున ఈ నెల అంతా ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ భావిస్తోంది.

పరీక్షలు కూడా కారణమే

విద్యార్థులకు ఇంకా వేసవి సెలవులు ప్రారంభం కాలేదు. పరీక్షలు కొనసాగుతున్నందున ప్రయాణాలు చేసే వారి సంఖ్య కూడా తక్కువగా నమోదవుతోంది. ఈనెలాఖరుకుగాని వేసవి సెలవులు ప్రారంభమయ్యే వీలులేనందున అప్పటి వరకు ప్రభావం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు రంజాన్ ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలు తక్కువగా ప్రయాణిస్తారు. ఆ ప్రభావం కూడా ఇప్పుడు ఆర్టీసీపై పడింది.

అన్ని బస్సులూ తిప్పడంతో డీజిల్ భారం

వంద రోజుల ప్రణాళిక పేరుతో ప్రస్తుతం అన్ని బస్సులనూ తిప్పుతున్నందున డీజిల్ వినియోగం భారీగా పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉన్నందున, ఆదాయం కంటే డీజిల్ ఖర్చు ఎక్కువయ్యే పరిస్థితులుండటంతో బస్సుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో సర్వీసుకు-సర్వీసుకు మధ్య విరామం పెరిగి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి మృతి

- భర్త వర్ధంతికి వెళ్తుండగా ప్రమాదం
- జోగులాంబ గద్వాల జిల్లా కొండేరు వద్ద బోల్తాపడిన కారు





ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు. ఇన్‌సెట్‌లో నీరజారెడ్డి

కర్నూలు(హాస్పిటల్)/ఆలూరు రూరల్/ఎర్రవల్లి చౌరస్తా: కర్నూలు జిల్లా ఆలూరు మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజా రెడ్డి (50) రోడ్డు ప్రమాదంలో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఈ నెల 18వ తేదీన భర్త శేషిరెడ్డి వర్ధంతి ఉండడంతో హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన దేవనకొండ మండలంలోని తెర్నెకల్ గ్రామానికి ఆమె ఆదివారం మధ్యాహ్నం కారులో బయలుదేరారు. ఆమె ప్రయాణిస్తున్న కారు జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కొండేరు సమీపంలోని కొట్టం కళాశాల వద్ద జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు టైర్ పేలడంతో అదుపుతప్పి ఒక్కసారిగా పల్టీలు కొట్టింది. నీరజా రెడ్డి సీటు బెల్టు ధరించకపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5 గంటల సమయంలో మృతి చెందారు. నీరజారెడ్డి ప్రమాదవార్త తెలిసి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్థానిక పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కాటసానితో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ ఆస్పత్రికి చేరుకుని సంతాపం ప్రకటించారు.

నీరజారెడ్డి రాజకీయ ప్రస్థానం

వైఎస్సార్ జిల్లా వేంపల్లె గ్రామానికి చెందిన రాం చిన్నారెడ్డి (హైకోర్టు రిటైర్డ్ జడ్జి) కుమార్తె నీరజా రెడ్డిని 1988లో కర్నూలు జిల్లా తెర్నెకల్ గ్రామానికి చెందిన సోమిరెడ్డి చిన్న కుమారుడు శేషిరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. శేషిరెడ్డి 1989లో పత్తికొండ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1996లో శేషిరెడ్డి హత్యకు గురయ్యారు. దీంతో నీరజా రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. ఈ క్రమంలో 2004లో కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నీరజారెడ్డికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆమె ఆలూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

మహోన్నత పాత్రికేయుడు గోరా శాస్త్రి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పంజగుట్ట: 'అక్షరాలతో అద్భుతాలు చేసిన మహోన్నత పాత్రికేయుడు గోరా శాస్త్రి'అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. నవ సాహితీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన 'గోరాశాస్త్రి ఉత్తమ జర్నలిస్టు పురస్కార'కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహనీయుడు గోరా శాస్త్రి పేరుతో అవార్డు మంచి జర్నలిస్టు కృష్ణారావుకు అందించడం సంతోషకరమన్నారు. గోరా రాసిన సంపాదకీయాల కోసం ఎంతో మంది పత్రిక చదివేవారని, అందులో తానూ ఒకడినని తెలిపారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు భాష ప్రధానమని, జనానికి సులభంగా అర్థమయ్యేలా రాయడంలో గోరా, కృష్ణారావు ఇద్దరూ ఇద్దరేనన్నారు. జాతీయ రాజకీయాలు తెలుసుకునేందుకు తాను కృష్ణారావు మీదే ఆధారపడతానని తెలిపారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, నవ సాహితీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు సూర్యప్రకాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావు, ఏపీ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో అమ్మాయిలదే హవా

అబ్బాయిలతో పోలిస్తే 8 వేలకుపైగా అధికం

- సైన్స్ కోర్సులకే యువతుల ప్రాధాన్యత
- తక్షణమే ఉపాధి కల్పించే కోర్సులవైపు యువకుల మొగ్గు
- ఉన్నత విద్యామండలి విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కోర్సుల్లో అమ్మాయిల ప్రవేశాలు పెరుగుతున్నాయి. అందులోనూ సైన్స్ కోర్సులపట్ల యువతులు మక్కువ చూపుతున్నారు. 2022-23 విద్యా ఏడాదికి సంబంధించిన డిగ్రీ ప్రవేశాల గణాంకాలను పరిశీలిస్తే అబ్బాయిలతో పోల్చినప్పుడు అమ్మాయిల సంఖ్య 8,710 ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో 2022-23లో 4.60 లక్షల సీట్లు ఉండగా అందులో 'దోస్త్' ద్వారా 2,10,970 సీట్లు భర్తీ అయ్యాయి. భర్తీ అయిన సీట్లలో 1,01,130 మంది (47.94%) అబ్బాయిలు వివిధ కోర్సుల్లో చేరితే 1,09,840 మంది (52.06%) అమ్మాయిలు పలు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. ఈ వివరాలను ఉన్నత విద్యామండలి సోమవారం వెల్లడించింది.

ఉపాధి వైపు అబ్బాయిలు.. : కొన్నాళ్లుగా విద్యా రంగంలో ట్రెండ్ పూర్తిగా మారిందని విద్యావేత్తలు చెబుతున్నారు. కరోనా తర్వాత బాలురు ఎక్కువగా డిగ్రీ తర్వాత ఉపాధి వైపు చూస్తున్నారని అంటున్నారు. ఇంజనీరింగ్‌లో 80 వేలకుపైగా సీట్లు భర్తీ అవగా అందులో 50%పైగా అబ్బాయిలే ఉంటున్నారు. డిగ్రీ కోర్సుల్లోనూ తక్షణ ఉపాధికి అవకాశం ఉన్న కోర్సులనే అబ్బాయిలు ఎంచుకుంటున్నారు. బీఏలో 18 వేల మంది అబ్బాయిలు చేరగా, బీకాంలో వారిసంఖ్య 48 వేలకుపైగా ఉంది. కరోనా తర్వాత కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినడం, డిగ్రీ తర్వాత కుటుంబ బాధ్యతల్లో బాలుర పాత్ర పెరగడమే దీనికి కారణ మని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ అధ్యయనంలోనూ వెల్లడైంది.

సైన్స్ వైపు బాలికలు

'దోస్త్' ప్రవేశాల గణాంకాల ప్రకారం బాలికలు ఎక్కువగా సైన్స్ కోర్సులనే ఎంచుకున్నారు. బీకాంలో బాలురతో పోటీపడ్డారు. బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో బాలుర ప్రవేశాల సంఖ్య 10 వేలకుపైగా ఉంటే బాలికల ప్రవేశాలు 33 వేలకుపైగా ఉన్నాయి. బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో బాలురు 14 వేలకుపైగా ఉంటే బాలికలు 17 వేలకుపైగా ఉన్నాయి. ఇంజనీరింగ్ పూర్తి చేసిన బాలికల్లో 70% మంది ఉపాధి వైపు వెళ్తున్నారని సర్వేలు పేర్కొంటున్నా యి. డిగ్రీలో చేరే బాలికలు మాత్రం ఉన్నతవిద్య వైపు వెళ్తున్నారు. ఉన్నత చదువుల వైపే బాలికలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారని, ఇది మంచి పరిణామమేనని ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

ఉన్నత విద్యపై అవగాహన పెరిగింది..



ప్రతి కుటుంబంలోనూ అమ్మాయిలను ఉన్నత విద్యవైపు నడిపించాలనే అవగాహన పెరగడం వల్లే డిగ్రీ కోర్సుల్లో అమ్మాయిల చేరికలు ఎక్కువగా ఉంటున్నాయి. పాఠశాల, ఇంటర్ స్థాయి నుంచే బాలికలకు ప్రత్యేక హాస్టళ్లు, స్కూళ్లు, కాలేజీలు అందుబాటులో ఉండటం కూడా వారిని ఉన్నత విద్యవైపు మళ్లేలా చేస్తున్నాయి.

– ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి

పాత పించన్ ఇచ్చే పార్టీలకే పట్టం

'పెన్షన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్'లో ఎన్ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపు



అంబేడ్కర్ విగ్రహం పాదాల వద్ద వినతిపత్రం పెడుతున్న సీపీఎస్ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేసే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో పట్టం కట్టాలని, రానున్న ప్రతిఎన్నికలో ఉద్యోగులకు పాతపింఛనే ఎజెండా కావాలని నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) పరిధిలో ఉన్న ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యోగులు ఆదివారం ర్యాలీలు నిర్వహించారు. అందులో భాగంగా తెలంగాణలోనూ 'పెన్షన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్'ను అన్ని జిల్లాకేంద్రాల్లో ఉద్యోగులు మండుటెండలను సైతం లెక్కచేయకుండా నిర్వహించారు. హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియం నుంచి లిబర్టీలోని అంబేద్కర్ విగ్రహం వరకు మార్చ్ నిర్వహించిన ఉద్యోగులు అక్కడ అంబేద్కర్ విగ్రహ పాదాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాత పింఛన్ విధానం అమలు చేయకపోగా, దానిని అమలు చేస్తామంటున్న రాష్ట్రాలకు కూడా స్వేచ్ఛ ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణలోని 1.72 లక్షల మంది ఉద్యోగ, టీచర్లకు సంబంధించిన దాదాపు రూ.20 వేల కోట్లు షేర్ మార్కెట్‌లో చెలామణి అవుతున్నాయని స్థితప్రజ్ఞ చెప్పారు. మార్చ్‌లో నేతలు కె.శ్రీకాంత్, నరేశ్‌గౌడ్, నరేందర్‌రావు పాల్గొన్నారు.

అఫిలియేషన్లు లేకున్నా.. అడ్మిషన్లు షురూ!

▶ మొదటి పేజీ తరువాయి

విభాగాల వారీగా ధరలు నిర్ణయించాయి. ఓ కార్పొరేట్ కాలేజీ గత ఏడాది సంవత్సరానికి రూ.1.25 లక్షలు తీసుకోగా, ఈసారి రూ.1.75 లక్షలు డిమాండ్ చేస్తోంది. జేఈఈ కోచింగ్‌తో కలిపితే రూ. 2.25 లక్షలు చెబుతోంది. సాధారణ కాలేజీలు కూడా ఏడాదికి రూ.75 వేల నుంచి రూ. 1.25 లక్షలు డిమాండ్ చేస్తున్నాయి. రవాణా చార్జీలు కూడా 20 శాతం పెంచారని తల్లిదండ్రులు చెబుతున్నారు. హాస్టల్ కోసం ఏటా రూ.1.25 లక్షలు అడుగుతున్నారు. మొత్తం మీద ఇంటర్ పూర్తయ్యే వరకూ రూ.2 నుంచి రూ.5 లక్షల వరకూ ఖర్చవుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

గుర్తింపు ఇవ్వకుండానే...?

రాష్ట్రవ్యాప్తంగా 3,111 ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ కాలేజీలున్నాయి. వీటిలో ప్రభుత్వ కాలేజీలు తీసివేస్తే దాదాపు 1,516 ప్రైవేటు కాలేజీలు అనుబంధ గుర్తింపు పొందాల్సి ఉంటుంది. అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, లేబొరేటరీలు అన్నీ పరిశీలించిన తర్వాతే గుర్తింపు ఇస్తారు. గత ఏడాది 416 కాలేజీలకు పరీక్ష ఫీజు గడువు ప్రకటించే వరకూ గుర్తింపు ఇవ్వలేదు. బహుళ అంతస్తుల భవనాల్లో నడుస్తున్నాయని, అగ్నిప్రమాదాలను నివారించే వ్యవస్థ లేదనే అభ్యంతరాలున్నాయి. దీంతో లక్ష మంది విద్యార్థులు ఫీజు కట్టేందుకు ఆఖరి క్షణం వరకూ ఆందోళనకు గురయ్యారు. ఈ ఏడాది మూడేళ్ల కాలపరిమితితో అఫిలియేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రైవేటు కాలేజీలు ఇంకా గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునే దశలోనే ఉన్నాయి. అయినా పెద్దఎత్తున విద్యార్థులను చేర్చుకోవడం విమర్శలకు తావిస్తోంది.

టెన్త్ ఫలితాలొచ్చేలోగా గుర్తింపు పూర్తి: నవీన్ మిత్తల్ (ఇంటర్ బోర్డ్ కార్యదర్శి)

అనుబంధ గుర్తింపు వచ్చిన తర్వాతే బోర్డ్ నిర్దేశించిన మేరకు ఫస్టియర్ ప్రవేశాలు చేపట్టాలి. ఇందుకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టినా, క్లాసులు నిర్వహించినా చర్యలుంటాయి. ఈసారి టెన్త్ ఫలితాలు వచ్చిన వెంటనే గుర్తింపు ప్రక్రియను పూర్తిచేస్తాం. ఆ తర్వాత అఫ్లియేషన్ ఇవ్వం. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా గుర్తింపు వచ్చిన తర్వాతే విద్యార్థులను కాలేజీల్లో చేర్చాలని కోరుతున్నాం.

ఉల్లంఘనలపై చర్యలుండాలి: మాచర్ల రామకృష్ణగౌడ్ (తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి కన్వీనర్)

గుర్తింపు రాకుండా ప్రైవేటు కాలేజీలు ఇష్టానుసారం అడ్మిషన్లు తీసుకోవడం చట్టవిరుద్ధం. అధికారులు ఇలాంటి కాలేజీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. టెన్త్ ఫలితాలు రాకుండా ఇంటర్ క్లాసులు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనయ్యే ప్రమాదం ఉంది.

ఐఐటీలో డీఆర్డీఓ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీలోని డీఆర్డీఓ రీసెర్చ్ సెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మారింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి మాట్లాడారు. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనేది రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఒక ప్రధాన ముందడుగుగా ఆయన అభివర్ణించారు.కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ఆర్అండ్‌డీ సెక్రటరీ డాక్టర్ సమీర్ వి.కామత్, డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ బీహెచ్ వీవీఎస్ నారాయణ మూర్తి,డీఎస్, డైరెక్టర్ జనరల్(ఎంఎస్ఎస్) శ్రీహరి బాబు, మిస్సైల్ కాంప్లెక్స్ ప్రోగ్రాం డైరెక్టర్లు, డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, ఐఐటీహెచ్‌ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే.. కఠిన చర్యలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్ఎంసీ తాజాగా మార్గదర్శకాలను జారీచేసింది. వైద్య విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఈ అంశాలు కీలకమని పేర్కొంది. వైద్య విద్యార్థులు రోగులతో సమర్థవంతంగా మాట్లాడటానికి స్థానిక భాష నేర్చుకోవాలని కోరింది. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, వైద్యారోగ్య అత్యవసర పరిస్థితుల వంటి సందర్భాల్లో వీలైనంత సాయం చేయాలని సూచించింది.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

కేవలం చికిత్సకే పరిమితం కాకుండా వైద్యారోగ్య వ్యవస్థపై నమ్మకం కలిగేలా రోగి-వైద్యుడి సంబంధం ఉండాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని.. జాతీయ ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించింది. కేవలం పుస్తకాల నుంచే మాత్రమే కాకుండా అధ్యాపకుల అపార అనుభవం , ఆచరణాత్మక బోధన నుంచి నేర్చుకోవాలని పేర్కొంది. విద్యార్థులు ప్రాక్టికల్ రికార్డులు, కేస్‌షీట్లను శ్రద్ధగా నిర్వహించాలని.. కాపీ చేయడం, తారుమారు చేయడం వంటివి చేస్తే తగిన చర్యలు చేపడతామని హెచ్చరించింది.

...కలి'విడి'గానే!

▶ మొదటి పేజీ తరువాయి

కోరే విషయమై సీపీఎం నేతలు అంతర్గతంగా చర్చించికుంటున్నట్టు తెలుస్తోంది. ఇక సీపీఐ కూడా కనీసం మూడు అసెంబ్లీ స్థానాలు కావాల్సిందేనని పట్టుబట్టే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీ, ఇతర పదవుల గురించి కూడా చర్చించాలనే యోచనలో సీపీఐ పెద్దలున్నట్టు చెబుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగా పొత్తు విషయంలో తగ్గేదేలేదని ఆ పార్టీలు చెబుతున్నాయి. తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి, కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి బరిలో దిగేందుకు ఆసక్తి చూపుతున్నందున ఆ రెండు నియోజకవర్గాల తర్వాతే ఏ స్థానం గురించైనా చర్చ జరుగుతుందని వామపక్ష పార్టీలు స్పష్టం చేస్తున్నాయి.

ఒకరిద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం!

వామపక్ష పార్టీలతో పొత్తు చర్చలు జరుగుతాయి కానీ, అధికారికంగా పొత్తు కుదిరే అవకాశం లేదని బీఆర్ఎస్ వర్గాలు స్పష్టం చేస్తుండటం సందిగ్ధతకు తావిస్తోంది. 2014, 2018 ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తు కుదుర్చుకోలేదని, ఆ రెండు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి, 2023లో లెఫ్ట్‌తో కలిసి వెళితే తాము గతం కంటే బలహీనపడ్డామని తామే అంగీకరించినట్టు అవుతుందనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో లెఫ్ట్ నాయకుల్లో ఒకరిద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తారని, వారు కోరుతున్న స్థానాలను వదులుకునేందుకు బీఆర్ఎస్ అధిష్టానం సిద్ధంగా లేదని, స్నేహపూర్వక పోటీ ఉండే అవకాశముందని తెలంగాణ భవన్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఆ స్థానాల్లో కేడర్‌ను నిలబెట్టుకునేదెట్లా?

లెఫ్ట్‌తో పొత్తు అంశం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. ముఖ్యంగా వామపక్షాలు ఖచ్చితంగా అడుగుతాయని భావిస్తున్న స్థానాల్లో భద్రాచలం మినహా మిగిలిన చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఆయా స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న కందాల ఉపేందర్‌రెడ్డి, నల్లమోతు భాస్కరరావు, రవీంద్రనాయక్, వనమా వెంకటేశ్వరరావు తదితరులకు తమ నియోజకవర్గాల్లో కేడర్‌ను నిలబెట్టుకోవడం కత్తిమీద సాములా మారుతోంది. ఒకవేళ ఆయా స్థానాలు లెఫ్ట్ పార్టీలకు వదిలివేస్తే పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎక్కడ జారిపోతుందోననే ఆందోళన స్థానిక బీఆర్ఎస్ నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివాదాస్పద ప్రకటనలకు కూడా సిద్ధమవుతున్నారు. కమ్యూనిస్టులకు ఓట్లేసే రోజులు పోయాయని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వ్యాఖ్యానించడం గమనార్హం. మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కరరావు కూడా కొద్దిరోజుల క్రితం.. అక్కడ జూలకంటి రంగారెడ్డి సీపీఎం తరఫున పోటీ చేస్తే గెలుపు బాధ్యతలు తీసుకోవాలని చెప్పినా, ఆ తర్వాత సీపీఎం నేతలకు దూరంగా ఉంటున్నారు. కొత్తగూడెంలో అయితే వనమాతో పాటు జలగం వెంకట్రావు, గడల శ్రీనివాసరావు తమకంటే తమకే టికెట్ వస్తుందని చెప్పుకుంటున్నారు. మొత్తంమీద లెఫ్ట్ పార్టీలతో పొత్తు అంశం కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, ఆశావహులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

బీఆర్ఎస్ పెద్దల మదిలో ఏముందో?

కామ్రేడ్ల ఆలోచనలు ఎలా ఉన్నా.. వారితో తమ అనుబంధంపై బీఆర్ఎస్ పెద్దల మదిలో ఏముందన్నది అంతు పట్టడం లేదు. పలు సందర్భాల్లో లెఫ్ట్ పార్టీలతో పొత్తు అంశం తెరపైకి వస్తున్నప్పటికీ ఆ పార్టీ కీలక నేతలెవరూ ఎక్కడా బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలూ చేయడం లేదు. సీఎం కేసీఆర్ గానీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గానీ లెఫ్ట్ పార్టీలతో పొత్తు అంశాన్ని కనీస మాత్రంగా కూడా ప్రస్తావించడంలేదు. అయితే వామపక్ష పార్టీలకు చెందిన ముఖ్య నేతలకు ఎమ్మెల్సీ పదవులు ఇప్పిస్తామని, ఆయా స్థానాల్లో తామే పోటీ చేస్తామని స్థానికంగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. వామపక్ష పార్టీల నేతలకు రాజ్యసభ సభ్యత్వం ఇచ్చే అంశం కూడా ఎక్కడా చర్చకు రావడం లేదు.

కళ్లకు గంతలతోనే దర్యాప్తు

సత్యదూరంగా సీబీఐ రిమాండ్ రిపోర్ట్ • వాస్తవాలు, కుట్రకోణాలను విస్మరించిన సీబీఐ

సాక్షి, అమరావతి: ఏనుగు కాళ్లు, తొండం, తోక పట్టుకుని నలుగురు అంధులు గనక ఆ ఏనుగెలా ఉందో ఊహిస్తూ చెబితే ఏమవుతుంది? వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ కూడా ఇలాగే చేస్తోంది. వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసిన సీబీఐ... కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టు దీన్నే తలపిస్తోంది. కుట్రదారులెవరో నిగ్గుతేల్చే నిప్పు కణికల్లాంటి అంశాలను పూర్తిగా వదిలేసి దర్యాప్తు సాగిస్తుండటమే విస్మయం కలిగిస్తోంది. అవేంటంటే...

- వైఎస్ వివేకానందరెడ్డి రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయి. ఆస్తి కోసం..రాజకీయ వారసత్వం కోసం ఘర్షణలు చోటుచేసుకున్నాయి.
- మెజార్టీ ఓట్లు ఉన్నప్పటికీ స్థానిక కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన వైఎస్ వివేకానంద రెడ్డి ఓడిపోయారు. టీడీపీ గెలిచింది.
- వివేకా గుండెపోటుతో మరణించారని తొలిసారిగా చెప్పింది ఆయన పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డి. ఆయన తొలుత చెప్పింది టీడీపీ మంత్రి ఆది నారాయణరెడ్డికే.
- వైఎస్ అవినాశ్‌ను ఎంపీగా గెలిపించేందుకు తన తండ్రి కృషి చేస్తున్నారన్న సునీత... మళ్లీ మాట మార్చి అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఎందుకని?
- స్వయంగా హత్య చేశాదంటున్న దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడం సరైనదేనా?.. రూ.40 కోట్ల సుపారీ కట్టుకథలో అడుగడుగునా అవాస్తవాలే.
- నార్కో పరీక్షల్లో ఏమీ చెప్పని రంగయ్య తరువాత ఏదో చెప్పారట..!
- ఆధారాల ధ్వంసం అంటున్న సీబీఐ... ఆ మూడు వేలిముద్రలపై ఎందుకు మౌనంగా ఉంటోంది?
- వివేకా హత్య కుట్రదారులు ఆయన అల్లుడు, పెద్ద బావమరిదే అంటున్న తులసమ్మ మాటలనెందుకు పట్టించుకోరు?

ఇవీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక అంశాలు.. కానీ కళ్లకు గంతలు కట్టుకున్న రీతిలో సీబీఐ వాటినేమాత్రం పట్టించుకోవడం లేదు. ముందుగా నిర్ణయించుకున్నట్టుగా... ఎవరో ప్రభావితం చేస్తున్నారన్నట్టుగా ముందుకెళుతోంది. కుట్రదారులు ఎవరన్న కోణంలో కాకుండా...ముందే ఓ నిర్ణయానికి వచ్చేది ఆ దిశగా వెళుతోందనటానికి భాస్కర్‌రెడ్డి అరెస్టే తాజా తార్కాణం. తన చర్యను సమర్థించుకుంటూ సీబీఐ సమర్పించిన రిమాండ్ రిపోర్ట్ నిండా కల్పితాలు...ఊహాజనితాలు... అవాస్తవాలే!. ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థ కేవలం గాలిమాటలు పోగేసి రిమాండ్ నివేదికను రూపొందించడం ఆశ్చర్యమే మరి. రిమాండ్ రిపోర్ట్‌లో సీబీఐ ప్రస్తావించిన అంశాలు ఒకసారి పరిశీలిస్తే...

వివేకాను కుట్రపూరితంగా ఓడించిందెవరు?

వైఎస్ వివేకానందరెడ్డి 2017 కడప జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేశారు. తగినంత బలం ఉంది కనక గెలుస్తారన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు టికెట్టిచ్చారు. కానీ ఓడిపోయారు. అందుకు వైఎస్ భాస్కర్ రెడ్డే కారణమని వివేకా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సీబీఐ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. అందుకే వివేకాపై భాస్కర్‌రెడ్డి కక్ష పెంచుకున్నారన్నట్టుగా చెప్పింది. కానీ వాస్తవం ఏమిటంటే... ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఓడించింది స్వయానా చంద్రబాబు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వివేకానందరెడ్డి గెలుపు నల్లేరుపై నడకే. కానీ చంద్రబాబు పన్నాగంలో భాగంగా అప్పటి టీడీపీ మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి, టీడీపీ నేత బీటెక్ రవి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురిచేశారు. కుట్ర పూరితంగా వివేకాను ఓడించారు. ఇది వైఎస్సార్ జిల్లాలో బహిరంగ రహస్యం. అంటే వైఎస్ వివేకానందరెడ్డి ఎవరిపై ఆగ్రహించాలి? వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచినా.. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ చేరి మంత్రి అయి తనను ఓడించిన ఆదినారాయణ రెడ్డిపై కదా? సీబీఐ మాత్రం భాస్కర్‌రెడ్డిపై ఆగ్రహించినట్టుగా కట్టు కథను అల్లడం విస్మయ పరిచేదే.

- వివేకా రెండో వివాహంతో తలెత్తిన విభేదాలను పట్టించుకోని తీరు
- ఎమ్మెల్సీగా వివేకాను ఓడించిన టీడీపీ కుట్ర బేఖాతరు
- సునీత మాట మార్చడం వెనుక కారణాలనూ వెతికి తీయని వైనం
- హంతకుడిని అప్రూవర్‌గా మార్చి... కల్పితాలకు పెద్దపీట
- జైల్లో ఉండాల్సిన హంతకుడికి... బయట విలాసాల జీవితం
- సీబీఐకి కావాల్సినట్లుగా చెప్పటంతో మారిపోయిన దస్తగిరి లైఫ్
- కుట్రదారులు ఎవరనే కీలక అంశాలను అస్సలు పట్టించుకోని సీబీఐ
- ఆద్యంతం కట్టుకథ... అతుకుల బొంతగా భాస్కర్‌రెడ్డి రిమాండ్ రిపోర్ట్

ఇక వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఇప్పటికీ ఆదినారాయణ రెడ్డితో సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయి. తన తండ్రిని ఓడించిన ఆయనతో వారికి సన్నిహిత సంబంధాలు ఎందుకున్నాయి? వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కూడా తన భార్య, కుమార్తె, అల్లుడి ఒత్తిడితోనే వివేకానందరెడ్డి మంత్రి అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. వారి ఒత్తిడితోనే ఏకంగా వైఎస్ విజయమ్మపై పులివెందుల ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం తన చిన్నాన్నపై పూర్తి గౌరవంతో పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వైఎస్ వివేకానందరెడ్డికి రాజకీయ శత్రువులు టీడీపీ నేతలైన ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవిలేనని.. ఆయన రాజకీయ జీవితాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నించింది కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డేనని స్పష్టమవుతోంది. మరి ఈ దిశగా సీబీఐ ఎందుకు దర్యాప్తు చేయడం లేదన్నదే సందేహాలకు తావిస్తోంది.

ఎంపీ టికెట్ అవినాశ్ రెడ్డిదేనని అప్పటికే స్పష్టత

కడప సిట్టింగ్ ఎంపీగా ఉన్న అవినాశ్‌రెడ్డికే 2019 ఎన్నికల్లో కూడా టికెట్ ఇస్తున్నట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మౌఖికంగా ప్రకటించేశారు. దాంతో అవినాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కూడా మొదలుపెట్టారు. ఆయన ఎన్నికల ప్రచారానికి వైఎస్ వివేకానందరెడ్డే ఇన్‌చార్జి. ఆ విషయాన్ని వైఎస్ వివేకా హత్యకు గురైన తరువాత కూడా ఆయన కుమార్తె సునీత మీడియా ముఖంగా చెప్పారు. మరి కడప ఎంపీ టికెట్ కోసమే వైఎస్ వివేకాపై భాస్కర్‌రెడ్డి కుటుంబం కక్ష పెంచుకుందని టీడీపీ ఆరోపిస్తుండటం ఎంత నీచం!!.

గుండెపోటు కథ వివేకా పెద్ద బావమరిదిదే...

వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో నెత్తురు కక్కుకుని చనిపోయినట్టు భాస్కర్‌రెడ్డి ఇతర నిందితులతో కలసి ప్రచారం చేశారని సీబీఐ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. వాస్తవానికి వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని వైఎస్ అవినాశ్‌రెడ్డిగానీ వైఎస్ భాస్కర్‌రెడ్డిగానీ ఎవరికీ చెప్పలేదు. ఆ విషయాన్ని చెప్పింది వివేకానందరెడ్డి పెద్ద బావమరిది, అల్లుడికి సోదరుడు అయిన నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి. అది కూడా వైఎస్ వివేకా రాజకీయ శత్రువు, అప్పటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డితోనే ఆయన తొలుత చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న శివ ప్రకాశ్ రెడ్డి స్వయంగా మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వైఎస్ వివేకా గుండెపోటుతో చనిపోయారని చెప్పారు. సిగరెట్లు ఎక్కువగా తాగుతారు కనక ఇలా జరిగి ఉండొచ్చని తాను చెప్పినట్లు ఆదినారాయణ రెడ్డి స్వయంగా మీడియాకు చెప్పారు. అంతేకాదు నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డే ఎంపీ అవినాశ్ రెడ్డికి ఫోన్ చేసి.. వివేకా చనిపోయిన విషయాన్ని చెప్పారు. అప్పటికే ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగు వెళుతున్న ఎంపీ అవినాశ్... వెనక్కి తిరిగి వైఎస్ వివేకా ఇంటికి వెళ్లారు. ఆ ఫోన్ రాకపోయి ఉంటే అవినాశ్‌రెడ్డి జమ్మలమడుగు వెళ్లేవారు. ఎన్నికల ప్రచారం చేసుకునేవారు. వైఎస్ వివేకా మృతిచెందారని అందరికీ చెప్పింది శివ ప్రకాశ్‌రెడ్డి. గుండెపోటుతో మరణించారని చెప్పింది కూడా ఆయనే. కానీ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి చెప్పారంటూ సీబీఐ ఓ కల్పిత కథను రిమాండ్ రిపోర్ట్‌లో ప్రస్తావించటం విస్మయం కలిగిస్తోంది.

వివేకా రాసిన లేఖను ఎందుకు దాచిపెట్టారు?

వైఎస్ వివేకా మరణించే సమయంలో లేఖ రాశారు. రక్తపు మరకలతో కూడిన లేఖ అది. డ్రైవర్ ప్రసాద్ తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరచినట్టు ఆ లేఖలో వివేకా రాశారు. ఆ లేఖను ఆ రోజు ఉదయం 6.10 గంటలలోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి... వెంటనే ఆ విషయాన్ని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పారు. తాము వచ్చే వరకు ఆ లేఖను, వివేకా సెల్‌ఫోన్‌ను ఎవరికి ఇవ్వకుండా దాచి ఉంచాలని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పీఏ కృష్ణారెడ్డితో చెప్పారు. సునీత, ఆమె భర్త మధ్యాహ్నం 1గంట సమయంలో పులివెందుల చేరుకున్నారు. వారికి ఆ లేఖ, సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి అందించారు. చివరకు సాయంత్రం 5గంటలకు వారంతా కలిసి లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు.

ఇక్కడే అత్యంత కీలకమైన అంశం దాగి ఉంది. ఆ లేఖను దాచి ఉంచమని సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పకపోయి ఉంటే కృష్ణారెడ్డి వాటిని వెంటనే బయటపెట్టేవారు. శివప్రకాశ్‌రెడ్డి చెప్పిన సమాచారంతో అక్కడికి వచ్చిన అవినాశ్‌కు గనక దాన్ని చూపించి ఉంటే... వివేకాది హత్యేనని అందరికీ వెంటనే స్పష్టత వచ్చేది. గుండెపోటో మరొకటో కాదని వెంటనే తెలిసిపోయేది. అసలు ఎవ్వరూ మృతదేహాన్ని ముట్టుకునేవారే కాదు. కానీ ఆ లేఖను దాచి ఉంచమని చెప్పడమే కాకుండా... వివేకా గుండెపోటుతో చనిపోయారని టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డికి చెప్పింది వివేకానందరెడ్డి కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదే. వాస్తవం ఇలా ఉంటే... గుండెపోటు కథను భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ప్రచారంలోకి తీసుకువచ్చారని సీబీఐ రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొనడమే దర్యాప్తు తీరుపై సందేహాలకు తావిస్తోంది.

ఆనాడు సునీత మాట్లాడింది మరచిపోయారా?

తన తండ్రి హత్య వెనుక అసలు దోషి ఆదినారాయణ రెడ్డేనని సునీత 2019 మార్చిలో చెప్పిన విషయాలను సీబీఐ పరిగణనలోకి తీసుకోవడమే లేదు. వివేకా హత్య తరువాత సునీత హైదరాబాద్‌లో విలేకరుల సమావేశాన్ని పెట్టి... వైఎస్ కుటుంబంపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తమ కుటుంబం గురించి చంద్రబాబుకు ఏం తెలుసని ప్రశ్నించారు. ఒకర్ని ఒకరు చంపుకునే చరిత్ర తమ కుటుంబానికి లేదన్నారు. కేవలం వైఎస్ జగన్ వ్యక్తిత్వ హననానికే టీడీపీ ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తోందని సునీత మండిపడ్డారు. చంద్రబాబు అసలు ఆదినారాయణ రెడ్డిని ఎందుకు కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని కూడా ఆమె సూటిగా ప్రశ్నించారు. ప్రజలు ఎవరూ చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఆనాడు అలా మాట్లాడిన సునీత ఇప్పుడెందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారు?. ఎవరి ఒత్తిడి, ప్రలోభాలకు లొంగి సునీత మాట మార్చారు? ఆమె ఢిల్లీ వెళ్లినప్పుడల్లా వెనకుండి కథ నడిపిస్తున్నది ఎవరు? వ్యవస్థలను ప్రభావితం చేస్తూ దర్యాప్తును పక్కదారి పట్టిస్తోంది ఎవరు? వీటిని సీబీఐ ఎందుకు పరిగణలోకి తీసుకోవటం లేదు?

హంతకుడే అప్రూవరా...!?

రిమాండ్ రిపోర్ట్‌లో సీబీఐ పేర్కొన్న మరో అంశం కూడా ఆ సంస్థ విశ్వసనీయతను శంకించేలా చేస్తోంది. వైఎస్ వివేకాను గొడ్డలితో స్వయంగా నరికినట్లు చెప్పిన నిందితుడు దస్తగిరిని సీబీఐ అప్రూవర్‌గా మార్చడం న్యాయ నిపుణులను విస్మయపరుస్తోంది. హత్య చేసిన వ్యక్తి జైల్లో కాక దర్జాగా బయట తిరుగుతున్నారు. అతని బెయిల్ పిటిషన్‌ను సీబీఐ వ్యతిరేకించలేదు. హంతకుడైన దస్తగిరి తో కల్పితాలు, అభూతకల్పనలు చెప్పించి... వాటి ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతుండటం వెనుక మర్మమేమిటి?

రూ.40కోట్ల సుపారీ కట్టుకథే..

దస్తగిరి అప్రూవర్ వాంగ్మూలం పేరిట సీబీఐ అల్లిన మరో కట్టుకథ రూ.40 కోట్ల సుపారీ స్టోరీ. వైఎస్ వివేకాను హత్య చేయడానికి రూ.40 కోట్లకు సుపారీ కుదిరిందని, అందులో రూ.5కోట్లు అడ్వాన్స్ వచ్చిందని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పి తనకు రూ.కోటి ఇచ్చారని దస్తగిరి వాంగ్మూలంలో చెప్పినట్టు సీబీఐ పేర్కొంది. మరి అదే సీబీఐ వెలికి తీసిన దస్తగిరి, సునీల్ యాదవ్ మధ్య వాట్సాప్ సందేశాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. వివేకా హత్యకు రెండు రోజుల ముందు వరకు... ఆ తరువాత కూడా దస్తగిరి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానంటూ సునీల్ యాదవ్‌కు మెస్సేజులు చేశారు. కనీసం రూ.2 వేలు అయినా అప్పు ఇవ్వాలని... రూ.500 ఇచ్చినా ఆ పూట ఖర్చుకు సరిపోతాయని ప్రాథేయపడ్డారు. ఆ వివరాలన్నీ కూడా సీబీఐనే వెల్లడించింది. మరి దస్తగిరి రూ.కోటి అడ్వాన్స్‌గా తీసుకుని ఉంటే రూ.500 అప్పు ఎందుకడుగుతాడు? అంటే రూ.40కోట్ల సుపారీ కట్టు కథే కదా?

అప్రూవర్‌గా మారగానే దస్తగిరికి దబ్బూదస్కం

ఇక అప్పటివరకు కటిక పేదరికంలో కొట్టుమిట్టాడిన దస్తగిరి అప్రూవర్‌గా మారిపోగానే ఒక్కసారిగా ధనవంతుడైపోయాడు. ఒక్కసారిగా కార్లతో తిరుగుతూ... ట్రాక్టర్లు కొనుగోలు చేసి... సెటిల్‌మెంట్లు మొదలు పెట్టాడు. అంటే అప్రూవర్‌గా మారి వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలకు వ్యతిరేకంగా వాంగ్మూలమిచ్చినందుకు అతనికి భారీగానే ముట్టిందన్నది తేటతెల్లమవుతోంది. మరి తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని దస్తగిరిని ప్రలోభపెట్టింది ఎవరు?

నార్కో టెస్టుల్లో ఏమీ చెప్పని రంగయ్య...!

అభిషేక్ మహంతి ఎస్పీగా ఉన్నప్పుడు ఈ కేసు దర్యాప్తులో భాగంగా వాచ్‌మేన్ రంగయ్యను విచారించారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన గుజరాత్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తీసుకువెళ్లి అతనిపై నార్కో ఎనాలిసిస్ టెస్ట్, బ్రెయిన్ మ్యాపింగ్, లై డిటెక్టర్ టెస్టులు నిర్వహించారు. నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించిన ఆ పరీక్షల్లో కూడా రంగయ్య ఏమీ చెప్పలేకపోయాడు. కానీ ఆ రోజు రాత్రి ఎర్రగంగిరెడ్డి, దస్తగిరి, సునీల్ యాదవ్‌లతోపాటు మరో వ్యక్తిని చూశానని రంగయ్య తమ దర్యాప్తులో చెప్పారని సీబీఐ అంటోంది. నార్కో పరీక్షల్లోనే ఏమీ చెప్పలేని రంగయ్య అన్ని నెలల తరువాత సీబీఐ అధికారులు మామూలుగా అడిగితే ఇవన్నీ చెప్పారట!. నమ్మశక్యమా?

తులసమ్మ పిటిషన్‌లోని అంశాలపై దర్యాప్తే లేదు

వివేకా హత్యకు కారణాలపై డి.శివ శంకర్ రెడ్డి భార్య తులసమ్మ పలు సందేహాలను లేవనెత్తుతూ పులివెందుల న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు, రాజకీయ వారసత్వం, ఆస్తి పై హక్కుల కోసం కుమార్తె, అల్లుడితో విభేదాలు, నియోజకవర్గంపై ఆధిపత్యం కోసం టీడీపీ నేత బీటెక్ రవి కక్షగట్టడం, ఆర్థిక విభేదాలతో కక్ష పెంచుకున్న అనుచరుడు కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డి టీడీపీ నేత బీటెక్ రవితో కలసి కుట్ర పన్నటం, రాజకీయ విభేదాలు ఉన్న తాడిపత్రి నేత రాజేశ్వరరెడ్డి, అతనికి సహకరించిన నీరుగట్టు ప్రసాద్‌ల ప్రమేయం...ఇలా తులసమ్మ లేవనెత్తిన కీలకమైన అంశాలను న్యాయస్థానం నమోదు చేసింది. కానీ సీబీఐ వీటిని దర్యాప్తులో కనీసం పరిగణలోకే తీసుకోవటం లేదు.

ఆ 3 వేలి ముద్రలపై మౌనం ఎందుకో...!

వివేకా హత్య స్థలంలో ఆధారాలను ధ్వంసం చేశారనేది భాస్కర్‌రెడ్డి మీద సీబీఐ చేసిన ప్రధాన అభియోగం. ఆ ఆరోపణ పూర్తిగా అహేతుకం. మరి అదే సమయంలో వివేకా హత్య ప్రదేశంలో లభించిన కీలకమైన ఆధారాలను సీబీఐ ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదు? మృతదేహం పడి ఉన్న బాత్‌రూమ్‌లో లభించిన వేలి ముద్రలను నిపుణులు పరిశీలించి పలువురి వేలిముద్రలతో సరిపోల్చారు. కానీ వాటిలో అయిదు వేలి ముద్రలు ఎవరితోనూ సరిపోల లేదు. వాటిలో మూడు వేలిముద్రలు పూర్తిగా ఉండగా... మరో రెండు పాక్షికంగా ఉన్నాయి. బాత్‌రూమ్ గోడలు, తలుపు వెనుక భాగంలో ఆ వేలి ముద్రలను గుర్తించారు. పూర్తిగా ఉన్న ఆ 3 వేలి ముద్రలు ఎవరివన్నది ఇప్పటివరకు తేలలేదు. సీబీఐ ఆ విషయాన్నే పట్టించుకోలేదు. ఆ వేలి ముద్రలెవరివో గుర్తిస్తే అసలు దోషులెవరో తెలుస్తుంది కదా?

సీబీఐ వేధింపులపై ఫిర్యాదులు బుట్టదాఖలు

వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సీబీఐ తనను చిత్రహింసలకు గురి చేసిందని... ఇంకా వేధిస్తోందని కల్లూరు గంగాధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా సీబీఐ స్పందించ లేదు. ఎంపీ అవినాశ్, భాస్కర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సీబీఐ తనను వేధిస్తోందని ఉదయ్ కుమార్‌రెడ్డి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా సీబీఐ తీరు మారలేదు.

కొత్త బృందం...పాత కక్షే..: వివేకా హత్య కేసులో రామ్‌సింగ్ నేతృత్వంలోని సీబీఐ అధికారుల బృందం గతంలో ఎంత అసంబద్ధంగా వ్యవహరించిందో అందరికీ తెలుసు. తాము చెప్పని విషయాలను కూడా చెప్పినట్టుగా వాంగ్మూలం రాసుకున్నారని పలువురు సాక్షులు వాపోయారు. తాము కోరుకున్నట్లు వాంగ్మూలమివ్వాలని చిత్రహింసలకు గురి చేస్తోందని మరికొందరు బాధితులు పోలీసులను కూడా ఆశ్రయించారు. దాంతో ఈ కేసులో నిష్పాక్షిక దర్యాప్తు చేయాలని బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ అధికారి రామ్‌సింగ్‌ను న్యాయస్థానం తొలగించి కొత్త బృందాన్ని నియమించాలని సీబీఐని ఆదేశించింది. కొత్త అధికారుల బృందం వస్తే కొత్త కోణంలో దర్యాప్తు చేసి కొత్త అంశాలను వెలికి తీస్తారని అంతా ఆశించారు. కానీ కొత్త బృందం వచ్చింది కానీ ఒక్క కొత్త ఆధారాన్ని కూడా కనుగొనలేదు. పైగా పాత బృందం అసంబద్ధంగా చేసిన దర్యాప్తునే ఆధారంగా చేసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఏప్రిల్ 30లోగా కేసు దర్యాప్తును ముగించాలన్న ఉద్దేశంతో కక్షపూరితంగా కొందర్ని లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తోందన్నది తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఉదయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిల అరెస్టుకు గతంలో సీబీఐ బృందం చెప్పిన అహేతుక కారణాలనే కొత్త బృందం కూడా వల్లేవేయడం విస్మయపరుస్తోంది.

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు

సీబీఐ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్న మరో అంశం... వివేకానందరెడ్డి రెండో వివాహం ...దాంతో ఆ కుటుంబంలో తలెత్తిన తీవ్ర విభేదాలు, ఆస్తి తగాదాలు. వీటిని సీబీఐ నామమాత్రంగానైనా దర్యాప్తు చేయకపోవడం వెనుక ఎవరి ఒత్తిడి ఉందన్నది ప్రశ్నగా మారుతోంది. షమీమ్ అనే ముస్లిం మహిళను వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకున్నారని.. వాళ్లిద్దరికీ ఒక కుమారుడు కూడా పుట్టాడని... ఆ కుమారుడికి ఆస్తిలో భాగంతో పాటు తన రాజకీయ వారసుడిగా చేస్తానని ప్రకటించారన్నది ఆ జిల్లాలో అందరికీ తెలిసిందే. దాంతో వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి ఆయనతో తీవ్రంగా గొడవపడ్డారు. ఆయన్ని వదిలి కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వివేకా ఒక్కరే పులివెందులలో ఉంటున్నారు. బెంగళూరులో ఓ భూమి సెటిల్‌మెంట్ ద్వారా వచ్చే రూ.2 కోట్లను తన రెండో భార్యకు ఇవ్వాలని వివేకా నిర్ణయించారు. దాంతో సునీత ఆయనతో గొడవపెట్టుకున్నారు. అంతేకాక సునీత, ఆమె భర్త నర్రెడ్డి, బావగారు శివ ప్రకాశ్‌రెడ్డి షమీమ్ ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగారు. వివేకాను విడిచిపెట్టకపోతే ఆమె కుమారుడిని చంపేస్తామని బెదిరించారు. వివేకానందరెడ్డి అప్పటికే ఆమెకు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను బలవంతంగా తీసుకున్నారు. షమీమ్, వైఎస్ సునీత మధ్య వాట్సాప్‌లో వాదోపవాదాలు సాగాయి. ఒకర్ని ఒకరు దూషించుకున్న వాట్సాప్ మెస్సేజులను కూడా గతంలో సిట్ అధికారులు గుర్తించారు. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని... ఆమె కుమారుడికి హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా... అవ్వడం లేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. ఈ వారసత్వ, ఆస్తి గొడవలే వివేకా హత్యకు ప్రధాన కారణమయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. ఎందుకంటే వివేకానందరెడ్డి లేకపోతే ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బామమరిదికే ఎక్కువ ప్రయోజనం. కానీ సీబీఐ మాత్రం ఈ కీలకాంశాలన్నిటినీ విస్మరిస్తూ ఏకపక్షంగా కక్షపూరితంగా దర్యాప్తు చేస్తోందనే విమర్శలున్నాయి.



కుమారుడు, భార్య షమీమ్‌తో వివేకా (ఫైల్)

ఆనాడు చంద్రబాబు రాజీనామా చేశారా...!

భాస్కర్‌రెడ్డి అరెస్టుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని టీడీపీ డిమాండ్ చేస్తుండటం విడ్డూరంగా ఉంది. అసలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే వైఎస్ వివేకా హత్యకు గురయ్యారు. ఆ హత్య వెనుక అప్పటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డి ప్రమేయం ఉందని సునీత అప్పట్లోనే ఆరోపించారు. మరి ఆ రోజు చంద్రబాబు తన పదవికి రాజీనామా చేశారా...! వైఎస్ వివేకా హత్యపై మొదటిసారి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది చంద్రబాబు ప్రభుత్వమే. మూడు నెలలు టీడీపీ అధికారంలో ఉంది. మరి ఆ 3 నెలల్లో వైఎస్ వివేకా హత్య వెనుక భాస్కర్‌రెడ్డి, అవినాశ్ రెడ్డి ప్రమేయం ఉందని సిట్ ఎందుకు ఆధారాలు చూపించలేకపోయింది?. వైఎస్ కుటుంబంలోని వారి పాత్ర ఉందంటే చంద్రబాబు ఆ కేసును తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుని ఉండేవారు కదా. మరి ఆనాడు సిట్ పోలీసులతోపాటు టీడీపీ నేతలు కూడా వైఎస్ వివేకా హత్య వెనుక భాస్కర్‌రెడ్డి కుట్ర ఉందని చెప్పనే లేదు కదా. అంటే ఆ హత్య వెనుక వారి ప్రమేయం లేనట్టే కదా. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఏనాడూ సిట్ దర్యాప్తును ప్రభావితం చేయలేదు. సీబీఐ దర్యాప్తునకు కూడా హైకోర్టు సాక్షిగా సమ్మతించారు. విచారణను తెలంగాణకు మారుస్తామన్నా కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ సమ్మతిని తెలిపింది తప్ప వ్యతిరేకించ లేదు కదా?. ఇది చాలదూ వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవస్థలను ఎంత గౌరవిస్తోందో చెప్పటానికి?

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్

- పులివెందులలో అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు



వైద్య పరీక్షల నిమిత్తం భాస్కర్‌రెడ్డిని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

పులివెందుల/సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి, వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డిని సీబీఐ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. తెల్లవారుజామున 5.30 గంటలకు సీబీఐ అధికారులు పులివెందులలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరినీ సీబీఐ అధికారులు లోనికి అనుమతించలేదు. మీడియా ప్రతినిధులను కూడా ఆ పరిసర ప్రాంతాల్లోకి రానివ్వలేదు. సుమారు 2 గంటలపాటు భాస్కర్‌రెడ్డిని విచారించిన వారు.. ఆయన సతీమణి లక్ష్మమ్మకు 120బి, 201, 302 సెక్షన్ల కింద ఆయన్ను అరెస్టు చేస్తున్నట్లు మెమో పత్రాలు ఇచ్చారు. అనంతరం ఆయన్ను వారి వాహనంలో ఎక్కించుకుని కడప మీదుగా హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మధ్యాహ్నం భాస్కర్‌రెడ్డిని వైద్య పరీక్షల కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అవుట్ పేషంట్ బ్లాకులోని అత్యవసర విభాగంలో ఆయనకు ఈసీజీ, బీపీ, సుగర్, 2డి ఎకో, కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయనకు బీపీ ఎక్కువగా ఉండటంతో కొద్ది సేపు వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అక్కడ సుమారు రెండు గంటలపాటు వైద్య పరీక్షల అనంతరం సీబీఐ అధికారులు.. ఆయన్ను సీబీఐ న్యాయమూర్తి నివాసానికి తీసుకువెళ్లి హాజరు పరిచారు. జడ్జి ఆయనకు 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో భాస్కర్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

నిజాలు దాచి దర్యాప్తా?

▶ మొదటి పేజీ తరువాయి

బాధగా ఉందన్నారు. వ్యతిరేక శక్తులు, వ్యతిరేక మీడియాతో పోరాటం చేయడంలో నిజాయితీ నిరూపించుకోవడం సవాల్‌గా నిలుస్తోందని చెప్పారు. సీబీఐ కీలక అంశాలను డౌన్‌ప్లే చేసి, సిల్లీ అంశాల ఆధారంగా ఎందుకు విచారణ కొనసాగిస్తోందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మునుపటి అధికారి చేసిన రోల్ కంటిన్యూ చేయడం మినహా విచారణలో ప్రధాన కోణం వెలుగు చూడడం లేదన్నారు. ఇలా అవినాశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడిన కొద్ది గంటలకే సోమవారం మరోమారు విచారణకు హాజరు కావాలంటూ సీబీఐ నోటీసులు ఇవ్వడం గమనార్హం. అవినాష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడిన అంశాలు ఇంకా ఇలా ఉన్నాయి.

డెత్ నోట్ దాచి పెట్టింది అల్లుడే..

- వైఎస్ వివేకానందరెడ్డిది హత్య అని తెలిసీ, డెత్ నోట్ చదివి వినిపించిన పీఏ కృష్ణారెడ్డితో దానిని ఎవరికీ చూపించకుండా దాచి పెట్టమని అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆదేశించారు. ఆ మేరకు కృష్ణారెడ్డి ఆయన చెప్పినట్లే చేశారు. వాస్తవాలు చెప్పకుండా ఘటనా స్థలం వద్దకు నన్ను వెళ్లమని నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి ఫోన్‌లో కోరారు.
- నేను అక్కడికి వెళ్లి చూశాక ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చాను. హత్య విషయం నా కంటే గంట ముందుగా వివేకా అల్లుడికి తెలుసు. పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన ఆయన విషయాన్ని దాచారు. వివేకా హత్య విషయాన్ని ముందుగా పోలీసులకు తెలిపింది నేనే. సీఐ శంకరయ్యకు స్వయంగా మూడు సార్లు ఫోన్ చేశాను. 35 నిమిషాల తర్వాత సీఐ వచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన నన్నే దోషిగా చూపిస్తున్నారు.
- ఆ రోజు జమ్మలమడుగుకు వెళ్తున్న నాకు ఫోన్ రావడంతో కృష్ణాలయం సమీపం నుంచి వెనుతిరిగి వచ్చాను. నేనొక్కడినే కాకుండా, నాతో పాటు నాలుగు వాహనాలు ఉన్నాయి. మీరు చెబుతున్న గూగుల్ టేకౌట్ ద్వారా పరిశీలించుకోండి. వాస్తవమో కాదో తెలుస్తుంది.

డాక్యుమెంట్లు చోరీకి గురయ్యాయి..

- ఏ–4 దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వివేకా హత్య అనంతరం స్టాంప్ డాక్యుమెంట్లు తీసుకున్న తర్వాతే ఇంట్లో నుంచి బయటికి వచ్చినట్లు చెప్పాడు. దీనిని బట్టి డాక్యుమెంట్లు దొంగిలించారని స్పష్టం అవుతోంది. అలాంటప్పుడు దొంగతనానికి చెందిన సెక్షన్లు సీబీఐ ఎందుకు పెట్టలేదు?
- తన ఐడియా ప్రకారమే డెత్‌నోట్‌లో డ్రైవర్ ప్రసాద్ పేరు రాయించానని దస్తగిరి చెబుతున్నాడు. దస్తగిరి చంపి, సంబంధం లేని వారిపై ఆరోపణలు చేస్తున్నాడు. ఆ మేరకు ఉన్న ఐపీసీ సెక్షన్లు ఎందుకు పెట్టలేదు? మరోవైపు వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌లో హత్యలో పాల్గొన్న నలుగురి పేర్లతో సహా చెబుతారు. అయినా నిందితుల్లో ఒకరిని సాక్షిగా పరిగణనలోకి తీసుకుంటారు. ఇవన్నీ చూస్తే కలిసికట్టుగా పద్ధతి ప్రకారం విచారణ సాగుతోందని అర్థమవుతోంది.
- ఏప్రిల్ 3న రిజిస్టర్ పోస్టు ద్వారా సీబీఐ డైరెక్టర్, డీఐజీ, ప్రస్తుత ఐఓకు పలు వివరాలు ఆధారాలతో పంపించాను. 5వ తేదీ మనిషి ద్వారా కూడా వారికి చేర్చాను. ఏమాత్రం మార్పు లేదు. బెంగళూరు సెటిల్‌మెంట్‌లో రూ.8 కోట్లు రావాల్సి ఉండగా, ఆ డబ్బులో సగం ఇవ్వాలని డిమాండ్ చేసిన తర్వాత జరిగిన ఘర్షణలో చంపినట్లు దస్తగిరి చెబుతాడు.
- వాస్తవంలో అవి ఫేక్ డాక్యుమెంట్లు అని తేలిపోయింది. అసలే రాని, లేని డబ్బు కోసం గొడవ జరుగుతుందా? ఇలాంటి ప్రశ్నలను ఎందుకు సీబీఐ ఛేదించడం లేదు? డాక్యుమెంట్లు తీసుకెళ్లామని దస్తగిరి చెబుతున్నాడు.. ఆ డాక్యుమెంట్లను ఎందుకు రికవరీ చేయలేదు? అందులో ఏముంది? అన్న విషయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యకరం.

సునీతక్క వర్షన్ సడన్‌గా మారింది

- 2019 మార్చి 15న హత్య జరిగితే, టీడీపీ నేతల ఆరోపణల నేపథ్యంలో వైఎస్ కుటుంబం ఔన్నత్యాన్ని సునీతక్క స్పష్టంగా వివరించింది. సీఎంగా వైఎస్ జగనన్నను, ఎంపీగా నన్ను చేసుకోవాలని కొద్ది నెలలుగా వైఎస్ వివేకానందరెడ్డి తపన పడ్డారని ఆమె స్పష్టంగా తెలిపింది. ఒక సంవత్సరం వరకూ బాగా మాట్లాడేది. ఎర్రగంగిరెడ్డి వైఖరిపై నా అభిప్రాయం కూడా కోరింది. చెప్పాను. సడన్‌గా వైఖరి మార్చుకొని ఢిల్లీకి వెళ్లి ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు చేసింది. కారణమేంటో సునీతక్కే చెప్పాలి.
- హత్యలో స్వయంగా పాల్గొన్నానని చెప్పిన దస్తగిరి ముందస్తు బెయిల్ కోసం సీబీఐ నో అబ్జక్షన్ చెబుతోంది. రెండేళ్లుగా కోర్టులో ఎవరు బెయిల్ పిటిషన్ వేసినా ఇంప్లీడ్ అయ్యే సునీతమ్మ, దస్తగిరి ముందస్తు బెయిల్‌కు మాత్రం అభ్యంతరం చెప్పరు. ఆ తర్వాత అప్రూవర్ అనే అబద్ధాల కట్టడం వెలుగులోకి వచ్చింది.
- అప్రూవర్‌గా మారితే కేసు విచారణ పూర్తయ్యే వరకు లోపల ఉండాల్సి వస్తుంది కాబట్టి ముందస్తు బెయిల్‌కు అభ్యంతరం చెప్పడం లేదు. అటు సీబీఐ, ఇటు సునీతమ్మ కలిసికట్టుగా ప్రణాళిక బద్ధంగా కేసును పక్కదారి పట్టిస్తున్నారని స్పష్టంగా అర్థం అవుతోంది.

మేము ఏ తప్పూ చేయలేదు

- మా నాన్న 40 ఏళ్లుగా మీ అందరికీ తెలుసు. మా మనస్తత్వాలు తెలుసు. నా నిజాయితే నన్ను గెలిపిస్తోంది. వివేకం సార్ హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మేము ఇసుమంతైనా తప్పు చేయలేదు. ఎల్లో మీడియా విష ప్రచారాలను నమ్మొద్దు.
- 2009 నుంచి నేను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నాను. తొలుత లింగాల మండలం ఇన్‌ఛార్జిగా పని చేశా. పదేళ్లుగా నేనేంటో అందరికీ తెలుసు. ఈ 3650 రోజుల్లో 1500 రోజులు ఉదయ్‌కుమార్‌రెడ్డి నాతో కలిసి ఉంటాడు. కానీ ఆ రోజు ఉదయమే వచ్చినట్లు చెబుతున్నారు. ఇంకో విషయం.. థర్డ్ పర్సన్ ఫోన్ కోసం నేను వెయిట్ చేసినట్లు మరో విషయాన్ని చెబుతున్నారు. అదే వాస్తవమైతే నేనే అక్కడికి ఎవర్నో పంపించి ఫోన్ చేయించుకునే వాడిని కదా.. చాలా సిల్లీ థింగ్స్ ఆధారంగా విచారణ చేస్తున్నారు. విచారణలో సీబీఐ కీలక విషయాలను వదిలేసింది. అప్రూవర్ అనే అబద్ధాల కట్టడం కోర్టులో నిలిచే అవకాశమే లేదు. మా కు పదవులపై వ్యామోహం లేదు. న్యాయస్థానాలపై నమ్మకం ఉంది. వ్యవస్థలపై గౌరవం ఉంది. న్యాయం కోసం పోరాటం చేస్తాం. వ్యక్తి టార్గెట్‌గా చేస్తున్న విచారణలో తుదకు న్యాయమే గెలుస్తుంది.

అవినాష్‌రెడ్డికి సీబీఐ నోటీసులు

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా ఆదివారం ఉదయం వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేయడం గమనార్హం. ఇప్పటికే సీబీఐ అధికారులు పలుమార్లు ఆయన్ను విచారించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాదులోని సీబీఐ కార్యాలయంలో మరోసారి విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

భాస్కర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వండి

సీబీఐ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన భాస్కర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ సీబీఐ కోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో పాటు ఉదయ్‌కుమార్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సోమవారం సీబీఐ కోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. కాగా, 2019 మార్చి 15న వివేకానందరెడ్డి మృతదేహం రక్తపు మడుగులో బాత్రూమ్‌లో లభ్యమైందని, ఈ హత్య వెనుక భారీ కుట్ర ఉందని సీబీఐ రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. రిమాండ్ రిపోర్ట్‌లో ఇంకా ఏం చెప్పిందంటే..

వివేకాతో వారికి పలు విభేదాలు

'వివేకానందరెడ్డితో భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి పలు విభేదాలు ఉన్నాయి. 2017లో ఎమ్మెల్సీగా పోటీ చేసిన వివేకా ఓడిపోయారు. ఈ ఓటమికి పై ఇద్దరే కారణమని వివేకా తీవ్ర ఆగ్రహంతో ఉండేవారు. హత్య చేసిన వారు కూడా భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు. ఈ కేసులో భాస్కర్‌రెడ్డి సహా పలువురు కీలక వ్యక్తులు ఉన్నారని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. హంతకులకు రూ.40 కోట్లు ఇస్తానని శివశంకర్‌రెడ్డి హామీ ఇచ్చాడని దస్తగిరి చెప్పాడు. హత్య చేసే ప్రక్రియలో ఏ–1, ఏ–2, ఏ–3, ఏ–4 లను వివేకా ఇంటి వాచ్‌మెన్ రంగన్న చూశాడు. ఆ రోజు రాత్రి సుమారు 1.58 గంటల సమయంలో సునీల్‌యాదవ్ భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్నట్లు అతని మొబైల్ లొకేషన్ చూపించింది. ఇది విచారణలో తేలింది. భాస్కర్‌రెడ్డి ఇతరులతో మాట్లాడినట్లు.. వారు అంతా చూసుకుంటారని హత్య తర్వాత ఎర్ర గంగిరెడ్డి.. ఇతర నిందితులకు చెప్పాడు. ఆ తర్వాత వివేకా గుండెపోటుతో చనిపోయారని.. భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ కథ అల్లారని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. అవినాశ్‌రెడ్డి.. అతని పీఏ రాఘవరెడ్డి ఫోన్ నుంచి సీఐ శంకరయ్యకు కాల్ చేశారు. వివేకా మృతి చెందారని చూసిన తర్వాతే అవినాశ్ ఫోన్ చేసినట్లు ఇదే ఆధారం. సాధారణ మరణం అని చెప్పడం కోసమే ఇదంతా చేశారు. ఆ తర్వాత రక్తపు మరకలను తుడిచి వేశాక మృతదేహాన్ని బెడ్‌రూంలోకి మార్చారు. ఈ హత్యలో వైఎస్ భాస్కర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. మా విచారణలోనూ భాస్కర్‌రెడ్డి సహకరించలేదు. అందువల్ల కస్టడీకి ఇవ్వాలని కోరుతున్నాం' అని సీబీఐ కోరింది.



సహనం అనేది చేదుగా ఉంటుంది.
కానీ దాని ఫలం ఎంతో తీపి.
– అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, 17 ఏప్రిల్ 2023

మనసున మల్లెల మాలలూగెనే!

వసంత గ్రీష్మాలు వేసవికాలం. నింగిలోని సూర్యుడు నిప్పులు చెరిగే కాలం. ఇది ప్రకృతిలోని ఒక పార్శ్వం మాత్రమే! మండుటెండల ధాటికి అల్లాడిపోయే ప్రాణికోటి తాపోపశమనానికి తగిన వెసులుబాట్లను కూడా ప్రకృతి ఏర్పాటు చేసే ఉంచింది. ఏటా వేసవిలోనే నోరూరించే మామిడి పండ్లు విరివిగా పండుతాయి. వేసవిలోనే మల్లెలు విరగబూస్తాయి. వేసవులే లేకపోతే, మామిళ్ల మాధుర్యం, మనసుదోచే మల్లెల పరిమళం మనకు దక్కేవేనా? మల్లెలు, మామిళ్ల కోసమైనా ఏటా వేసవులు రావాల్సిందే! మన సాహిత్యంలో ఎందరెందరో కవులు మల్లెల సౌరభాన్ని వెదజల్లారు.

'మెండు మీఱిన పతగ బీఱెండ దాకి/ యొల్లబోయిన లేబొండుమల్లెపొదల/ తుదల జప్పటలై కడుదొడ్డ లగుచు/ బొడమ మొగ్గలగము లగ్గిబొబ్బలట్లు' అని శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్త మాల్యద' కావ్యంలో వర్ణించాడు. మండువేసవి వేడికి బొండుమల్లెల పొదల చివుళ్లు వాడి అణగి పోయి ఉంటే, వాటి మధ్య పెద్ద పెద్ద మల్లె మొగ్గలు అగ్గిబొబ్బల్లా కనిపించాయట! వేసవిలో ఒంటి మీద పుట్టే సెగ్గడ్డలు ఎవరికైనా అగ్గిబొబ్బల్లానే కనిపిస్తాయి. రాయలవారికి మాత్రం వాడిన చివుళ్ల మధ్యనున్న బొండుమల్లెల మొగ్గలు అగ్గిబొబ్బల్లా కనిపించడం విచిత్రం కాదు, ఆయన వర్ణనా వైదుష్యానికి నిదర్శనం కూడా!

రాయలవారి కంటే ముందు పోతనామాత్యుడు కూడా తన కవిత్వంలో మల్లెలను ప్రస్తావించాడు. 'నల్లనివాడు పద్మనయనమ్ములవాడు... మల్లియలార మీ పొదల మాటున లేడు గదమ్మ! చెప్పరే!' అంటూ గోపికలు నల్లనయ్య జాడ కోసం మల్లెలను ఆరాతీశారట! వాటి పొదల మాటునే ఆ నల్లనివాడు నక్కి ఉంటాడని వాళ్ల అనుమానం పాపం! మన పదకవితా పితామహుడు అన్నమయ్య కూడా శ్రీనివాసుని తలపులతో ఉన్న శ్రీదేవి విరహాన్ని మల్లెలతో పోల్చాడు. 'పొలతి జవ్వనమున బూవక పూచె/ యెలమి నిందుకు మనమేమి సేసేదో' అనే కీర్తనలో 'సతి చింతా లతలలో సంపెంగపూవులు పూచె/ మతి విరహపు మేన మల్లెలు పూచె' అన్నాడు. శ్రీనివాసుని తలపులతోనున్న శ్రీదేవి ఆలోచనల్లో తొలుత సంపెంగలు పూచాయట! మదిలో విరహతాపం మొదలైనప్పుడు మల్లెలు పూచాయట!

వేసవి వేడిని చవిచూసే ప్రతిదేశంలోనూ మల్లెలు పూస్తాయి. మన దేశం నలుచెరగులా మల్లెలు ప్రతి వేసవిలోనూ విరివిగా కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే, మల్లెల ఉత్పాదనలో ఈజిప్ట్, భారత్ పోటాపోటీగా ఉంటున్నాయి. మల్లెలను ఎరిగిన ప్రతి దేశంలోనూ ప్రజలు మల్లెలను ఇష్టపడతారు. అయితే, మిగిలిన జనాలతో పోల్చుకుంటే, మల్లెలంటే మన తెలుగువాళ్లకు మరి కొంచెం మక్కువ ఎక్కువ. 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' అంటూ శంకరంబాడి సుందరాచారి తెలుగుతల్లిని తన మాటల మల్లెపూలదండతో అలంకరించడమే ఇందుకు తిరుగులేని నిదర్శనం.

మన సాహిత్యంలోని ఆధునికుల్లో మల్లెలను అమితంగా ఆరాధించినవాడు చలం. ఆయనకు మల్లెలను అలంకరించుకునే అలవాటు కూడా ఉండేది. మల్లెపూల గురించి ఆయన అద్భుతమైన కవిత రాశారు. 'మల్లెపూలు, తెల్లని మల్లెపూలు!...' అంటూ సాగే ఆ కవితలో 'ఒక్క స్వర్గంలో తప్ప/ ఇలాంటి వెలుగు తెలుపు/ లేదేమో– అనిపించే మల్లెపూలు/ అలసి నిద్రించే రసికత్వానికి/ జీవన మిచ్చే ఉదయపు పూలు/ రాత్రి సుందరస్వప్నానికి సాక్షులుగా/ అవి మాత్రమే మిగిలిన/ నా ఆప్తులు!' అంటాడాయన. మల్లెలంటే అంతటి వల్లమాలిన ఇష్టం ఉండటం వల్లనే కాబోలు చలం ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అంతగా పరిమళభరితం చేశాడు.

మల్లెల్లో రకాలుంటాయి... బొండుమల్లెలు, కాడమల్లెలు, రేకమల్లెలు, సెంటుమల్లెలు. మన కవిత్వంలో సిరిమల్లెలు, మరుమల్లెలు కనిపిస్తాయి. మల్లెలసాగు సిరులు కురిపిస్తుంది. ఇక మల్లెలకు మరులు కురిపించే లక్షణమూ ఉంది. 'అరవింద మశోకంచ చూతంచ నవమల్లికా!/ నీలోత్పలం చ పంచైతే, పంచబాణస్య నాయకః!' అనే శ్లోకాన్ని గమనిస్తే ఈ సంగతి స్పష్టంగానే అర్థమవుతుంది. మన్మథుడు సంధించే ఐదురకాల పూలబాణాలలో మల్లెల బాణాలు కూడా ఉన్నందునే కాబోలు మన కవులు వాటిని 'మరుమల్లెలు' అంటూ మురిసిపోయారు. మల్లెలకు శృంగారాలంకరణల్లో మాత్రమే కాదు, మన ఆధ్యాత్మిక ఆరాధనల్లోనూ ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా శ్రీమహావిష్ణువుకు మల్లెలు ప్రీతిపాత్రమైనవి. 'మల్లికా కుసుమైరేవం వసంతే గరుడధ్వజమ్/ యోర్చయేపరయా భక్త్యా దహేత్ పాపం త్రిధార్జితమ్' అని పుష్పచింతామణి చెబుతోంది. అంటే వసంత రుతువులో శ్రీమహావిష్ణువును మల్లెలతో అర్చిస్తే, మనోవాక్కాయ కర్మల ద్వారా చేసిన పాపాలన్నీ నశిస్తాయట!

పాశ్చాత్యదేశాల వారికి మల్లెలంటే వెంటనే స్ఫురించేది మన భారతదేశమే! భారతదేశాన్ని మల్లెలకు చిరునామాగా భావిస్తారు వాళ్లు. 'మల్లెలు– అవి భారత్‌లో నా తల్లిదండ్రులతో గడిపిన జ్ఞాపకాలను మోసుకొస్తాయి' అంటుంది బ్రిటిష్ నటి ఏన్ రీడ్. ఆమె తండ్రి ఒక బ్రిటిష్ దినపత్రిక కోసం భారత్‌లో ఉంటూ పనిచేసేవాడు. అందుకే ఆమె జ్ఞాపకాల్లో ఆ మల్లెల పరిమళం!

జ్ఞాపకాల్లోనే కాదు, పరిసరాల్లోనూ మల్లెల పరిమళం అవసరం. ముఖ్యంగా దేశంలో రాజకీయ దుర్గంధం మితిమీరుతున్న సమాజానికి మల్లెల పరిమళమే కాస్తంత ఉపశమనం. మల్లెలు పూసి, పరిమళించాలంటే ఏటేటా వేసవులు రావాల్సిందే! రాజకీయాల వేడినే భరిస్తున్న వాళ్లం వేసవులను భరించలేమా? కనీసం మల్లెల కోసమైనా!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.ద్వాదశి ప.2.56 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాభాద్ర రా.1.58 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: ఉ.9.22 నుండి 10.54 వరకు, దుర్ముహూర్తం: ప.12.24 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: సా.6.26 నుండి 7.55 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

కావాల్సింది 'వర్గ పోరాటాల చరిత్ర'

విశ్లేషణ



రంగనాయకమ్మ

విద్యలో, 'ప్రభుత్వ జోక్యం' ఈ నాటిది కాదు. ఎప్పుడో 1848లోనే, మార్క్స్, ఎంగెల్సు ఈ వాస్తవాన్ని 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో ప్రస్తావించారు. కులం, మతం, ప్రాంతం– అనే భేదాల్ని ఉపయోగించుకుని అధికారంలోకి రావడానికి ప్రతీ పార్టీ సహజంగానే ప్రయత్నిస్తుంది. అనేక రంగాలలో జరిగే అనేక ప్రయత్నాలలో, పాఠ్య పుస్తకాలలో చేసే ఈ మార్పులు కూడా ఒకటి. చిత్రం ఏమిటంటే, 'ఉభయ' పక్షాల వారూ, రాజుల్నీ, చక్రవర్తుల్నీ దోపిడీ వర్గ ప్రతినిధులుగా చూడరు. ఆ రాజులూ, చక్రవర్తులూ ఆ నాటి కాలాల్లో రైతుల శ్రమ మీదా, చేతివృత్తుల వారి శ్రమ మీదా ఆధారపడి బతికిన పరాన్నజీవులని చెప్పరు.

కాంగ్రెసు ప్రభుత్వం ప్రచురించిన కొన్ని పాఠ్యపుస్తకాలలో వున్న చరిత్రకి సంబంధించిన కొన్ని పాఠాల్ని ఇప్పటి బీజేపీ ప్రభుత్వం తీసివెయ్యడం ఆరు నెలల కిందట (2022 జులైలో) జరిగింది. అది ఇప్పుడు ఒక వివాదంగా వుంది.

కేంద్రంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక రకంగానూ, బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇంకో రకంగానూ చరిత్ర పాఠాల్లో ఈ మార్పులు జరుగుతూ వచ్చాయి! గతంలో ఎప్పుడు, ఎలాంటి మార్పులు చేశారు– అనే వివరాలలోకి వెళ్ళడం ఇక్కడ సాధ్యం కాదు కాబట్టి ఇప్పుడు జరుగుతోన్న వివాదాన్నే ప్రధానంగా చూడాలి. సెంట్రల్ సిలబస్‌లో 6వ తరగతి నించీ 12వ తరగతి వరకూ వున్న సోషలూ, చరిత్రా పాఠాలు పిల్లలకి భారంగా తయారయ్యాయి కాబట్టి కొన్ని పాఠాల్ని తీసివెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ ప్రభుత్వం అంటే, అధికార పార్టీకి అనుకూలంగా వుండే ప్రొఫెసర్ల కమిటీ అన్నమాట! 'సిలబస్ హేతుబద్ధీకరణ' అనే పేరుతో, కొన్ని పాఠాలు తీసేశారు. వాటిలో అతి ప్రధానమైనది – దాదాపు 4 వందల యేళ్ళు పాలించిన మొఘల్ చక్రవర్తుల చరిత్ర. అలాగే, గాంధీ హత్యా, గుజరాత్‌లో మత కల్లోలాలూ, వగైరా, వగైరా.

కాంగ్రెసు ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలలో మొఘలుల పాలనకు విపరీతమైన ప్రాముఖ్యం ఇచ్చారనీ, ప్రాచీన హిందూ రాజుల చరిత్రకి ప్రాధాన్యం లేదనీ, దక్షిణ భారత దేశాన్నీ, ఈశాన్య భారతాన్నీ ఏలిన రాజుల్ని పట్టించుకోలేదనీ, కాంగ్రెసు మీద బీజేపీ సమర్థకుల విమర్శ. ముస్లిం మైనారిటీలను బుజ్జగించి, వారి ఓట్లను పొందడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం, ముస్లిం పాలకులకు అంత ప్రాధాన్యం ఇచ్చిందని కాంగ్రెసు మీద బీజేపీ ఆరోపణ. అయితే, బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు చేస్తున్న మార్పులు, మత విద్వేషాలను రెచ్చగొట్టి, ఎన్నికల్లో మెజారిటీ హిందూ మతస్థుల ఓట్లను రాబట్టడానికి చేసిన కుట్ర అని ప్రతిపక్షాల వాదన!

విద్యలో 'ప్రభుత్వ జోక్యం' అనేది ఈ నాటిది కాదు. ఎప్పుడో 1848లోనే, మార్క్స్, ఎంగెల్సు ఈ వాస్తవాన్ని 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో ప్రస్తావించారు. ఆ ప్రభుత్వ జోక్యానికి వుండే పెట్టుబడిదారీ వర్గ స్వభావాన్ని కార్మికవర్గ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చాలని ఆ ప్రణాళిక ఉద్దేశం. ఆ దృష్టితో చూసినప్పుడు కాంగ్రెస్సూ, బీజేపీ – రెండూ బూర్జువా వర్గ ప్రయోజనాలను కాపాడేవే. అలా కాపాడడం కోసం, అధికార పీఠం ఎక్కడానికి, అవి ఎంచుకునే పద్ధతులు తేడాగా వుంటాయి. ఉదాహరణకి, బీజేపీ ఎందుకు హిందూ మెజారిటీ ఓట్ల మీద ఆధారపడుతుందీ అనే విషయం అర్థం చేసుకోవాలంటే, 1906లో ఏర్పడ్డ 'ముస్లిం లీగ్' గురించీ, 1915లో ఏర్పడ్డ 'హిందూ మహాసభ' గురించీ తెలుసుకోవాలి.



అప్పుడు ఆ మతాలకు చెందిన భూస్వాములకూ, పరిశ్రమాధిపతులకూ, వర్తకులకూ, రాజకీయ నాయకులకూ, అటువంటి వారి ప్రయోజనాల మధ్య వున్న వైరుధ్యాలను పరిశీలించాలి. అదంతా ఇక్కడ వీలుకాదు. సారాంశం ఏమిటంటే, మత సంస్థలు గానీ, మతంతో ముడిపడి వున్న రాజకీయాలు గానీ, నిజంగా మతాలకు సంబంధించిన అంశాలు కావు. ఇప్పుడే కాదు, కొన్ని వందల ఏళ్ళ కిందట మతం పేరుతో జరిగిన యుద్ధాల్లో కూడా, ఎంగెల్సు చెప్పినట్టు, 'స్పష్టమైన భౌతిక వర్గ ప్రయోజనాలు వుండినాయి'! 'ఆ నాటి వర్గపోరాటాలు మత నినాదాల దుస్తులలో వుండి, వేరువేరు వర్గాల ప్రయోజనాలూ, అవసరాలూ, డిమాండ్లూ వంటివి, మతం అనే తెరవెనక మరుగు పడ్డాయ'నే విషయాన్ని 'జర్మనీలో రైతు యుద్ధం' అనే పుస్తకంలో ఎంగెల్సు చాలా వివరంగా చెపుతాడు. అది ఈ నాటికీ వాస్తవమే. పైకి, తక్షణంగా, ఒక కారణం (ఉదా: గోద్రా రైలు దహనం, ఆ తర్వాత జరిగిన మత కల్లోలాలు) కనిపించినప్పటికీ, అనేక లింకుల ద్వారా చరిత్రని పరికిస్తే – మనకి పాలకవర్గ ప్రయోజనాలు కనిపిస్తాయి. 'వర్గ ప్రయోజనం' అన్నప్పుడు రెండు వేరు వేరు వర్గాలు– అనే కాదు; ఒకే వర్గంలోనే, రెండు వేరు వేరు సెక్షన్ల ప్రయోజనాల మధ్యకూడా వైరుధ్యాలు ఉంటాయి.


వర్గాలుగానూ, ఉపవర్గాలుగానూ చీలివున్న సమాజంలో, పాలక వర్గ ప్రయోజనాలను కాపాడడానికి, ఒకే ఒక్క రాజకీయ పార్టీయే వుండదు. అనేక పార్టీలు వుంటాయి. కులం, మతం, ప్రాంతం– అనే భేదాల్ని ఉపయోగించుకుని అధికారంలోకి రావడానికి ప్రతీ పార్టీ సహజంగానే ప్రయత్నిస్తుంది. అనేక రంగాలలో జరిగే అనేక ప్రయత్నాలలో, పాఠ్య పుస్తకాలలో చేసే ఈ మార్పులు కూడా ఒకటి. ఈ చరిత్ర పుస్తకాలలో రాజుల్నీ, చక్రవర్తుల్నీ చిత్రించేటప్పుడు ఒక పక్షం మేధావులు అన్ని మతాల పాలకుల్నీ కొంత 'సంస్కరణ వాద దృక్పథం'తో చూపుతారు. ఇంకో పక్షం మేధావులు హిందూ పాలకుల్ని మాత్రమే గొప్ప చేస్తూ, ముస్లిం రాజుల్ని దుష్టులుగా చూపుతారు. చిత్రం ఏమిటంటే, ఉభయ పక్షాల వారూ, రాజుల్నీ, చక్రవర్తుల్నీ దోపిడీ వర్గ ప్రతినిధులుగా చూడరు. ఆ రాజులే స్వయంగా దోపిడీదారులనీ, వాళ్ళు శ్రామిక జనాలనించీ లాగిన కౌలూ, వడ్డీ, లాభాల వంటి శ్రమ దోపిడీ ఆదాయాల మీదే బతికిన వాళ్ళనీ మాత్రం గుర్తించరు. వాళ్ళ వీరత్వం గురించీ, యుద్ధ కళల గురించీ, కళా పోషణల గురించీ, వాళ్ళ పాండిత్య ప్రతిభల గురించీ, మత సామరస్యాల గురించీ, వాళ్ళ దైవభక్తి గురించీ, దానశీలతల గురించీ... ఇలా, ఇలా చిత్రించుకుంటూ పోతారు, ఇరుపక్షాల వారూ కూడా! అంతేగానీ, ఆ రాజులూ, యువరాజులూ, రాణులూ, యువ రాణులూ, ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టేవారు కాదనీ, వాళ్ళది వందలాది సేవక పరివారం మీద ఆధారపడిన పరమ సోమరి జీవితం అనీ మాత్రం ఎక్కడా ఒక్క ముక్క అయినా రాయరు. ఆ రాజులూ, చక్రవర్తులూ ఆ నాటి కాలాల్లో రైతుల శ్రమ మీదా, చేతి వృత్తుల వారి శ్రమ మీదా ఆధారపడి బతికిన పరాన్న జీవులనీ చెప్పరు (స్కూలు పుస్తకాల్లో కాదు గానీ, చరిత్రకి సంబంధించిన ఇతర రచనల్లో, వర్గాల గురించీ, వర్గ పోరాటాల గురించీ రాసిన మేధావులు కొందరైనా వున్నారు).

చరిత్రకి సంబంధించిన పాఠ్యపుస్తకాల వివాదం చూశాక, శ్రామిక వర్గ పక్షం వహించే రచయితలు చెయ్యాల్సింది ఏమిటి? 'పిల్లల కోసం వర్గపోరాట చరిత్ర పాఠాలు' రాయడం! 'పిల్లల కోసం ఆర్థిక శాస్త్రం' పేరుతో రాసినట్టు, వర్గ దృక్పథంతో కొన్ని చరిత్ర పాఠాలు రాయాలనివుంది నాకు. బీజేపీ ప్రభుత్వం అంటే భయం లేదుగానీ, నా 'హెర్నియా' జబ్బు రాయనిస్తుందో లేదో చూడాలి!

వ్యాసకర్త ప్రసిద్ధ రచయిత్రి

బర్లా... గాడీ పోతది! జర బద్రం!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. ఇంటికి పోబుద్ది గాని కొంతమంది సర్కార్ జీతగాల్లు ఇరానీ హోటల్ల గూసోని దోస్తుల తోని ముచ్చట బెడ్తున్నరు. సిన్మ తేటర్లు జెనం తోని చీమల పుట్టల్లెక్క ఉన్నయి. గా దినం గూడ ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్ డబ్బ కాడ జమైతరు.

''గిది ఎలచ్చన్ల యాడాది. మేమందరం కల్సి ఉన్నట్లు జెనంకు ఎర్క జేసేతందుక్కు ఏదన్న ఒకటి జెయ్యాలని బీఆర్ఎస్ లీడర్లు అనుకున్నరు'' అని యాద్గిరి అన్నడు.

''అనుకోని గాల్లేం జేసింద్రు'' అని సత్నారి అడిగిండు.

''ఆత్మీయ సమ్మేళనాలు బెట్టింద్రు''


''గాల్లు ఒకటనుకుంటె ఒకటైంది. హన్మంతున్ని జెయ్యబోతె బోడ కోతి అయ్యింది''

''ఆత్మీయ సమ్మేళనాలల్ల ఆత్మీయత లేకుంట బోయిందా?''

''అవ్ బోయింది. గీ మీటింగ్లకు రాకుంట కొంతమంది బీఆర్ఎస్ లీడర్లు అసమ్మతి రాగమందుకున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంల నాల్గు డివిజన్లల్ల ఆత్మీయ సమ్మేళనాలు అయినయి. ఎమ్మెల్యే అంటె ఇష్టం లేని కార్పొరేటర్లు గివ్విటికి దూరమున్నరు. కొంతమంది ఆత్మీయ సమ్మేళనం ఉన్నట్లు ఎవ్వలు మాకు జెప్పలేదని మొత్తుకుంటున్నరు. ఆత్మీయ సమ్మేళనాలు అసంతృప్తి సమ్మేళనాలైతున్నయి. గివ్విటిని బంద్ జెయ్యకుంటె పార్టి మునిగెటట్లు గొడ్తున్నరని కేసీఆర్ అనుకోబట్టిండు''

''అసంతృప్తి లీడర్లు గుడ్క ఆత్మీయ సమ్మేళనాలు బెడ్తున్నరట గదా''

''అవ్ బెడ్తున్నరు. అసంతృప్తి లీడర్లనందరిని ఒక్క తాన్కి దెచ్చెతందుక్కు. గీ నడ్మ కొత్తగూడెంల మాజీ ఎంపీ పొంగులేటి శీనువాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనం బెట్టిండు. మాజీ మంత్రి జూపల్లి కిష్నారావు గా దాన్కి బోయిండు. ఇద్దరు గల్సి కేసీఆర్ సర్కార్ జెనం గురించి ఏం జేస్త లేరని అన్నరు''



''గీల్లు గిట్ల జేస్తుంటె కేసీఆర్ ఊకుండా?''

''ఊకోలేదు. గాల్లిద్దరిని పార్టికెల్లి సస్పెండ్ జేసిండు''

''గీ నడ్మ మోది – లష్కర్ కొచ్చినప్పుడు గూడ బీఆర్ఎస్ ఫ్లెక్సి విద్ధం షురువు జేసిందట గదా''

''మేమొస్తున్నం. సింగరేనిని ప్రైవేటీకరిస్తాం అని రాసి మోది, అదాని బొమ్మలను దించింద్రు. గా దాని మీద మొదాని అని రాసింద్రు.''

''బీఆర్ఎస్ గిసువంటి ఫ్లెక్సీలు బెడ్తె బీజేపీ ఊకుందా?''

''బీజేపీ ఎందుకూకుంటది. మోది బొమ్మను దించి ఎదురుంగ రాంభక్త అని రాసింద్రు. రాహుల్ గాంది బొమ్మ దించి ఎదురుంగ రోమ్ భక్త అని రాసింద్రు. కేసీఆర్ బొమ్మ దించి ఎదురుంగ రమ్ భక్త అని రాసింద్రు''

''మోది లష్కర్‌కు ఎందుకొచ్చిండు''

''లష్కర్ కెల్లి తిర్పతి దాంక బొయ్యేటి వందే భారత్ రేల్ గాడ్కి పచ్చజెండ ఊపెతందుక్కు మోది పట్నమొచ్చిండు. వందే భారత్ రేల్ గాడి గురించి కొందరు కోతి పోరగాల్లు బర్లకు కారట్లు రాసింద్రు''

''బర్లా! బర్లా! వందే భారత్ రేల్ గాడి బొయ్యేటప్పుడు తప్పి జారి మీరు పట్టాల మీదికి రావొద్దు. ఒగాల్ల పట్టాల మీదికి వొచ్చినా మీకు ఏంగాదు. గని రేల్ గాడి ఇంజన్ కరాబైతది. రేల్ గాడి ఆగి పోతది. అందరు మిమ్ములను దిడ్తరు అన్కుంట రాసింద్రు''

''గీపారన్న మోది పబ్లిక్ మీటింగ్‌కు కేసీఆర్ బోయిండా?''

''పోలేదు''

''ఎందుకు పోలేదు''

''గాయిన ప్రతాని అయితె నేను ఏం తక్వ దిన్ననా? నేను కాబోయే ప్రతానిని అనుకోని కేసీఆర్, మోది మీటింగ్‌కు బోలేదు''

''బీజేపీ కేసీఆర్ గురించి కుర్సి ఏసుడే గాకుంట కప్పేతందుక్కు శాలువ గుడ్క దెచ్చిందట గదా''

''కుర్సి ఏసింది గని గా కుర్సి మీద సీఎం అని రాసి ఉన్నది''

''గా కుర్సి తోని బీజేపీ ఏం జేద్దామనుకుంటున్నది''

''సీఎంను మల్పేసి ఉత్త కుర్సిని కేసీఆర్‌కు పంపిస్తె ఎట్లుంటదా అని బీజేపీ సోచాయిస్తున్నరు''

''ఎట్లన్న జేసి ప్రతాని అయ్యేతందుకు కేసీఆర్ ఒక్క తీర్గ కోషిస్ జేస్తున్నడు. అపొజిసన్ పార్టీ ఎలచ్చన్ల ఎంత కర్సు బెడ్తె గంత కర్సు గాయిన్నే ఇస్తనంటున్నాడు. సర్కార్ బూములు జెయ్యబట్కె లచ్చల కోట్ల రూపాయలు కేసీఆర్ తాన ఉన్నాయని అపోజిసనోల్లు అంటున్నరు''

''మల్ల కేసీఆర్ ఏమంటున్నడు''

''కుబేర యాగం జేసిన. కనకదార స్తోత్రం సద్విన. గివ్వి జెయ్యబట్కె నా తాన లచ్చల కోట్ల రూపాయలున్నయని కేసీఆర్ జెప్పిండు'' అని యాద్గిరి అన్నడు.

గీ తీర్గ నాత్రి తొమ్మిది గొట్టెదాంక మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

సభ్యసమాజానికి ఏం మెసేజ్ ఇద్దామని?

సారాంశం
నరికొండ చలపతి

ఆ మధ్య విన్న ఓ పాట...
చిన్న గౌను వేసుకున్న పెద్దపాపా..
నీ చిన్న నాటి ముద్దుపేరు లాలిపాపా
హైటెక్‌టెక్కు చూస్తె హీటు పుట్టు వెంటనే
ఫ్లయిటు ఎక్కి నిన్ను చేరి కన్నుకొట్టు క్లింటనే..
– ఇది ఆనాటి అమెరికా అధ్యక్షుడు క్లింటన్‌పై మన కుర్రకారు అభిప్రాయం. మోనికా లెవెన్‌స్కీతో రాసలీలలు పాపులరయి, క్లింటన్ ప్రపంచవ్యాప్తంగా బాగా అన్‌పాపులర్ అయిన రోజులనాటి సినిమా పాట..

......

తాజాగా పోర్న్ స్టార్‌తో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ సంబంధాలు, ఆయన హయాంలో ఆమెకు చేసిన ఫేవర్లు.. వెరసి కేసులు, ట్రంప్ అరెస్టులు.. ఇప్పుడో ఎపిసోడ్ నడుస్తోంది.

......

నిరుపేద కుటుంబం నుంచి వచ్చి... వీధి దీపాల కింద చదువుకుని అట్టడుగు స్థాయి నుంచి అగ్రరాజ్యానికి అధినేత అయిన అబ్రహం లింకన్‌ను చరిత్ర సగౌరవంగా అక్కున చేర్చుకుంది. అనేక తరాలకు స్ఫూర్తిదాయకమైంది. ఒక నేత యువతకు ఎలా మార్గదర్శకమవుతాడో పాఠాల్లో ఆయన్ను మనం చదువుకున్నాం. మరి క్లింటన్, ట్రంప్ లాంటి ఈనాటి నాయకులు ఇప్పటి యువతకు ఏం మెసేజ్ ఇస్తున్నారో పైన పాట చూస్తే అర్థమవుతోంది.

......

ఇక లోకల్ ఏరియాకొస్తే.. మచ్చుకుకొన్ని..
– ఓ మహిళానేత ఒక నాయకుడిపై ప్రెస్ మీట్ పెట్టి మరీ చెబుతుంది..లైంగికంగా వేధిస్తున్నాడని.
– మరో ఎమ్మెల్యే గలీజ్ వ్యవహారంపై ఓ మహిళ వాట్సాప్ మెసేజ్‌లు రిలీజ్ చేస్తుంది.
– మరో శాసనసభ్యుడు సభలోనే అశ్లీల వీడియోలు చూసి దొరికిపోతాడు.
– మరో మహా నాయకుడు మాట జారి పరువు నష్టాన్ని ఎదుర్కొని లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు.
– ఒక పార్టీ రాష్ట్రనేత, ఎంపీ పేపర్ లీకేజీ కేసులో జైలుకు వెళ్తాడు.
– మరో పార్టీ అధినేత తలపై ఓటుకు నోటు కేసు వేలాడుతూ ఉంటుంది.
– మరో మహిళా నేతపై సీబీఐ ఎంక్వయిరీ నడుస్తూంటుంది.

... ఇలా ప్రతి రోజూ ఏదో ఒక నేత మీద ఏదో ఒక ఆరోపణ, స్కాము.. ఏదో మరక పడుతూనే ఉంది. ఇదంతా గమనిస్తున్న యువతకు, వచ్చే తరానికి ఏం మెసేజీ వెళ్తుంది?

వస్తున్న ఆరోపణలూ, కేసులు, ఎంక్వయిరీలు నిజమని నిర్ధారించలేం.

ఇవన్నీ రాజకీయ ఎత్తుగడలలో భాగమే కావచ్చు. నిఖార్సయిన నేతలకు కూడా బురద పూయడం కూడా చూస్తున్నాం. వీరిపై ఆరోపణలన్నీ నిజాలు కావని కొద్ది కాలానికి నిగ్గు తేలవచ్చు.

– కానీ, అప్పటికే సమాజంలో జరగవలసిన డ్యామేజీ జరిగిపోతుంది.

......

ఈ కథ చూడండి... ఇప్పుడు జరుగుతున్న తతంగానికి దగ్గరగా ఉంటుంది.



అనగనగా ఒక పల్లెటూర్లో ఒక వ్యక్తి ఉండేవాడు. అతనికి నెత్తిపై ఒక్క వెంట్రుక కూడా ఉండేది కాదు. నున్నగా చెంబులాగా తళతళలాడుతుండేది. అందుకని అతన్ని అందరూ 'నున్న గుండూ' అని పిలిచేవారు. క్రమంగా ఊరి వారందరూ అతని పేరు మరచి పోయారు. నున్న గుండూ.. నున్న గుండూ అని పిలుస్తూంటే చాలా ఉక్రోషంగా, అవమానకరంగా ఉండేది. ఇది భరించలేక ఓ రోజు ఊరు వదిలి వెళ్లి పోయాడు. అలా తిరుగుతున్న క్రమంలో ఓ అడవిలోకి ప్రవేశించాడు. అతనికి ఓ మునీశ్వరుడు ఎదురుపడ్డాడు. ఆయన మన హీరోను చూసి ఆశ్చర్యపోయి ఇంతటి అరణ్యంలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావని ప్రశ్నించాడు. మనవాడు వలవలా ఏడుస్తూ తన గుండు విషయం, తద్వారా జరుగుతున్న అవమానం విషయం చెప్పాడు.

'మీ మహిమతో నా గుండు మీద ఎలాగైనా జుట్టు మొలిపించండి స్వామీ...' అని కాళ్లావేళ్లా పడ్డాడు. అప్పుడా ముని... ' పోయిన జుట్టును మొలిపించడం బ్రహ్మతరం కాదు నాయనా. దాని సంగతి మరిచిపో.. ఇంటికి వెళ్లు ' అని నిష్కర్షగా చెప్పేశాడు. దానితో మన హీరో మళ్లీ గొల్లుమన్నాడు. దానితో ముని మనసు కరిగి..'జుట్టు మొలిపించలేను కానీ , నీకు ఒక వరం ఇస్తాను...' అని అతని చేయి తీసుకుని మంత్రం వేశాడు.

'ఇక నుంచి ఎవరైనా నిన్ను నున్న గుండూ అని పిలిస్తే నీ చెయ్యి వారి తల మీద పెట్టు. తక్షణం వాడి జుట్టు కూడా ఊడి పోయి నీలా నున్నగుండులా మిగుల్తాడు..' అని చెప్పి వెళ్లిపోయాడు. మన వాడు ఆనందంగా ఇంటికి బయలు దేరాడు. ఊరిలోకి ఎంటర్ అవుతుండగానే 'ఓరి నున్న గుండూ! ఇన్ని రోజులు ఎక్కడికి పోయావు, కనిపించడంలేదు ..' అని ఓ వ్యక్తి పలకరించాడు. మనవాడికి కోపం వచ్చింది. నన్ను గుండు అంటావా అంటూ ఆ వ్యక్తి నెత్తి మీద చేయి పెట్టాడు. ఆ వ్యక్తి జుట్టంతా రాలిపోయి గుండు మిగిలింది. అది చూసిన మన 'నున్న గుండు' ఆనందానికి అవధుల్లేవు. అప్పటినుంచి ఎవరు నున్న గుండూ అని పిలిచినా వారి తలమీద చేయిపెట్టి వారికి జుట్టు లేకుండా చేసేవాడు.

ఆ ఊరులో మూడొంతుల మంది మనవాడిలాగే.. నున్నగుండులై పోయారు. అలా ఎవరు అసలు మొదటి నున్నగుండో తెలియకుండా పోయింది...

......

ఇది తలల సంగతి .. మన నేతల సంగతి అలాగే కనిపిస్తోంది.

పాలిటిక్స్‌లో ఇప్పుడదే ట్రెండ్ .. అచ్చం ఇలాగే. అందరి చేతుల్లోనూ అదే శక్తి.. ముని వరం కనిపిస్తోంది.

ఒకరి మీద ఆరోపణలు రాగానే తానొక్కడినే దోషిని కానంటూ మరొకరిపై నిందలు వేయడం ..వారి తలపై చేయిపెట్టడం..వారి బాగోతాన్ని బయటపెట్టడం. తమ స్థాయికి వారిని తీసుకురావడం..తాజా పేపర్ లీక్ అయినా, లిక్కర్ స్కామ్ అయినా ఇంకా దేశవ్యాప్తంగా ఏ ఇతర స్కామ్ అయినా.. మరొకరిపై నిందలు ఆరోపణలు.. వందల కొద్దీ కేసులు. ఎంక్వయిరీలు. పైన చెప్పినట్టు ఎదుటి వారి తలపై చేతులే.. అంతా నున్నగుండులే. అసలు దోషులెవరో తెలియకుండా. దీనికి అధికారపక్షం, ప్రతిపక్ష నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు ఎవరూ మినహాయింపు కాదు, అందరికీ ఏదో మరక కనిపిస్తూనే ఉంటుంది.

......

ఈ క్రమంలో... చివరికి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవడానికి, చరిత్ర చెప్పుకోవడానికి ఈ జనరేషన్‌లో ఒక్క నేతా లేకుండా చేసుకుంటున్నట్టున్నాం. ఈ జనరేషన్ సంగతి సరే. ఈ రాజకీయంలోకి పాత తరం నేతలను కూడా లాగేసి వారినీ మన గాటన కట్టేస్తున్నాం. ఇప్పటిదాకా మనం ఆదర్శప్రాయులని పాఠాల్లో నేర్చుకుని వారిని అనుసరించే ప్రయత్నం చేసిన వారందరిపైనా ఏదో ఒక అపనింద.. మరక. కొన్ని తరాలను తమ ప్రవర్తనతో, వ్యక్తిత్వంతో, త్యాగాలతో జాతిని వెలిగించిన వారిని .. ఎవరికి వారు వారి 'రాజకీయ సమూహం'లో కలిపేసుకుని ఎదుటివారిని బురదలో నెట్టే పని చాలా బలంగా నడుస్తోంది. మనతరం వచ్చేతరానికి స్ఫూర్తి చిహ్నంగా నిలవక పోవడమే కాదు.. పాత తరాన్ని కూడా స్ఫూర్తిదాయకం కాకుండా శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాం.

వందల అడుగుల ఎత్తున వాళ్ల విగ్రహాలను పెట్టుకోవడమే కాదు,
అంత ఎత్తున వారిని ఉండనిద్దాం..

– లేకుంటే వచ్చే తరానికి లింకన్లు కాదు కన్నుకొట్టే క్లింటన్లు, ట్రంప్‌లే ముందు తరాలకు కనిపిస్తారు.. చిలిపి పాటలు పాడుకోవడానికి.

అష్టభావ పుష్పార్చన

భగవంతునికి సుగంధభరితమైన పువ్వులతో పూజలు చేస్తుంటాం. అయితే, ఎనిమిది భావ పుష్పాలతో పూజించాలని పెద్దలు చెపుతారు. వాటిలో, అహింసా పుష్పం మొదటిది. ఇతరులను మాటలతో గానీ, చేతలతో గానీ గాయ పరుస్తూ పూజ చేస్తే దేవుడు మెచ్చడు. అలాగే, మనసును పూర్తిగా లగ్నం చేస్తూ ఇంద్రియ నిగ్రహం అనే పుష్పంతో పూజించాలి. మానవ సేవే మాధవ సేవ. సర్వ జీవుల పట్ల కరుణ చూపుతూ సర్వ భూత దయ అనే పుష్పంతో పూజిస్తే దైవం ప్రసన్నుడవుతాడు. చేసే పూజ పట్ల, భగవంతుని తత్త్వం పట్ల ఎరుక కలిగి చేస్తే అది జ్ఞాన పుష్పంతో చేసే పూజ!



ఇతరుల తప్పులను క్షమించగలిగే క్షమా గుణం ఎంతో గొప్పది. క్షమాగుణమనే పుష్పం పూజకు ఎంతో శ్రేష్ఠం. తపస్సు వల్ల ఏకాగ్రత సిద్ధిస్తుంది. ఎందరో మునులు తపస్సు చేతనే దైవాన్ని ప్రత్యక్షం చేసుకున్నారు. అందుకే తపస్సు అనే పుష్పం పూజకు ఉత్తమం. పూలు, పండ్లు, ధూప దీపాలు లేకపోయినా, నిశ్చలమైన ధ్యాన పుష్పంతో భగవంతుని కరుణను పొందవచ్చు. సత్యమున్న చోటు దైవం స్థిర నివాసం. ఎటువంటి పాపులనైనా భరించగలను గానీ సత్య హీనుని ఒక్కరినైనా భరించలేనని బ్రహ్మతో భూదేవి మొర పెట్టుకుందట.

అసత్యాలు పలికేవారికి సమాజంలో విలువ ఉండదు. దైవం దృష్టిలోనూ విలువ ఉండదు. సత్యమనే పుష్పంతో పూజిస్తే దైవం త్వరగా అనుగ్రహిస్తాడు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

రాబందుల్లా దోచుకుంటున్నారు



పెబ్బేరు: రాష్ట్రంలో పథకాలు, డబుల్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసి రాబందుల్లా దోచుకుంటున్న బీఆర్ఎస్ పాలకులను ఇంటికి సాగనంపడం ఖాయమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన వనపర్తి జిల్లా పెబ్బేరులో జరిగిన బహుజన రాజ్యాధికార యాత్ర రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పథకాల పేరిట సీఎం కేసీఆర్ రూ.కోట్లలో అప్పులు చేసి ఫాంహౌస్‌లో కూర్చున్నారని విమర్శించారు. చాలీచాలని ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చారని, పరీక్ష ప్రశ్నపత్రాలు లీక్ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు దేవాలయాల భూములను కబ్జా చేసి రూ.లక్షల కోట్లకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

తెలంగాణలో బీజేపీ ఆటలు సాగనివ్వం



కరీంనగర్: తెలంగాణలో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనుకుంటున్న బీజేపీ ఆటలు రాష్ట్రంలో సాగనివ్వబోమని ఇక్కడ ఆ పార్టీకి శృంగభంగం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కరీంనగర్‌లో 'బీజేపీ కో హఠావో దేశ్‌కో బచావో' నినాదంతో సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ చేపట్టిన 'పల్లెపల్లెకూ సీపీఐ...ప్రజల వద్దకు సీపీఐ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెలంగాణ సాయుధ తొలి అమరవీరుడు అనభేరి విగ్రహం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తొమ్మిదేళ్లల్లో బీజేపీ హయాంలో దేశం అధోగతిపాలైందని, కులమతాల కుంపట్లతో రాజకీయాలను కలుషితం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. దేశాన్ని కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు తాకట్టుపెట్టేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఎప్పుడు నెరవేరుస్తారని నిలదీశారు. సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలు, కుట్రలను ఎండగట్టేందుకే ప్రజా చైతన్యయాత్ర చేపట్టామన్నారు. అంతకుముందు కరీంనగర్‌లో భారీ ప్రదర్శన చేపట్టారు.

యువతకు న్యాయం జరిగేదాకా పోరు ఆగదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా సోమవారం 'టీ–సేవ్' ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వై. ఎస్. షర్మిల తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలు, నీతిమాలిన రాజకీయాలకు ఇది పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఈ మేరకు వైఎస్సార్‌టీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనల విడుదల చేసింది. 'ఉద్యమాల పునాదిపై పురుడు పోసుకున్న పార్టీ అని గొప్పలు చెప్పుకొనే కేసీఆర్... పనికిమాలిన కారణాలు చూపి దీక్షకు అను మతి ఇవ్వకపోవడం శోచనీయం. ఇది ఒక షర్మిలనో లేక వైఎస్సార్ తెలంగాణ పార్టీనో చేస్తున్న ఉద్యమం కాదు. పార్టీలు, సంస్థలు, సంఘాలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు ఒక్కటై యువత కోసం చేస్తున్న ఉమ్మడి పోరాటం. వారికి న్యాయం జరిగే వరకు ఆగేది లేదు, అలిసేది లేదు' అని షర్మిల ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించిన రెండు రోజుల వ్యవధిలోనే రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కేసీఆర్ గాలికొదిలేశారని దుయ్యబట్టారు.

ఆర్ఆర్ఆర్ రైతుల పాలిట మరణ శాసనం



గూడూరు

సాక్షి,హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌కు 20 కి.మీ దూరంలో ఉన్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్.ఆర్.ఆర్) ప్రస్తుత అలైన్‌మెంట్ రాయగిరి, ఎర్రంబల్లి, ప్రొద్దుటూరు, మాందాపూర్, వర్కట్‌పల్లి రైతులకు మరణశాసనం అవుతుందని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. దీనికి బదులుగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు 42 కి.మీ దూరంలో ఉన్న చౌటుప్పల్, మోట కొండూర్, ఆలేరు రూట్‌లో ఆర్ఆర్ఆర్ నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ వల్ల రైతులు పెద్ద ఎత్తున నష్టపోతారని దానిని మార్చాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. బస్వాపూర్ రిజర్వాయర్, హైటెన్షన్ లైన్లు, ఎన్‌హెచ్ 163 పనులు, కాలు వల నిర్మాణానికి ఇప్పటికే రైతుల భూములు కాజేశారని, రాయగిరి తదితర గ్రామాల్లో రైతుల నుంచి ఇప్పటికే ప్రభుత్వం మూడు ప్రాజెక్టుల కోసం భూమిని సేకరించగా, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు రూపంలో నాలుగోసారి సేకరణ చేపట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మధ్యవర్తిత్వంపై త్వరలో చట్టం

- పార్లమెంటులో కేంద్రం బిల్లు ప్రవేశపెట్టనుంది
- అమలైతే సత్వరం కేసుల పరిష్కారం
- 'భారత మధ్యవర్తిత్వ దినోత్సవం'లో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



భారత మధ్యవర్తిత్వ దిన తొలి వార్షికోత్సవం కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ. చిత్రంలో జస్టిస్ హిమాకోహ్లి

సాక్షి, హైదరాబాద్: మధ్యవర్తిత్వానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం త్వరలో చట్టం చేయనుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ వెల్లడించారు. ఆ బిల్లు ఆమోదం పొంది అమల్లోకి వస్తే కేసుల పరిష్కారం వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం భారత మధ్యవర్తిత్వ దిన తొలి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ ఎన్వీ రమణ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'మధ్యవర్తిత్వం ద్వారా కేసుల్ని రాజీ చేసుకొనే విధానాన్ని అనుసరిస్తేనే ఏ దేశమైనా న్యాయ వివాదాల సత్వర పరిష్కారం ద్వారా పురోగతి సాధిస్తుంది. ఎంఎస్మీ సంస్థల నుంచి సాధారణ స్థాయి సంస్థల్లో జరిగే ఒప్పందాల్లో వివాదం ఏర్పడితే నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా తొలి దశలో మధ్యవర్తిత్వం ద్వారా ఆ వివాదం పరిష్కరించుకొనేలా ఒప్పందం ఉండాలి. హైదరాబాద్‌లో వేలాది నిర్మాణాలు జరుగుతున్నాయి. సివిల్ వివాదాలు ఏళ్ల తరబడి కోర్టుల్లో వాయిదాల మీద వాయిదాలు పడే అవకాశం ఉంది. తద్వారా అది పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది' అని జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు.

చోళుల కాలంలోనే 'మధ్యవర్తిత్వం'...

దేశంలో చోళుల కాలం నుంచే మధ్యవర్తిత్వ ప్రయత్నాలు సాగేవని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమాకోహ్లి తెలిపారు. 'వ్యాపార లావాదేవీల్లో వివాదాలను ఆర్బిట్రేషన్ విధానంలోనే పరిష్కరించుకొనేవారు. ఆర్బిట్రేషన్, చర్చలు, మధ్యవర్తిత్వం లోక్‌అదాలత్ ఇవన్నీ ప్రత్యామ్నాయ వివాద పరిష్కారానికి (ఏడీఆర్) విభిన్న కోణాలే. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ 2021–22 సమాచారం ప్రకారం దేశంలో 464 ఏడీఆర్ కేంద్రాలుంటే 397 పనిచేస్తున్నాయి. 570 మధ్యవర్తిత్వ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వాటిలో ఇప్పటివరకు 53 వేల కేసులు పరిష్కారం అయ్యాయి. మధ్యవర్తిత్వ బిల్లు - 2021ను త్వరలోనే పార్లమెంటు ఆమోదించే అవకాశం ఉంది. నిర్దిష్ట గడువులోగా మీడియేషన్ ప్రక్రియ పూర్తి (180 రోజుల్లో పూర్తి చేయాలి. లేనిపక్షంలో మరో 180 రోజులు పొడిగింపు), మధ్యవర్తుల నమోదుకు జాతీయ స్థాయిలో మధ్యవర్తిత్వ మండలి ఏర్పాటు, మధ్యవర్తిత్వ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నాక ఉభయ పార్టీలు అందుకు కట్టుబడి ఉండాలి. మధ్యవర్తిత్వ వ్యవహారాలన్నీ గోప్యంగా ఉంచడం వంటివి ప్రతిపాదిత బిల్లులో కీలకాంశాలు. కోవిడ్ లాక్‌డౌన్ వేళ ఏడీఆర్ అమల్లో స్పష్టమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అవి ఆన్‌లైన్ వివాద పరిష్కార (ఓడీఆర్) దిశగా కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడ్డాయి' అని జస్టిస్ హిమాకోహ్లి పేర్కొన్నారు.

సమయం, డబ్బు ఆదా: హైదరాబాద్‌లో ఐఏఎంసీ ఏర్పాటును స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌లో ఆర్బిట్రేషన్–మీడియేషన్ సెంటర్ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించింది. ఈ సెంటర్ల ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుంది. సింగపూర్ ఆర్బిట్రేషన్–మీడియేషన్ ఒప్పందంపై భారత్ 2019 ఆగస్టు 7న సంతకం చేసింది. శ్రీకృష్ణుడు కౌరవ, పాండవుల మధ్య రాయబారానికి ప్రయత్నించారు. అది విఫలం కావడంతోనే కురుక్షేత్ర యుద్ధం జరిగింది. పెను వినాశనానికి దారితీసింది. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దలు రచ్చబండ విధానం ద్వారా స్థానికంగా వివాదాల్ని పరిష్కరించే సంప్రదాయం ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వ విధానానికి ఆదరణ లభిస్తోంది' అని జస్టిస్ ఎన్వీ రమణ వివరించారు.

33 కేసుల పరిష్కారం...

ఐఏఎంసీ ఇప్పటివరకు 33 కేసుల్ని పరిష్కరించిందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఆర్బిట్రేషన్ ద్వారా పది కేసులు, మీడియేషన్ ద్వారా 23 కేసుల్లో మొత్తం 700 బిలియన్ డాలర్ల విలువైన వివాదాలు పరిష్కారమయ్యాయని వివరించారు. అనంతరం సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, ఐఏఎంసీ సీఈవో జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, సింగపూర్ ఐఏఎంసీ చైర్మన్ జార్జి లిమ్ ప్రసంగించారు. వారికి ఐఏఎంసీ రిజిస్ట్రార్ తారిక్ స్వాగతం పలికారు. తర్వాత మధ్యవర్తిత్వంపై పలు చర్చాకార్యక్రమాలు జరిగాయి.

కమీషన్ల కోసం ఎంసీహెచ్‌ను ముంచారు!

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- మంచిర్యాల జిల్లాలో చివరిరోజు పాదయాత్ర



ఐబీ ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దగ్గర మాట్లాడుతున్న భట్టి

మంచిర్యాలటౌన్: స్థానిక నడిపెల్లి ఎమ్మెల్యే దివాకర్‌రావు కమీషన్లకు కక్కుర్తిపడి మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)ను గోదావరి ఒడ్డున వరద నీటిలో మునిగే చోట నిర్మించారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 31వ రోజు ఆదివారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ నివాసం నుంచి ప్రారంభమై ఐబీ చౌరస్తాలో ప్రభుత్వ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ఐబీ ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించి మాట్లాడారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఐబీ ఆవరణలో నిర్మించి ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో ఉండి, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఎన్నిసార్లు చెప్పినా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. గోదావరి ఒడ్డున నిర్మించడం వల్ల ప్రజలకు దూరభారం కావడంతోపాటు, ప్రభుత్వాసుపత్రికి దూరంగా ఉంటుందని, గోదావరికి వరదలు వస్తే మునిగి పోయే ప్రమాదం ఉందని చెప్పినా వినలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కమీషన్ల కోసమే ఎంసీహెచ్‌ను గోదావరిలో ముంచారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల జిల్లాలో పంటలతోపాటు ఎంసీహెచ్ కూడా మునిగిందన్నారు. నిధులు ఖర్చు చేయాల్సింది ప్రజల సంక్షేమం కోసమే కానీ, ఎమ్మెల్యేల కమీషన్ల కోసం కాదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు విద్య, వైద్యం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు.

నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు బీజేపీకి లేదు



వినయ భాస్కర్

సాక్షి, హైదరాబాద్: బీజేపీకి నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు లేదని, వరంగల్‌లో శనివారం బీజేపీ నిర్వహించిన నిరుద్యోగుల మార్చ్ అబద్ధాల మార్చ్ అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కె.వాసుదేవరెడ్డితో కలిసి ఆదివారం ఆయన బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి మోదీ మాట తప్పినందుకు నిరుద్యోగ మార్చ్ ఢిల్లీలో చేయాలని హితువు పలికారు. పేపర్‌లీకు వీరులు అడ్డా కూలీలతో నిరుద్యోగ మార్చ్ చేశారని, ప్రస్తుతం రోడ్ల మీద నిరుద్యోగులెవరూ లేరని, వారంతా ఉద్యోగ పరీక్షల కోసం సిద్ధమవుతున్నారని తెలిపారు. అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా విద్య, వైద్య రంగాలకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయనను గద్దె దిగాలని బీజేపీ నేతలు మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు.

కబళించిన మంటలు





హైదరాబాద్‌లోని మార్చురీ వద్ద విలపిస్తున్న నరేశ్ తండ్రి రేష్మేని జన్నయ్య ● నరేశ్ కుటుంబం మరణ వార్త తెలిసి రెడ్డిగూడెంలో ఇంటి వద్ద విలపిస్తున్న తల్లి భద్రమ్మ

▶ మొదటి పేజీ తరువాయి

నడుపుతున్నారు. ఏ జరిగిందో తెలియదు కానీ తెల్లవారుజామున అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో అందులో మంటలు చెలరేగి పక్కనే ఉన్న భవనానికి అంటుకున్నాయి. అదే సమయంలో బాత్‌రూంకు వెళ్లేందుకు నిద్రలేచిన వాచ్‌మెన్ కుమార్తె ఉమ మంటలను గమనించి కేకలు పెడుతూ తల్లిదండ్రులను లేపింది. వారు వెంటనే మూడో అంతస్తులో ఉండే యజమాని రాంచందర్ షాకు సమాచారం ఇవ్వడంతో పాటు భవనంలో ఉన్న వారిని అప్రమత్తం చేశారు. అప్పటికే భవనమంతా దట్టమైన పొగలతో నిండిపోయి మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

కింద దుకాణాలు, పైన పోర్షన్లు

మూడంతస్తుల భవనంలో కింద వాణిజ్య దుకాణాలు ఉండగా, పైన యజమాని నివాసంతో పాటు ఆరు పోర్షన్లు ఉన్నాయి. వాచ్‌మెన్ అరుపులతో నిద్రలోంచి మేల్కొన్న వారు దిక్కుతోచని స్థితిలో ఆర్తనాదాలు చేస్తూ భవనం నుంచి బయట పడేందుకు ప్రయత్నించారు. కొంతమంది భవనంపైకి వెళ్లి పక్క భవనంపై నుంచి సురక్షితంగా బయట పడగా, మరికొందరు మంటల్లోంచే బయటకు వచ్చి గాయాలపాలయ్యారు. అయితే రెండో అంతస్తులోని సింగిల్ గదిలో ఉంటున్న సూర్యాపేట జిల్లాకు చెందిన రెపినేని నరేశ్ (37), అతని భార్య సుమ (28) కొంచెం ఆలస్యంగా నిద్రలేచారు. అప్పటికే బయటంతా మంటలు, పొగ తీవ్రరూపం దాల్చాయి. సింగిల్ రూం కావడంతో వారికి మరో మార్గం లేకుండా పోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో కుమారుడు జశ్వంత్ (5)ను తీసుకుని మంటల్లోంచే గది నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించి..మొదటి అంతస్తు మెట్ల వద్ద పడిపోయి సజీవ దహనమయ్యారు. నరేశ్ దంపతుల పెద్ద కుమారుడు అద్విక్ శనివారం రాత్రి అక్కడికి సమీపంలోనే ఉన్న సుభాష్ చంద్రనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఇక రెండో అంతస్తులో ఉన్న నారాయణ, ఉమ దంపతులు బయటకు వచ్చే క్రమంలో మంటల సెగ తాకి గాయపడ్డారు. పద్మావతి అనే మహిళ రెండో అంతస్తు నుంచి చీర సాయంతో దిగుతుండగా మంటల వేడికి చీర తెగడంతో కింద పడిపోయి గాయపడింది. ఆమె భర్త పూర్ణచందర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కాగా వాచ్‌మెన్ వీరమల్లేష్ ఇంట్లో ఉన్న సిలిండర్ పేలుతుందోమో నన్న భయంతో లోపలికి వెళ్లి దాన్ని తీసుకువచ్చే క్రమంలో స్వల్పంగా గాయపడ్డాడు. మంటలు క్షణాల్లోనే మంటలు భవనాన్ని చుట్టుముట్టాయని వాచ్‌మెన్ కూతురు ఉమ చెప్పింది.

ఆరు గంటలు శ్రమించాం: ఫైర్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి

'అగ్ని ప్రమాదం గురించి 4 గంటలకు మాకు సమాచారం అందింది. పది నిమిషాల వ్యవధిలోనే ఘటన స్థలానికి చేరుకున్నాం. అప్పటికే మంటలు, దట్టమైన పొగ కారణంగా బిల్డింగ్‌లోకి వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. సుమారు ఆరు గంటల పాటు శ్రమించి లోనికి ప్రవేశించాం. ఓ కుటుంబం మిస్ అయ్యిందని చెప్పడంతో గాలించగా మొదటి అంతస్తు కారిడార్‌పై ఓ శవం, మెట్లపై రెండు శవాలను గుర్తించాం..' అని చర్లపల్లి అగ్నిమాపక అధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా సాయినగర్ కాలనీలో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనుల కోసం రోడ్డును తవ్వేయడంతో ఫైర్ ఇంజన్లు ఘటన స్థలానికి దగ్గరగా చేరుకోలేక పోయాయని స్థానికులు చెప్పారు. ఇలావుండగా అగ్నిప్రమాదాలకు సంబంధించిన ఎలాంటి భద్రతా వ్యవస్థ లేకుండా టింబర్ డిపో నిర్వహిస్తున్న శ్రీ ఆదిత్య సాయి ఎంటర్‌ప్రైజెస్ యజమాని నూతలపాటి శివసాయిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. నరేష్, సుమ, జశ్వంత్‌ల మృతదేహాలకు గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి ప్రత్యేక అంబులెన్సుల్లో స్వస్థలానికి తరలించారు. ఈ సందర్భంగా మార్చురీ వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి.

మాకు దిక్కెవరు దేవుడా..!

మద్దిరాల: నరేశ్, అతని భార్య, కుమారుడి మరణంతో వారి స్వగ్రామం మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన జన్నయ్య, భద్రమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు సంతానం కాగా.. ఏకైక కుమారుడైన నరేశ్ 2014లో కొత్తగూడెంకు చెందిన సుమను వివాహం చేసుకున్నాడు. అనంతరం గ్రామంలోనే కూలీగా జీవనం సాగిస్తున్న నరేశ్‌కు ఉపాధి కరువైంది. దీంతో కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్‌లో లారీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లల స్కూల్ కోసమని నాలుగు నెలల క్రితమే వీరి కుటుంబం కుషాయిగూడ సాయినగర్ కాలనీకి మారింది. భార్య, పిల్లలతో బాగానే ఉంటున్నాడనుకున్న తల్లిదండ్రులు, వారి మరణ వార్త విని కుప్పకూలిపోయారు. 'మాకు దిక్కెవరు దేవుడా..మేం ఎవరికోసం బతకాలి. మమ్మల్ని కూడా తీసుకుపో దేవుడా..' అంటూ వృద్ధ దంపతులు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంపై హోం మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రితో మాట్లాడి మృతుల కుటుంబాలను, గాయపడ్డ వారిని ఆదుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో తానిక్కడికి వచ్చానని, తల్లిదండ్రుల మృతితో అనాథగా మిగిలిన అద్విక్ బాధ్యతలు పూర్తిగా ప్రభుత్వమే చూస్తుందని మల్లారెడ్డి చెప్పారు. కాగా బాధిత కుటుంబానికి జీహెచ్ఎంసీ తరపున రూ.2 లక్షల చొప్పున రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియాను నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రకటించారు.

ఖమ్మంలో 10కి 10 స్థానాలు గెలుస్తాం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పువ్వాడ

ఖమ్మంఅర్బన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు దాటనివ్వనని ఒకరు 'మంగమ్మ శపథం' చేస్తున్నారని, అయితే ప్రజలే తమను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్వార్థపూరిత, డబ్బు రాజకీయాలు నడవవని, జిల్లాలోని మొత్తం 10 అసెంబ్లీ స్థానాలనూ బీఆర్ఎస్ గెలుచుకుంటుందని మంత్రి అన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పువ్వాడ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తో అనవసరంగా వైరం పెంచుకున్నవారికి శంకరగిరి మాన్యాలే శరణ్యమని ఎద్దేవా చేశారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అని, త్వరలో ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించి బీఆర్ఎస్ సత్తా చాటుతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లోకి అవగాహన, అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కారేపల్లి మండలం చీమలపాడు ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల సాయం త్వరలోనే అందిస్తామని మంత్రి వెల్లడించారు. సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించేందుకు అందరూ సిద్ధం



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును గద్దె దించి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు గ్రామంలో శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కేసీఆర్‌ను గద్దె దించేందుకు ఏ పార్టీ ముందడుగు వేస్తుందో ఆ పార్టీకే ప్రజల మద్దతు ఉంటుందని, ఆ పార్టీ వైపే తన పయనమని స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయం మేరకు తాను ఏ పార్టీలో చేరాలనే అంశంపై మే నెలలో ప్రణాళిక నిర్ణయిస్తామని తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలేవీ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. పొంగులేటి పర్యటనలో మధిర నాయకులు కోట రాంబాబు, ముదిగొండ మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తుల వెంకటరావు, బోనకల్లు సర్పంచ్ సైదా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 7,100 కొనుగోలు కేంద్రాలు

- మంత్రి గంగుల కమలాకర్



చెర్లభూత్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌రూరల్: యాసంగి పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 7,100 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లైచైర్మన్ రవీందర్‌సింగ్‌తో కలిసి మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర చెల్లిస్తూ రెండో పంటను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. యాసంగి పంట ముందుగా కోతకు రావడంతో సీఎం ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా 7,100 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ఇప్పటివరకు 420 కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.4.15కోట్ల విలువైన 2వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో కేంద్రాలను ప్రారంభించేందుకు కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

మంత్రి గంగులకు తప్పిన ప్రమాదం

రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు ప్రమాదం తప్పింది. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆదివారం కొందరు చిరుతల రామాయణం నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం శ్రీసీతారాముల పట్టాభిషేకం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి మంత్రి గంగుల హాజరై వేదికపైకి చేరుకున్నారు. ఆయనతోపాటు సివిల్ సప్లైచైర్మన్ రవీందర్‌సింగ్ కూడా ఉన్నారు. అయితే అప్పటికే పెద్దసంఖ్యలో మహిళలు వేదికపైకి ఉన్నారు. గంగుల, రవీందర్‌సింగ్‌తోపాటు స్థానిక నాయకులు వేదికపైకి వెళ్లడంతో ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో మంత్రి గంగుల కమలాకర్ ఎడమకాలుకు గాయమైంది. రవీందర్‌సింగ్, జెడ్పీటీసీ లలిత స్వల్పంగా గాయపడ్డారు. పడిపోయిన మంత్రి వెంటనే గన్‌మెన్లు, నిర్వాహకులు పైకి లేపి ఆస్పత్రికి తరలించారు. చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు.

బీఆర్ఎస్‌లోకి ఔరంగాబాద్ నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఔరంగాబాద్ జిల్లాకు చెందిన శివసేన సీనియర్ లీడర్ అన్నాసాహెబ్ మానేను బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు గంగాపూర్ నియోజక వర్గానికి చెందిన సంతోష్ కుమార్, ఔరంగాబాద్ ఎన్సీపీ యూత్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పాటిల్ కూడా బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన నాందేడ్, కాంధార్ లోహా నుంచి మొదలైన ఈ చేరికల పర్వం.. దీంతో మధ్య మహారాష్ట్రకు చేరుకున్నట్టయింది. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బాల్కసుమన్ పాల్గొన్నారు.

యూపీలో బీజేపీది తుపాకీ పాలన

- అతీక్, అష్రాఫ్ హత్యలపై విచారణ జరిపించాలి: అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లో 2017 నుంచి బీజేపీ ప్రభుత్వం 'తుపాకీ పాలన' నడుపుతోందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. మాజీ ఎంపీ అతిక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్‌ల హత్యలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏ ఒక్క అధికారిని కూడా చేర్చకుండా విచారణ కోసం ప్రత్యేక కమిటీని వేయాలన్నారు. నిర్ణీత కాలపరిమితి మేరకు విచారణ జరిపి సుప్రీంకోర్టుకు నివేదించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సంఘటన సమయంలో అక్కడ ఉన్న పోలీసు అధికారులందరినీ సర్వీసు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో శాంతి భద్రతల అంశంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని తీవ్రంగా విరుచుకొనిపడ్డారు. ఈ ఘటనలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం పాత్ర ఉందని ఆరోపించారు. ఉత్తర ప్రదేశ్‌లో పర్యటించేందుకు భయపడనని స్పష్టం చేశారు. హంతకులకు ఆ ఆయుధాలు ఎలా వచ్చాయి.. హత్యకాండకు పాల్పడిన తర్వాత మతపరమైన నినాదాలు ఎందుకు చేశారు... హంతకులు ఉగ్రవాదులు కాకపోతే, మరి దేశభక్తులా? అని ప్రశ్నించారు. ఈ సంఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని, సుమోటోగా విచారణ జరిపించాలని సుప్రీం కోర్టును అభ్యర్థించారు. ఘటన తర్వాత రాజ్యాంగం, శాంతిభద్రతలపై ప్రజలకు విశ్వాసం ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. శాంతిభద్రతలలో విఫలమైన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీతోనే విద్వేష రాజకీయాలకు ముగింపు



కాసాని జ్ఞానేశ్వర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో విద్వేష రాజకీయాలకు ముగింపు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ ఎస్.మానయ్య ఆధ్వర్యంలో పరిగి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన పార్టీ టీడీపీ అని అన్నారు. టీటీడీపీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎన్టీఆర్ భవన్‌లో ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్నామని, పార్టీ అధినేత చంద్రబాబు దీనికి హాజరవుతారని కాసాని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణ తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గంలోకి పలువురికి స్థానం కల్పించారు. ముగ్గురు ఉపాధ్యక్షులు, ము గ్గురు ప్రధాన కార్యదర్శులు, ముగ్గురు అధికార ప్రతినిధులు, 8 మంది కార్యనిర్వాహక కార్యదర్శులు, 9 మంది కార్యదర్శులు, మీడియా కమిటీ చైర్మన్, కో–ఆర్డినేటర్లను నియమించినట్లు కాసాని తెలిపారు.

కమిటీ వివరాలివీ..

ఉపాధ్యక్షులు: డాక్టర్ వాసిరెడ్డి రామనాథం(ఖమ్మం పార్లమెంటరీ స్థానం), బండి పుల్లయ్య (మహబూబాబాద్ పార్లమెంటరీ స్థానం), అలీ మస్కతీ (హైదరాబాద్ పార్లమెంటరీ స్థానం)

ప్రధాన కార్యదర్శులు: జక్కలి ఐలయ్య యాదవ్(భువనగిరి ఎంపీ స్థానం), ఏకే గంగాధర్(మెదక్ ఎంపీ స్థానం), టి.మధుసూదన్‌రెడ్డి (నల్లగొండ ఎంపీ స్థానం)

అధికార ప్రతినిధులు: నెల్లూరి దుర్గాప్రసాద్ (నల్లగొండ ఎంపీ స్థానం), శ్రీనివాస్ నాయుడు (సికింద్రాబాద్), దామెర సత్యం (కరీంనగర్ పార్లమెంటరీ స్థానం)



ఫస్ట్ రన్నరప్‌తో నందినీ (ఎడమ)

ఫెమినా మిస్ ఇండియా వరల్డ్‌గా నందినీ గుప్తా

ఫెమినా మిస్ ఇండియా వరల్డ్- 2023గా రాజస్తాన్‌కు చెందిన నందినీ గుప్తా(19) ఎంపికయ్యారు. మిస్ వరల్డ్ పోటీల్లో నందినీ గుప్తా భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాజస్తాన్‌లో జరిగిన 59వ ఎడిషన్ ఫైనల్స్‌లో ఢిల్లీకి చెందిన షెర్యా పూంజా ఫస్ట్ రన్నరప్‌గా, మణిపూర్‌కు చెందిన స్ట్రెలా లువాంగ్ రెండో రన్నరప్‌గా నిలిచారు.

వయస్సు ఏడాది.. మంచులో 150 మైళ్ల ప్రయాణం



అలాస్కా: ఏడాది వయస్సు ఆస్ట్రేలియన్ షెపర్డ్ కుక్క పిల్ల పేరు ననుక్. దీని సాహసం చూస్తే ఆశ్చర్యం కలగకమానదు. యజమాని కుటుంబం తోపాటు టూర్‌కెళ్లి తప్పిపోయింది. గడ్డకట్టిన బేరింగ్ సముద్రం మీదుగా 150 మైళ్లు ప్రయాణించింది. మధ్యలో సీల్స్, మంచు ఎలుగుబంట్ల దాడిలో గాయపడింది. చివరికి నెల తర్వాత అలాస్కాలోని గాంబెల్‌లో యజమాని మాండీ ఇవోగ్రిగస్ ఇంటికి చేరుకుంది. మాండీ కుటుంబం గత నెలలో బేరింగ్ జలసంధిలోని సెంట్ లారెన్స్ దీవిలో సవూంగా ప్రాంతానికి వెళ్లింది. అక్కడే మాండీ కుటుంబానికి చెందిన ననుక్, స్టార్‌లైట్ అనే కుక్కలు తప్పిపోయాయి. కొద్ది రోజులకు స్టార్‌లైట్ ఇంటికి చేరుకుంది. కానీ, ననుక్‌కు దారి దొరకలేదు. సోషల్ మీడియాలో ననుక్ గురించి మాండీ కుటుంబం పోస్టులు పెట్టింది. చివరికి అక్కడికి 150 మైళ్ల దూరంలోని వేల్స్‌లో ఉన్నట్లు తెలిసింది. విమానయాన సంస్థల సహకారంతో ననుక్‌ను సొంతూరికి రప్పించారు. శరీరంపై కొద్దిపాటి గాయాలే తప్ప మొత్తమ్మీద ఆరోగ్యంగా ఉన్న ననుక్‌ను చూసి మాండీ కుటుంబంలోని చిన్నారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అయితే, ననుక్ అంతదూరం ప్రయాణించడం మాత్రం మిస్టరీయేనని కుటుంబీకులు చెబుతున్నారు.

జుట్టుపైనా వివక్ష..!

అమెరికాలో పాతుకుపోయిన భావజాలం నిషేధిస్తూ బిల్లును ఆమోదించిన టెక్సాస్

'అది జుట్టా, కలుపు మొక్కా?' అని ఒకరు,
'గొర్రె బొచ్చుకు, వారి జుట్టుకు ఏమన్నా తేడా ఉందా?' అని మరొకరు,
'నల్ల జుట్టుంటే ఉద్యోగానికేం పనికొస్తారు?'
జుట్టుపై అమెరికన్ల వివక్షాపూరిత వ్యాఖ్యలివి!

జాతి వివక్ష, మత వివక్ష, కుల వివక్ష గురించి విన్నాం. కానీ అగ్రరాజ్యంగా చెప్పుకునే అమెరికాలో మాత్రం తలపై జుట్టు దగ్గర్నుంచి కాలి గోళ్ల దాకా అక్కడ అన్నింటా వివక్ష రాజ్యమేలుతోంది. నల్ల జుట్టుపై వివక్షను నిషేధిస్తూ టెక్సాస్ హౌస్ తాజాగా బిల్లును ఆమోదించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయంగా మారింది...



జుట్టు నల్లగా, పొడవుగా, రింగులు తిరిగి ఉంటే అమెరికన్లు సహించలేరు. కొప్పు బాగా కుదిరితే చక్కగా ఉంటుందంటాం. కానీ నల్లజాతి అమ్మాయిలు రకరకాల హెయిర్ స్టైల్స్‌తో కొప్పును గొప్పగా ప్రదర్శించడం కూడా అమెరికన్లకు కంటగింపు వ్యవహారమే. స్కూళ్లు, పని ప్రాంతాలు, నలుగురు కలిసే చోట... ఇలా అంతటా ఈ వివక్ష తీవ్ర రూపు దాల్చి కన్పిస్తుందక్కడ. ఆఫ్రో, బ్రెయిడ్స్, డ్రెడ్‌లాక్స్, కార్న్‌రోస్ హెయిర్ స్టైల్స్ చేసుకునే వారిపై వివక్ష పెరిగిపోతుండటంతో టెక్సాస్‌లో ప్రతినిధుల సభ కల్పించుకోవాల్సి వచ్చింది. నల్లజుట్టుపై వివక్ష పనికిరాదంటూ క్రౌన్ యాక్ట్ బిల్లును ఆమోదించింది. జుట్టుపై వివక్ష తగదంటూ డెమొక్రాట్ సభ్యురాలు రెట్టా బోవర్స్ తొలుత గళమెత్తారు. ఎవరి జుట్టు ఎలా ఉంటే అలానే ఉండనివ్వాలి. మార్చుకొమ్మని శాసించే హక్కు ఎవరికీ ఉండదు''అన్నారామె. బోవర్స్ తొలిసారి ఈ బిల్లును ప్రతిపాదించినప్పుడు ఇదంత అవసరమా అని అంతా కొట్టిపారేసారు. కానీ ఇప్పుడది 143–5 ఓట్లతో నెగ్గడంతో ఆమె ఆనందం అవధులు దాటింది.

బిల్లు ఎలా వచ్చిందంటే..

హ్యూస్టన్‌లో బార్బర్స్ హిల్ హైస్కూలులో అధికారులు డెండ్రే ఆర్నాల్డ్ అనే విద్యార్థిపై చూపిన వివక్ష ఈ బిల్లుకు కారణమైంది. ఆర్నాల్డ్ ఏడో తరగతి నుంచి జుట్టు పెంచుకుంటున్నాడు. అది ట్రినిడాడియన్ల సంస్కృతిలో భాగం. కానీ జుట్టు కత్తిరించుకోకుంటే గ్రాడ్యుయేషన్ క్లాసులకు అనుమతించేది లేదని స్కూలు అధికారులు తేల్చి చెప్పారు. అబ్బాయి తల్లిదండ్రులు కాళ్లావేళ్లా పడ్డా లాభం లేకపోయింది. ఇదంతా 2020లో జరిగింది. ఆర్నాల్డ్ కథ ఇంటర్నెట్‌లో వైరలైంది. అతనికి ప్రఖ్యాత టీవీ షో ది ఎలెన్ డిజెనరస్‌లో పాల్గొనే అవకాశం వచ్చింది. హెయిర్ లవ్ అనే షార్ట్ ఫిల్మ్ తీసిన దర్శకుడు మాథ్యూ ఎ చెర్రీ ఆ అబ్బాయిని ఆస్కార్ అవార్డు ఫంక్షన్‌కు కూడా ఆహ్వానించాడు. మరెందరో విద్యార్థులను జుట్టు పొడవుగా ఉందంటూ స్కూలు నుంచి తీసేసిన ఉదంతాలు వెలుగులోకి రావడంతో ఈ వివక్షను నిషేధిస్తూ చట్టం చేయాల్సి వచ్చింది.

ఒబామా భార్యకూ తప్పలేదు!

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మహిళ మిషెల్‌కు కూడా జుట్టు వివక్ష తిప్పలు తప్పలేదు. ఒబామా అధ్యక్షుడిగా ఉండగా ఆమె తన రింగుల జుట్టును సాఫీగా ఉండేలా చేయించుకున్నారట. ఈ విషయం గతేడాది ఓ కార్యక్రమంలో ఆమే స్వయంగా చెప్పారు. ''వైట్‌హౌస్‌లో ఉండగా ఒబామా పాలనపై కాకుండా నా జుట్టుపై ఎక్కడ చర్చ జరుగుతుందోనని హెయిర్‌స్టైల్ మార్చుకున్నా. ఒక నల్లజాతి కుటుంబం శ్వేతసౌధంలో ఉండటాన్ని సగటు అమెరికన్లు అంతగా జీర్ణించుకోలేరు. దానికి తోడు నా జుట్టుపైనా వివాదం రేగడం ఎందుకని భావించా''అన్నారు. అమెరికా సమాజంలో జుట్టు వివక్ష ఎంతలా వేళ్లూనుకుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు!

ఈ వివక్ష ఇప్పటిది కాదు!

అమెరికాలో నల్ల జుట్టుపై వివక్ష 18వ శతాబ్దం నుంచీ ఉంది. ఆఫ్రికన్ల జుట్టు గొర్రె బొచ్చులా ఉంటుందని అప్పట్లోనే హేళన చేసేవారు. తర్వాత రకరకాల హెయిర్ స్టైల్స్ చేసుకునే నల్లజాతి మహిళలు ఉద్యోగాలకు పనికి రారన్న అభిప్రాయం అమెరికన్లలో పెరిగింది. జుట్టు ఎక్కువున్న వారికి వృత్తిపరమైన లక్షణాలేవీ ఉండవని, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే సామర్థ్యముండదని అడ్డమైన వాదనలు తెరపైకి తెచ్చారు. తెల్ల జుట్టు వాళ్లకే ఉద్యోగాల్లో ప్రాధాన్యమిచ్చేవారు.

ఇంటర్వ్యూ ఉంటే హెయిర్‌స్టైల్ మారాల్సిందే!

డోవ్, లింక్డిన్ సంస్థలు ఇటీవల జుట్టు వివక్షపై సంయుక్త అధ్యయనం చేశాయి. నల్లజాతి యువతుల్లో మూడింట రెండొంతుల మంది ఇంటర్వ్యూలకి వెళ్లినప్పుడు హెయిర్ స్టైల్స్ మార్చుకుంటున్నట్టు తేలింది. నల్లటి కురులున్న 25–34 మధ్య వయసు వారిలో 20 శాతం మందిని ఉద్యోగాల నుంచి తీసేశారు. టీవీ షోలు, సోషల్ మీడియాలోనూ నల్ల జుట్టుపై విషం కక్కడం పరిపాటిగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కర్ణాటకలో బీజేపీకి మరో షాక్

మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ రాజీనామా

బనశంకరి: కర్ణాటకలో మరో 25 రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా అధికార బీజేపీకి మరో గట్టి దెబ్బ తగిలింది. కన్నడనాట బీజేపీని బలోపేతం చేసిన మొదటితరం నేతల్లో ఒకరైన మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన బలమైన లింగాయత్ సామాజిక వర్గం నేత. హుబ్లీ–ధార్వాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా ఎన్నికవుతూ ఉన్నారు. షెట్టర్ 2012 మే- 2013 జూన్ కాలంలో సీఎంగా వ్యవహరించారు. బీజేపీ నేత లక్ష్మణ సవది ఇటీవలే కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. ఆదివారం ఉత్తర కన్నడ జిల్లా శిరసిలో అసెంబ్లీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరిని కలిసి షెట్టర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా



సమర్పించారు. తరువాత బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం ద్వారా 4 దశాబ్దాల బంధాన్ని తెంచుకున్నారు. టికెట్ కోసం షెట్టర్ మూడురోజులుగా ఢిల్లీలో మకాం వేసి పార్టీ పెద్దలతో ప్రయత్నాలు చేసినా నిరాశే మిగిలింది. ఈయన కాంగ్రెస్‌లో చేరొచ్చని వినికిడి.

పెద్ద క్రిమినల్స్ అవుదామని..

అతీక్, అష్రాఫ్ అహ్మద్‌ను హత్య చేయడానికి కారణం అదే



అరుణ్ మౌర్య సన్నీ తివారీ

ప్రయాగ్‌రాజ్/లక్నో/న్యూఢిల్లీ: నేర ప్రపంచంలో తమ పేరు మార్మోగిపోవాలి, ఒక్కసారిగా పెద్ద గుర్తింపు రావాలన్న ఆకాంక్షే హత్యలకు పురిగొల్పిందా? అవుననే చెబుతున్నారు ఉత్తరప్రదేశ్‌లో గ్యాంగ్‌స్టర్లు అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్‌ను హత్య చేసిన నిందితులు. శనివారం రాత్రి మీడియా, పోలీసుల సమక్షంలోనే ఇద్దరిని కాల్చిచంపిన సంగతి తెలిసిందే. బాందాకు చెందిన లవ్లేశ్ తివారీ(22), హమీర్‌పూర్‌కు చెందిన మోహిత్ అలియాస్ సన్నీ(23), కాస్‌గంజ్‌కు చెందిన అరుణ్ మౌర్య(18)ను పోలీసులు అరెస్టు చేశారు. వారిని ప్రశ్నించి వివరాలు రాబట్టారు. జంట హత్యలకు గల కారణాలపై ఆరా తీశారు. నేర ప్రపంచంలో గుర్తింపు, పేరుప్రఖ్యాతుల కోసమే హత్యలు చేశామని నిందితుల్లో ఒకరు అంగీకరించినట్లు తెలిసింది. లవ్లేశ్ తివారీ మాదక ద్రవ్యాలకు బానిస అయ్యాడని బాందాలో అతడి పొరుగింటి వ్యక్తి చెప్పారు. లవ్లేశ్ గతంలో నేరాలకు పాల్పడి, పలుమార్లు జైలుకు వెళ్లొచ్చాడని వెల్లడించారు. సన్నీ నేరాల్లోకి ఎలా అడుగు పెట్టాడో తనకు తెలియదని అతడి సోదరుడు పింటూ చెప్పాడు.

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి నిందితులు

గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ అహ్మద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ప్రయాగ్‌రాజ్ కోర్టు ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్ హత్య ఘటనపై దర్యాప్తు కోసం ప్రభుత్వం కమిషన్ ముగ్గురు సభ్యులతో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసింది.

చట్ట ప్రకారమే శిక్షించాలి: కాంగ్రెస్

నేరగాళ్లకు కఠిన శిక్షలు విధించాలని, కానీ, అది చట్టప్రకారమే జరగాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. దేశంలో అమల్లో ఉన్న చట్టాలకు లోబడే శిక్షలు ఉండాలని పేర్కొంది. రాజకీయ లబ్ధి కోసం చట్టాన్ని అతిక్రమించడం ప్రజాస్వామ్యానికి ముప్పేనని తేల్చిచెప్పింది. అతీక్ అహ్మద్, అష్రాఫ్ హత్యల నేపథ్యంలో కాంగ్రెస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. నేరస్తులకు శిక్షలు విధించడానికి న్యాయస్థానాలు ఉన్నాయని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గుర్తుచేశారు.

మన్మోహన్ ప్రభుత్వాన్ని కాపాడినవారిలో అతీక్

అమెరికాతో అణు ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ 2008లో అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించాయి. లోక్‌సభలో యూపీఏ సర్కారు సంఖ్యాబలం 228కి పడిపోయింది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో గట్టెక్కాలంటే మరో 44 మంది ఎంపీల మద్దతు అవసరం. ప్రభుత్వాన్ని కాపాడడానికి సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ లోక్‌దళ్, జేడీ(యూ) తదితర పార్టీలు ముందుకొచ్చాయి. గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ. కానీ, జైలులో ఉన్నాడు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి మొత్తం ఆరుగురు ఎంపీలను జైళ్ల నుంచి తాత్కాలికంగా బయటకు తీసుకొచ్చారు. వారిలో అతీక్ అహ్మద్ కూడా ఉన్నాడు.



66 అడుగుల లోతు ఉన్న ఈ మంచు కారిడార్ జపాన్‌లో ఉంది. ఇంతలోతుకు మంచు తొలచి అక్కడి టటెయామా కురోబే ఆల్పైన్ మార్గం సిద్ధంచేశారు. శనివారం నుంచి ఈ మార్గంలో పర్యాటకులను అనుమతిస్తున్నారు. ప్రకృతిరమణీయమైన ఈ ప్రాంతాన్ని జపాన్ పైకప్పుగా పిలుస్తారు.

లిక్కర్ స్కామ్‌లో మీ పాత్ర ఏంటి?

- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రశ్నించిన సీబీఐ
- దాదాపు 9 గంటలపాటు ప్రశ్నల వర్షం



సీబీఐ విచారణకు వెళ్లడానికి ముందు మీడియాతో మాట్లాడుతున్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను సీబీఐ అధికారులు ఆదివారం ప్రశ్నించారు. మౌఖికంగా, లిఖితపూర్వకంగా ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. కేజ్రీవాల్ తొలుత రాజ్‌ఘాట్‌లో గాంధీజీ స్మారకాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. సీబీఐ అధికారులు ఉదయం నుంచి రాత్రి 8.30 గంటల దాకా.. దాదాపు 9 గంటలపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించారు. సీబీఐ కార్యాలయం వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విచారణ అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. అధికారులు 56 ప్రశ్నలు అడిగారని, అన్నింటికీ సమాధానాలు చెప్పానని వివరించారు. తాము ఏ తప్పూ చేయలేదన్నారు. ప్రాణాలు వదులుకుంటాం తప్ప నిజాయతీని కాదని తేల్చిచెప్పారు. సీబీఐ కార్యాలయానికి చేరుకోవడానికంటే ముందు కేజ్రీవాల్ 5 నిమిషాల నిడివిగల వీడియో ట్వీట్‌చేశారు. 'నన్ను అరెస్టుచేయాలని సీబీఐని బీజేపీ ఆదేశించబోతోంది. సీబీఐ అడిగే ప్రతి దానికీ సమాధానం చెప్తా. దాచడానికి ఏమీ లేదు. బీజేపీ నేతలు చాలా శక్తివంతమైన వ్యక్తులు. వారు ఎవరినైనా అరెస్టు చేయించగలరు. నేరం చేయకున్నా జైలుకు పంపించగలరు' అని పేర్కొన్నారు.

ఆప్ నేతల అరెస్టు

మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్‌ను సీబీఐ ప్రశ్నించడాన్ని వ్యతిరేకిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు దాదాపు 1,500 మందిని అరెస్టు చేశారు. 32 మంది ఢిల్లీ ఎమ్మెల్యేలు, 70 మంది కౌన్సిలర్లు, 20 మంది పంజాబ్ ఎమ్మెల్యేలను అరెస్టుచేశారని పార్టీ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ తెలియజేశారు.

లై–డిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా?: బీజేపీ

సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు సాక్ష్యాలు, వాస్తవాల ఆధారంగానే పని చేస్తాయని, భావోద్వేగాలతో కాదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా పేర్కొన్నారు. అవినీతి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా నాటకాలు ఆపాలని హితవు పలికారు. లై–డిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా? అని కేజ్రీవాల్‌కు సవాలు విసిరారు.

ఈకల్లో విషం.. తాకితే మరణం

కిలకిలరావాలతో అలరించే పక్షులంటే ఇష్టపడనివారు ఎవరుంటారు? బుల్లి పిట్టలను ఇంట్లో పెంచుకోవడం చాలామందికి ఒక చక్కటి అభిరుచి. పిట్టలకు ఆహారం, నీరు అందిస్తూ వాటి ఎదుగుదలను చూసి ఆనందిస్తుంటారు. పక్షులంటే మనుషులకు ప్రియనేస్తాలే. కానీ, ముట్టుకుంటే చాలు క్షణాల్లో ప్రాణాలు తీసే భయంకరమైన రెండు రకాల పక్షులను న్యూగినియా అడవుల్లో డెన్మార్క్ పరిశోధకులు గుర్తించారు. అవి వాటి ఈకల్లో విషం దాచుకుంటున్నట్లు కనిపెట్టారు. వాటిని ఇంట్లో పెంచుకోలేం, ఆహారం ఇవ్వలేం. విషపూరిత పక్షుల సమీపంలోకి వెళ్లడం కూడా ప్రమాదమేనని హెచ్చరిస్తున్నారు.

- అడవుల్లో విషపూరిత ఫలాలు, పదార్థాలను ఆరగించి, వాటిని న్యూరోటాక్సిన్లుగా మార్చి, తన రెక్కల్లో నిల్వ చేసుకొనే సామర్థ్యం ఈ పక్షుల్లో అభివృద్ధి చెందింది.
- విష ప్రభావాన్ని తట్టుకొని జీవించే శక్తి సమకూరింది.
- కాలానుగుణంగా వాటి శరీరంలో సంభవించిన జన్యుపరమైన మార్పులే ఇందుకు కారణమని డెన్మార్క్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం ప్రతినిధి జాన్సన్ చెప్పారు.

- న్యూగినియా అడవుల్లో రెండు రకాల విషపూరిత పక్షులు
- గుర్తించిన డెన్మార్క్ సైంటిస్టులు

- ఇటీవల న్యూగినియా అడవుల్లో పర్యటన సందర్భంగా ఈ పక్షులను గుర్తించామని ఒక ప్రకటనలో వెల్లడించారు.
- తాజాగా గుర్తించిన రెండు రకాల విషపూరిత పక్షులు రిజెంట్ విజ్లర్(పచీసెఫాలా ష్లీగెల్లీ), రఫోస్–నేప్డ్ బెల్‌బర్డ్(అలిడ్రియాస్ రుఫినుచా) అనే పక్షి జాతులకు చెందినవి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఈ జాతులు అధికంగా కనిపిస్తుంటాయి.
- సౌత్, సెంట్రల్ అమెరికాలో ఉండే డార్ట్ కప్పలు (గోల్డెన్ పాయిజన్ ఫ్రాగ్స్) అత్యంత విషపూరితమైనవి చెబుతుంటారు. ఈ కప్పలను తాకితే కొద్దిసేపట్లోనే మరణం సంభవిస్తుంది.
- డార్ట్ కప్పల్లోని విషం లాంటిదే ఈ పక్షుల్లోనూ ఉన్నట్లు పరిశోధకులు కనిపెట్టారు.
- పక్షుల్లో బాట్రాసోటాక్సిన్ అనే విషం అధిక



మోతాదులో ఉందని సైంటిస్టులు పేర్కొన్నారు.
- ఇలాంటి విషమే గోల్డెన్ పాయిజన్ కప్పల చర్మంలో ఉంటుంది.
- విషం నిల్వ ఉన్న ఈ పక్షుల ఈకలను తాకితే కండరాల్లో పక్షవాతం లాంటిది ఏర్పడుతుంది. గుండె కొట్టుకోవడం ఆగిపోతోంది. చివరకు మృత్యువు కాటేస్తుంది. ఇదంతా క్షణాల వ్యవధిలోనే జరిగిపోతోంది.
- పక్షుల శరీరంలో సోడియం చానళ్లను క్రమబద్ధం చేసే ప్రాంతాల్లో మ్యుటేషన్స్(మార్పులు) వల్ల వాటిలో విషాన్ని తయారు చేసుకొని నిల్వచేసుకోవడంతోపాటు తట్టుకొనే శక్తి స్వతంత్రంగానే అభివృద్ధి చెందిందని సైంటిస్టులు పేర్కొన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అవినీతికి ప్రతీక అదానీ: రాహుల్

కోలారు: అదానీపై చూపిస్తున్న ప్రేమను ప్రధాని మోదీ పేద ప్రజలపై ఇసుమంతైనా చూపించడం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆదివారం కర్ణాటకలోని కోలారు పట్టణంలో నిర్వహించిన జై భారత్ సభలో ప్రధాని మోదీపై ఆయన విమర్శల వర్షం కురిపించారు. గతంలో కోలారులోనే మోదీపై ఆరోపణలు చేసిన కేసులో రాహుల్‌కు జైలుశిక్ష పడి లోక్‌సభ సభ్యత్వం రద్దయిన విషయం తెలిసిందే. ఆదివారం ఇక్కడ జరిగిన మొదటి ఎన్నికల సభలో ఆయన ప్రసంగిస్తూ బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. తన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసి, జైలుపాలు చేసినా ప్రభుత్వాన్ని చూసి భయపడేది లేదని స్పష్టం చేశారు. అదానీ అవినీతికి మారుపేరని పేర్కొన్నారు. 'అదానీ విమానంలో ప్రధాని మోదీ అత్యంత రిలాక్స్ మూడ్‌లో ఎందుకు కూర్చుంటారు? అదానీ కంపెనీలో చైనా డైరెక్టర్ ఎందుకు ఉన్నారు?'అని రాహుల్ ప్రశ్నించారు. మోదీ, అదానీ సంబంధాలపై ప్రశ్నించినప్పుడల్లా బీసీ వర్గాన్ని అవమానించానంటూ తనవైపు వేలెత్తి చూపుతున్నారని విమర్శించారు.

కనికట్టు కాదిది.. తలకట్టు!

అమెరికాకు చెందిన నల్లజాతి మహిళ ఎవిన్ డుగాస్(47) తన 5 అడుగుల 5 అంగుళాల భారీ తలకట్టుతో గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించింది. అతి పెద్ద తలకట్టును కలిగిన ఆఫ్రికా సంతతి మహిళగా గత 13 ఏళ్లలో ఆమె మూడు పర్యాయాలు తన రికార్డులను తానే బద్దలు కొట్టింది. లూసియానాకు చెందిన డుగాస్ 1999 నుంచి కురులను పెంచుతోంది.



వజ్రంలో వజ్రం

సూరత్ కంపెనీకి అరుదైన వజ్రం లభ్యం



సూరత్: వజ్రాన్ని చూస్తేనే కళ్లు చెదురుతాయి. ధగధగలాడుతూ చూపరుల్ని కట్టి పడేస్తుంది. అలాంటిది వజ్రంలో వజ్రం ఉంటే ఇంక వేరే చెప్పాలా. కళ్లు కూడా తిప్పుకోలేం. అలాంటి అరుదైన వజ్రం గుజరాత్‌లో సూరత్‌లో వి.డి. గ్లోబల్ అనే వజ్రాల కంపెనీకి లభించింది. ఆ వజ్రం లోపలున్న వజ్రం కూడా లోపల అటూఇటూ ఎంచక్కా కదులుతోందని ఆ కంపెనీ వెల్లడించింది. 0.329 క్యారట్ల ఈ వజ్రానికి బీటింగ్ హార్ట్ అని పేరు పెట్టారు. వజ్రాల గనుల తవ్వకాల్లో గత ఏడాది అక్టోబర్‌లో ఈ వజ్రం లభించింది. అరుదైన వజ్రం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ది జెమ్ అండ్ జ్యూయెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రామోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) దానిపై మరింత అధ్యయనం చేసింది. ఆప్టికల్, ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్స్ ద్వారా విశ్లేషించి 2019లో సైబీరియాలో లభించిన వజ్రం మాదిరిదే బీటింగ్ హార్ట్ కూడానని తేల్చింది. అప్పట్లో సైబీరియాలో లభించిన ఈ వజ్రంలో వజ్రం 80 కోట్ల ఏళ్ల కిందటిదని, విలువ అమూల్యమని చెప్పుకున్నారు. ఆ వజ్రానికి మత్రోష్కా అని పేరు పెట్టారు. రష్యాలో తయారు చేసే ఒక దానిలో ఒకటి ఇమిడిపోయే చెక్క బొమ్మల్ని మత్రోష్కా అని పిలుస్తారు. ఇప్పుడు అచ్చంగా అదే మాదిరి వజ్రం మన దేశంలో కూడా లభించడం విశేషం. ఈ వజ్రం లోపలి వజ్రం కూడా అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. వజ్రాలపై అధ్యయనం చేసే 'డి బీర్స్'గ్రూప్‌కు చెందిన నిపుణురాలు సమంతా సిల్లీ గత 30 ఏళ్లలో బీటింగ్ హార్ట్‌లాంటి అరుదైన వజ్రాన్ని చూడలేదని చెప్పారు. ఈ వజ్రం ఎలా ఏర్పడిందో అధ్యయనం చేస్తామని తెలిపారు.

గంటలో 3,206 పుష్ అప్‌లు

ఆస్ట్రేలియా వ్యక్తి గిన్నిస్ రికార్డు



సిడ్నీ: జిమ్ చేసే సిక్స్‌ప్యాక్ బాడీ అయినా రోజూ 100 పుష్‌అప్‌లు చేస్తేనే బాగా అలిసిపోతారు. అలాంటిది ఆస్ట్రేలియాకు చెందిన ఒక వ్యక్తి కేవలం గంటలో 3,206 పుష్‌అప్‌లు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కారు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌కు చెందిన 33 ఏళ్ల లుకాస్ హెల్మెక్ పుష్ అప్‌లు చేయడం ద్వారా తనకున్న స్టామినా ఏంటో ప్రపంచానికి చూపించాడు. గంటకి 3,182 పుష్ అప్‌లు చేసి రికార్డు సాధించిన సాటి ఆస్ట్రేలియన్ డేనియల్ స్కాలి పేరు మీదున్న రికార్డుల్ని బద్దలు కొట్టాడు. లుకాస్ నిమిషానికి 53 పుష్ అప్‌లు చేశాడని గిన్నిస్ వరల్డ్ అధికారులు వెల్లడించారు. ఈ రికార్డు సాధించడానికి అనుభవజ్ఞులైన జిమర్‌ల దగ్గర రెండు మూడేళ్ల పాటు శిక్షణ కూడా తీసుకున్నట్టు లుకాస్ వెల్లడించాడు.

కర్ణాటకలో రూ.170 కోట్లు సీజ్: ఈసీ

బెంగళూరు: కర్ణాటకలో ఎన్నికల నిబంధనావళి అమల్లోకి వచ్చిన మార్చి 29వ తేదీ నుంచి ఇప్పటివరకు జరిపిన దాడుల్లో రూ.170 కోట్ల సొత్తు పట్టుబడిందని ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. ఇందులో రూ.71 కోట్ల నగదు, రూ.38 కోట్ల విలువైన మద్యం, రూ.29 కోట్ల ఆభరణాలు, రూ.19 కోట్ల ఉచిత వస్తువులు, రూ.13 కోట్ల డ్రగ్స్ ఉన్నాయని వెల్లడించింది. ఇందుకు సంబంధించి 1,410 వరకు కేసులు నమోదు చేశామని కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ అధికారి చెప్పారు. మే 10వ తేదీన జరగాల్సిన ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడానికి ముందు అంటే మార్చి 9–27 తేదీల మధ్య రూ.58 కోట్లు సీజ్ చేశామని వివరించారు.

మోదీ గొప్ప దార్శనికుడు

అమెరికా వాణిజ్య మంత్రి గినా రైమొండో ప్రశంసలు

వాషింగ్టన్: ప్రధాని మోదీపై అమెరికా వాణిజ్య మంత్రి ప్రశంసలు కురిపించారు. ఆయన గొప్పదార్శనికుడని, భారత్‌ను ప్రపంచశక్తిగా తయారు చేసేందుకు పేదరికాన్ని పారదోలేందుకు, అంకితభావంతో పనిచేస్తున్న ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా కొనియాడారు. శనివారం వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రైమొండో...గత నెలలో భారత్‌లో పర్యటించిన ఆమె ప్రధాని మోదీతో సమావేశమైన విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. టెక్నాలజీ గురించి కూడా మోదీకి లోతైన పరిజ్ఞానం ఉందన్నారు. ఏఐ అంటే కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అని మనకు తెలుసు, కానీ, ఏఐ అంటే అమెరికా–ఇండియా టెక్నాలజీ అని మోదీ చెప్పారన్నారు. ఏఐ రంగంలో విప్లవానికి అమెరికా, భారత్‌లు సారథ్యం వహిస్తాయని రైమొండో తెలిపారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు.. నలుగురి మృతి

డేడ్‌విల్లే: అమెరికాలో మళ్లీ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. అలబామా రాష్ట్రంలోని చిన్న పట్టణమైన డేడ్‌విల్లేలో శనివారం రాత్రి 10.30 గంటలకు పుట్టినరోజు వేడకల్లో కాల్పులు జరిగినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారా? లేదా? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు.

వడదెబ్బకు 13 మంది బలి

ముంబై: మహారాష్ట్ర భూషణ్ పురస్కార ప్రదానోత్సవంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఖార్‌గఢ్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు లక్షలాది మంది తరలివచ్చారు. తీవ్రమైన ఎండలో గంటల తరబడి కూర్చున్నారు. వడదెబ్బకు గురై 13 మంది ప్రాణాలు కోల్పోయారు. 600 మందికిపైగా జనం అస్వస్థతకు గురయ్యారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నవీ ముంబైకి చేరుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

సూడాన్ ఘర్షణల్లో భారతీయుడు మృతి

న్యూఢిల్లీ: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య తలెత్తిన ఘర్షణల్లో 61 మందికి పైగా చనిపోయారు. మృతుల్లో ఆల్బర్ట్ ఆగస్టీన్ అనే భారతీయుడు ఉన్నారు. సూడాన్‌లో 2021 అక్టోబర్‌లో సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అప్పటి నుంచి అత్యున్నత మండలి అధికారం చెలాయిస్తోంది. అయితే, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ప్రభుత్వానికి అధికారం అప్పగించే విషయంలో ఆర్మీ, పారామిలటరీ బలగాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఖార్టూమ్‌లోని అధ్యక్ష భవనాన్ని, విమానాశ్రయాన్ని, ఇతర కీలక ప్రాంతాలు తమ ఆధీనంలోనే ఉన్నట్లు సైన్యం, పారా మిలటరీ బలగాలు ప్రకటించుకున్నాయి. శనివారం నుంచి రాజధానితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తలెత్తిన హింసాత్మక ఘటనల్లో 61 మంది పౌరులు చనిపోయారు. ఇరుపక్షాలకు చెందిన డజన్లకొద్దీ మరణించి ఉంటారని వైద్యుల సంఘం ఒకటి అంటోంది. మరో 670 మంది గాయపడినట్లు చెబుతోంది. దాల్ గ్రూప్ కంపెనీ ఉద్యోగి, భారతీయుడు ఆల్బర్ట్ ఆగస్టీన్ తుపాకీ కాల్పుల్లో చనిపోయినట్లు అక్కడి భారత రాయబార కార్యాలయం తెలిపింది.



కదం తొక్కిన కమ్యూనిస్టులు

కమ్యూనిస్టులు కదం తొక్కారు. బీజేపీ పాలనకు వ్యతిరేకంగా పల్లెపల్లెకు సీపీఐ .. ప్రజలవద్దకు సీపీఐ కార్యక్రమం చేపట్టారు. 10లో▶



వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారిని సుమారు 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించారు.

గరిష్టం/కనిష్టం
40.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగలు ఎండ వేడి పెరిగే అవకాశముంది

నీతి నిజాయితీగా సంపాదించేదే ఉత్తమ సంపద

– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6:36	మంగళ 4:30

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఆత్మీయ సమ్మేళనాలతో గ్రామ సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మానకొండూర్: ఆత్మీయ సమ్మేళనాలతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకు అనువుగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గంగిపల్లిలో ఆదివారం యాదవ, గౌడ సంఘాలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుడా చైర్మన్ జీవీ.రామక్రిష్ణారావుతో కలిసి ప్రారంభించారు. మున్నూరుకాపు, రెడ్డి సంఘ కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో గొప్ప పథకాలు తీసుకువచ్చామని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఓ కాలేజీ తెచ్చాడా, రైల్వే లైను తీసుకొచ్చాడా అని మండిపడ్డారు. దళిత బంధులో గంగిపల్లిని భాగస్వామ్యం చేస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ మాశం షాలిని, ఎంపీటీసీలు రంగు భాస్కర్, చలిగంటి సంపత్, ఉప సర్పంచ్ తాళ్లపల్లి సంపత్‌గౌడ్, కార్పొరేటర్ వాల రమణారావు, రెడ్డిసంఘం అధ్యక్షుడు డాక్టర్ పారిపెల్లి శ్రీకాంత్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు వాల అంజిత్‌రావు, పంజాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వాల ప్రదీప్‌రావు పాల్గొన్నారు.

'అధికార మత్తు దించుతాం'



మాట్లాడుతున్న కవ్వంపల్లి దంపతులు

గన్నేరువరం(మానకొండూర్): ఏ అధికార బలంతో కుట్రలు చేస్తున్నావో, ఆ అధికార మత్తును ప్రజల సహకారంతో త్వరలో దించుతామని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కవ్వంపల్లి అనూరాధ హెచ్చరించారు. గన్నేరువరంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో దోపిడీ సంస్కృతిని అమలు చేస్తూ, పాలనను ప్రశ్నించిన వ్యక్తులపై కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. గుండారంలోని నీ ఫాంహౌస్ బాగోతం బట్టబయలు చేసే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఎలక్షన్ అఫిడవిట్‌లో ఎరువుల బాలకిషన్, అభివృద్ధి శిలాఫలాకాలపై రసమయి బాలకిషన్ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. కవ్వంపల్లి అనూరాధ అంటే ఎమ్మెల్యే, వారి అనుచరులకు భయమెందని ప్రశ్నించారు. మానకొండూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్ పార్టీచేతిలో రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ఇటీవల బహిరంగ సభలో పొరపాటున మాట్లాడిన పదాలను వెనక్కి తీసుకుంటున్నానని, తనపై అనుచిత వాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై కేసు పెట్టనున్నట్లు అనూరాధ తెలిపారు. మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, అనిల్, రవీందర్, విజేందర్, మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, నర్సయ్య, కనుకయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్షలు



ఘన్ముకులలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

కరీంనగర్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష జిల్లావ్యాప్తంగా 14 సెంటర్లలో ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతి ప్రవేశాలకు 2,450మంది దరఖాస్తు చేసుకోగా 400 మంది గైర్హాజరయ్యారు. 2,050 మంది పరీక్ష రాశారు. 7వ తరగతి ప్రవేశాలకు 547 మందికి 446 మంది హాజరుకాగా 101 మంది గైర్హాజరయ్యారు. 8వ తరగతి కోసం 536మందికి 454మంది పరీక్షరాశారు. 82మంది గైర్హాజరయ్యారు. 9వ తరగతిలో 299 మందికి గాను 245మంది హాజరు కాగా 54మంది గైర్హాజరయ్యారు. 10వ తరగతిలో 89మందికి 20మంది గైర్హాజరు కాగా 69మంది పరీక్ష రాశారు.

నేరస్తులపై 'పీడీ' అస్త్రం

'కరీంనగర్ కమిషనరేట్‌తోపాటు రాచకొండ కమిషనరేట్, కామారెడ్డి జిల్లాల పరిధిలో 30కి పైగా దొంగతనాలు చేసిన ఠాకూర్ జగన్‌సింగ్‌పై కరీంనగర్ రూరల్ పోలీసులు పీడీ యాక్టు అమలు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు.'

'కరీంనగర్ త్రీటౌన్ పరిధిలో ముగ్గురు నిందితులు హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని చూశారు. విచారణ ప్రారంభించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ తుల శ్రీనివాసరావు, త్రీటౌన్ సీఐ దామోదర్‌రెడ్డి బృందం లోతుగా విచారించి హత్య కేసును ఛేదించారు. నిందితులను జైలుకు పంపించగా వారిపై పీడీయాక్టు అమలు చేశారు.'

- కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 147 పీడీ యాక్టులు
- నేరస్తుల గుండెల్లో గుబులు
- 2017లో ప్రారంభమైన పీడీ సెల్
- నిందితులను వెంటాడుతున్న యాక్ట్
- రాష్ట్ర వ్యాప్తంగా అమలులో కరీంనగర్‌ది రెండో స్థానం
- శిక్షలు పడడంలో మొదటి స్థానం



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీసులు నేరస్తుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. భూములు కబ్జా చేసినా.. కయ్యానికి కాలు దువ్వినా.. సెటిల్మెంట్లు చేసినా.. చోరీలకు పాల్పడినా.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా.. వారిపై పీడీ అస్త్రం ప్రయోగిస్తున్నారు. పీడీ యాక్టులు నమోదు చేయడంతోపాటు కోర్టుల్లో వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు.

సర్కిళ్ల వారీగా..

సర్కిల్ పేరు	పీడీయాక్టులు
కరీంనగర్ వన్‌టౌన్	17
కరీంనగర్ టూటౌన్	34
కరీంనగర్ త్రీటౌన్	06
కరీంనగర్‌రూరల్	16
మానకొండూర్	05
తిమ్మాపూర్	26
చొప్పదండి	17
హుజూరాబాద్‌టౌన్	14
హుజూరాబాద్‌రూరల్	02
జమ్మికుంట టౌన్	08
జమ్మికుంట రూరల్	02

147 మందిపై పీడీయాక్ట్

కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న 12 సర్కిళ్ల పరిధిలో 2017 నుంచి ఇప్పటివరకు 147 మందిపై పీడీయాక్టు అమలు చేశారు. కమిషనరేట్‌లో 2017 జనవరి 17న పీడీ సెల్‌ను ప్రారంభించగా 18 తేదీన మొదటి పీడీయాక్టు అమలు చేశారు. రౌడీషీటర్లు, దృష్టి మళ్లించి దొంగతనాలు చేయడం, తుపాకులతో బెదిరించడం, ఫైనాన్స్, ఉద్యోగ మోసాలు, గుట్కా, మట్కా, గంజాయి, జూదం, వ్యభిచారం, కల్తీ వ్యాపారాలు తదితర నేరాలు చేసే వారిపై పీడీయాక్టు అమలు చేస్తున్నారు. నేరాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై పోలీసులు దృష్టిసారిస్తున్నారు. భూ కబ్జాల విషయంలో ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిసింది. కరీంనగర్‌లోని ప్రజాప్రతినిధులు కబ్జాలు, భూదందాలు, సెటిల్మెంట్లు చేస్తున్నట్లు పోలీసులు సమాచారం సేకరించినట్లు తెలిసింది.

పీడీయాక్టు అమలులో రెండోస్థానం

కరీంనగర్ కమిషనరేట్ పీడీ యాక్టు కేసులు నమోదు చేయడంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉంది. శిక్షలు పడడంలో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంది. ఇప్పటి వరకు నమోదు చేసిన పీడీ యాక్టు కేసుల్లో 70 శాతం వరకు శిక్షలు పడ్డాయి.



30 చోరీలు చేసిన ఠాకూర్ జగన్ సింగ్‌పై పీడీయాక్టు అమలు చేసిన పోలీసులు

కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా పీడీయాక్టు కేసులు

సంవత్సరం	పీడీ యాక్టులు
2017	30
2018	26
2019	27
2020	04
2021	18
2022	31
2023	11

కరుడుగట్టిన నేరస్తులపై పీడీయాక్టు



కమిషనరేట్ వ్యాప్తంగా నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు అమలు చేస్తున్నాం. ఇప్పటివరకు 147 మందిపై అమలు చేశాం. భూ కబ్జాలు చేసి అమాయక ప్రజలను ఇబ్బందులు పెడితే పీడీ యాక్టులు తప్పవు.

– ఎల్.సుబ్బారాయుడు, కరీంనగర్ సీపీ

తెలంగాణకు సెప్టెంబర్ 17న స్వాతంత్య్రం వచ్చింది

- రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కరీంనగర్‌టౌన్: భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం లభిస్తే, నిజాం ఆధీనంలో ఉన్న తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న నిజమైన స్వాతంత్య్రం లభించిందని, ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సిద్ధించిన తెలంగాణ స్వాతంత్ర దినోత్సవాన్ని విమోచన దినోత్సవంగా జరుపుకుంటున్నామని రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. నైజాం విముక్త స్వతంత్ర అమృతోత్సవాల సమితి ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్ హాల్‌లో ప్రతిష్ఠత వ్యక్తుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..నిజాం, రజాకర్ల అరాచక వ్యవహార శైలి శృతిమించడంతో తెలంగాణ సాయుధ పోరాట యోధులు, వారికి స్ఫూర్తినిచ్చే కవులు, రచయితల మూలంగా 1948లో పోరాటం ఉధృతం దాల్చి భారత యూనియన్‌లో విలీనం చేసే వరకు కొనసాగిందని తెలిపారు.నైజాం విముక్త అమృత ఉత్సవాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వంశీ తిలక్, రాష్ట్ర కార్యదర్శి సీపీ నిరంజన్ చారి,డాక్టర్ భాగ్యరెడ్డి, మధుసూదన్ రావు, హనుమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, సురేశ్ పాల్గొన్నారు.

దళితరత్న బిరుదు ప్రదానం



మెమొంటో అందుకుంటున్న రాజమౌళి

చిగురుమామిడి(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు బోలుమల్ల రాజమౌళికి దళితరత్న బిరుదును రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం కరీంనగర్‌లో అందజేశారు. ఆయన ఆటపాటలు, కోలాటం, వీధినాటకం, గొల్లసుద్దులు, చిత్రలేఖనంతో తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారు.

సీఎం కేసీఆర్‌కు బాసటగా నిలుద్దాం

- బీజేపీ, కాంగ్రెస్ ఢిల్లీ పార్టీలు
- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: తెలంగాణ ప్రజలను కాపాడే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని, సీఎం కేసీఆర్‌కు బాసటగా నిలుద్దామని బీసీ సంక్షేమ పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ మీసేవ కార్యాలయంలో కొత్తపల్లి మండలం నాగులమల్యాల, కమాన్‌పూర్, మల్కాపూర్ గ్రామాలకు చెందిన సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, పలువురు వార్డు మెంబర్లతో పాటు 200మంది మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి కమలాకర్ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ ఢిల్లీ పార్టీలన్నారు. బీఆర్‌ఎస్ మన ఇంటిపార్టీ అన్నారు. మండల అధ్యక్షుడు కాసారం శ్రీనివాస్, ఎంపీపీ పిల్లి శ్రీలత, జెడ్పీటీసీ పిట్టల కరుణ, నాగుల మల్యాల ఎంపీటీసీ కొమ్ము హేమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, కమాన్‌పూర్ సర్పంచ్ జింక సంపత్, మల్కాపూర్ సర్పంచ్ గుట్టజ్యోతి, గంగాధర లక్ష్మయ్య ,మాతంగి రవి, గంగాధర చందు ఉన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులతో మంత్రి గంగుల

కర్మకాండ నిలయానికి రూ.50 లక్షల నిధులు

ఆర్యవైశ్యుల కర్మకాండ నిలయానికి ప్రభుత్వ భూమితో పాటు ఎస్‌డీఎఫ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.50లక్షలు మంజూరు చేయడం జరిగిందని మంత్రి కమలాకర్ తెలిపారు. ఆదివారం కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ శివారులో రూ.50 లక్షల నిధులతో నిర్మించే వైశ్య కర్మకాండ భవనానికి మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి భూమి పూజ చేశారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, వైశ్య సంఘం నాయకులు పవన్ కుమార్, శ్రీనివాస్, కన్నక్రిష్ణ, చంద్రం, మనోహర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల మనోవికాసానికి కళలు దోహదం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, తదితరులు

- కలెక్టర్ ఆర్వీ.కర్ణన్

కరీంనగర్: విద్యార్థుల మనోవికాసానికి కళలు దోహదపడతాయని, విద్య అంటే కేవలం పుస్తక జ్ఞానమే కాదు విద్యార్థి సర్వాంగీణ వికాసం జరిగినప్పుడే విద్యా లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన స్వరమాధురి సమాపనోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల మనోవికాసానికి కళలు దోహదపడతాయని వివరించారు. విద్య అంటే కేవలం పుస్తక జ్ఞానమే కాదు విద్యార్థి సర్వాంగీణ వికాసం జరిగినప్పుడే విద్యా లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. పుస్తకం, సంగీతం, క్రీడలు భవిష్యత్తులో ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్వరమాధురి అనేపేరుతో అంతర్జాల వేదికగా ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కేబీశర్మ సంగీత పాఠాలు నేర్పించడం గొప్ప విషయమని అభినందించారు. అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంగీతంలో శిక్షణ ఇవ్వడం దీనికి తెలంగాణలోనే ప్రప్రథమంగా కరీంనగర్ వేదిక కావడం శుభ పరిణామం అన్నారు. కేవలం 15వారాల్లోనే 35మంది విద్యార్థులు దేశభక్తి, దైవభక్తి గీతాలను ఆలపించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఆన్‌లైన్‌లో నేర్చుకోవడానికి జూమ్ వేదికను అందించి నిరాఘాటంగా కార్యక్రమం కొనసాగడానికి సహకరించిన ఉపాధ్యాయుడు జంగ మనోహర్ రెడ్డిని అభినందించారు. సంగీతం నేర్పిన కేబీ.శర్మ, జంగ మనోహర్ రెడ్డిని సన్మానించారు. విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. అవధాని, సాహితీ గౌతమి అధ్యక్షుడు డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి మారం స్వదేశీకుమార్, డీఎవో సీహెచ్ జనార్దన్ రావు, సెక్టోరల్ అధికారి కె.అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్‌రెడ్డి, గాజుల రవీందర్, జంగా మనోహర్‌రెడ్డి, నంది శ్రీనివాస్, కేఎస్.అనంతాచార్య, డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

సారూ.. పరిహారమేదీ?



లక్ష్మీపూర్‌లో దెబ్బతిన్న మస్క్‌మిలాన్(ఫైల్)

- రామడుగు మండల రైతులకు ఇంకా అందని పంటనష్ట పరిహారం
- పంటనష్టపోయి.. సీఎం కేసీఆర్ పర్యటించి నెలరోజులు కావస్తున్నా..
- కనికరించని అధికారులు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మండల రైతులు

రామడుగు(చొప్పదండి): 'వడగండ్ల వాన మమ్మల్ని నిండా ముంచింది. చేతికి అందవచ్చిన పంట, పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయింది. మేము నిండా మునిగామని తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సారూ వచ్చి పంటలు పరిశీలించారు. మాతో మాట్లాడారు. ఆలస్యం చేయకుండా నష్టపరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని చెప్పారు. వారంరోజుల్లో సర్వేచేసి ఎకరాకు రూ.10వేల పరిహారం చెల్లించాలని సంబంధిత సార్లను ఆదేశించారు. పంటనష్టపోయి.. సీఎం సారు వచ్చిపోయి నెలరోజులు కావొస్తున్నా.. పట్టించుకున్న సారూ లేడు.. పంటనష్ట పరిహారమూ అందలేదు' అంటూ రామడుగు మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటనష్ట పరిహారం ఏది సారూ అంటూ పక్షం రోజులుగా కనిపించిన అధికారినల్లా ఆరా తీస్తున్నారు.



ఫొటో ప్రదర్శన ద్వారా పంటనష్ట వివరాలు తెలుసుకుంటున్న సీఎం కేసీఆర్(ఫైల్)

రామడుగు మండలంలో..

- రామడుగు మండలంలోని 23గ్రామాల్లో యాసంగిలో 6,158 ఎకరాల్లో వరి, 330 ఎకరాల్లో మొక్కజొన్న, 11 ఎకరాల్లో వేరుశెనగ, మిగితా ప్రాంతాల్లో మస్క్‌మిలాన్, కర్బూజా, కూరగాయలు సాగుచేశారు.
- మార్చి 16నుంచి 20వ తేదీ వరకు మండలంలో కురిసిన భారీ వడగండ్ల వానతో రాంచంద్రాపూర్, లక్ష్మీపూర్, గుండి, దత్తోజీపల్లి గ్రామాల్లో భారీగా పంటలకు నష్టం ఏర్పడింది. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ద్యావ రాంచంద్రారెడ్డి వాణిజ్య పంటకు రూ.అరకోటికిపైగా నష్టం వాటిల్లింది. మిగితా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారు.

పరిహారం అందలేదు



మాది లక్ష్మీపూర్ గ్రామం. నాకు పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఐదు ఎకరాల్లో వరి వేశాను. మిగితా భూమిలో ఇతర పంటలు, కూరగాయలు వేశాను. ఇటీవల వానకు మొత్తం నష్టం వచ్చింది. అధికారులు వచ్చి వివరాలు తెలుసుకుని వెళ్లారు. 20రోజులు అవుతున్నా.. రూపాయి పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. – మధుకర్‌రెడ్డి, రైతు, లక్ష్మీపూర్

నివేదిక పంపాం



రామడుగు మండలంలో వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతుల పంటల వివరాలు సేకరించడం జరిగింది. 2017 మంది రైతులకు గానూ 1,510 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రభుత్వానికి నివేదిక అందించాం. ప్రభుత్వం ద్వారా పరిహారం రాగానే రైతులకు అందజేయడం జరుగుతుంది.

– సంజీవరెడ్డి, ఇన్‌చార్జి ఏవో, రామడుగు

- ఈ మేరకు పంటనష్ట పరిశీలనకు మార్చి 23న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో పర్యటించారు. రామగుడు మండలంలో పలు పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని చెప్పారు. ఈ మేరకు అధికారులు నివేదిక అందించాలని ఆదేశించారు.
- మండలంలో వడగండ్లవానతో 2,017మంది రైతులకు చెందిన 1,510ఎకరాల్లో పంటనష్టం ఏర్పడిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అయితే చాలామంది రైతుల వివరాలు నమోదు చేయలేదని, కొందరి నుంచే వివరాలు సేకరించారని పలువురు ఆరోపిస్తున్నారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేసీఆర్

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హుజూరాబాద్: తెలంగాణలో ప్రశ్నించే గొంతులను నొక్కుతూ ప్రజాస్వామ్యాన్ని సీఎం కేసీఆర్ అపహాస్యం చేస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నియోజకవర్గంలో పోలీసుల వేధింపులు, అక్రమ కేసులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. హుజూరాబాద్ ఉపఎన్నికల్లో తనకు ఓటు వేసిన వారందరిపై అక్రమకేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని అన్నారు. చెల్పూర్ సర్పంచ్ నేరేళ్ల మహేందర్ గౌడ్, వార్డు మెంబర్ మహ్మద్ ఇబ్రహీమ్‌పై కక్షపూరితంగా కేసులు పెట్టారన్నారు. థర్డ్‌డిగ్రీ ప్రయోగించి, శారీరకంగా హింసించిన హుజూరాబాద్ సీఐ బొల్లం రమేశ్‌పై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలన్నారు. పోలీసులు బీఆర్‌ఎస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దళితులకు రూ.10లక్షలు కేవలం హుజూరాబాద్‌లో మాత్రమే ఇచ్చారని, అవి కూడా అందరికీ ఇవ్వలేదన్నారు.జిల్లాలో అనేక మంది సర్పంచులు రాజీనామాలు ఇచ్చారని, అప్పుల బాధలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మాజీఎమ్మెల్యేలు ధర్మారావు, బొడిగె శోభ, బీజేపీ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రావు పద్మ, ప్రదీప్‌రావు, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ



మానకొండూరు: ఓ గ్రానైట్ లారీ మానకొండూర్ శివారులో అదుపుతప్పి, పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. జమ్మికుంట వైపు నుంచి ఆదివారం ఓ లారీ గ్రానైట్ రాళ్లను తరలిస్తోంది. మార్గమధ్యలో మానకొండూరు శివారులోకి రాగానే అదుపుతప్పి, పొలాల్లోకి దూసుకెళ్లింది. గ్రానైట్ రాళ్లు పొలంలో పడిపోయాయి.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

చొప్పదండి: అసైన్డ్, అభ్యంతరం లేని ఇతర ప్రభుత్వ స్థలాలు, అర్బన్ సీలింగ్ భూములను క్రమబద్ధీకరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తహసీల్దార్ అంబటి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. 125 చదరపు గజాల లోపు స్థలం ఉన్న పేదలకు ఉచితంగా, అంతకన్నా ఎక్కువ ఉంటే మార్కెట్ ధరకు ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందని పేర్కొన్నారు. 2020 జూన్ 2వ తేదీలోగా నివాసం ఉన్న వారికి వర్తిస్తుందని తెలిపారు. అర్హులైనవారు ఈ నెల 30లోగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నివాసం ఉన్నట్లు ఆధారాలు చూపాలని, ఇంటి పన్ను, ఇంటి నంబరు రసీదు, నల్లా పన్ను, విద్యుత్ బిల్లు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్‌లను దరఖాస్తుతో జత చేయాలని సూచించారు.

మహిళా సంఘం సభ్యురాలి ఆత్మహత్యాయత్నం

శంకరపట్నం(మానకొండూర్): గద్దపాక గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు జంగ లక్ష్మి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గద్దపాకలో మహిళల పొదుపు సంఘంలో సభ్యురాలైన లక్ష్మిని సంఘం నుంచి తొలగించారు. బకాయి డబ్బులు చెల్లించాలని అధ్యక్షురాలు శ్వేత, మరో పదిమంది సభ్యులు శనివారం సాయంత్రం ఒత్తిడి చేశారు. బకాయి డబ్బుల కోసం వేధింపులకు గురిచేయడం వల్లే లక్ష్మి మనస్తాపానికి గురై, క్రిమిసంహారక మందు తాగిందని బాధితురాలి భర్త జైపాల్ ఆదివారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. లక్ష్మి ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

యువతి బలవన్మరణం

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్‌కు చెందిన గన్ను అనన్య (18) హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన గన్ను అనన్య తండ్రి ధర్మరాజు నాలుగేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోగా తల్లి జమున మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకొని హైదరాబాద్‌లో ఉంటోంది. శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా అనన్యది ఆత్మహత్య కాదని, తండ్రి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులో దూకి వృద్ధురాలు..

మానసికస్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని లడ్డుఖాజా హోటల్ ప్రాంతానికి చెందిన గుండ జయలక్ష్మి (70) వయోభారంతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లి చింతకుంట చెరువులో దూకింది. విషయం తెలుసుకున్న పట్టణ ఏఎస్సై వేణురావు గజ ఈతగాళ్లతో జయలక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమారులు శ్రీనివాస్, రమేశ్, సంతోష్, కుమార్తె భూలక్ష్మి ఉన్నారు.

మే నెల చివరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు

- పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పంపిణీ
- పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న విద్యాశాఖ
- జిల్లాకు ఇప్పటివరకు వచ్చిన పుస్తకాలు 1,05,420
- రావాల్సినవి 4,10,000



కొత్తపల్లి గోదాంకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

కరీంనగర్: వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా స్కూళ్ల ప్రారంభం రోజునే పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటోంది. గతంలో సర్కారు బడుల్లో చదివే పిల్లలకు సకాలంలో పుస్తకాలు అందేవి కావు. ఇది విద్యాబోధనపై తీవ్ర ప్రభావం చూపేది. విడతల వారీగా బుక్స్ ఇవ్వడంతో ఇద్దరు, ముగ్గురు కలిసి చదువుకునేవారు. ఈ సమస్యను అధిగమించడానికి 2023–24 విద్యాసంవత్సరంలో ముందుగానే పుస్తకాలు పంపిణీ చేయాలని సర్కారు నిర్ణయించింది.

జిల్లాలో 1,43,999 మంది విద్యార్థులు

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు (కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్, అన్ ఎయిడెడ్, అర్బన్, అర్బన్ రెసిడెన్షియల్) 1017 ఉండగా వాటిల్లో 1,43,999 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పిల్లల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా కేంద్రాలకు కార్గో బస్సుల ద్వారా పుస్తకాలు సరఫరా చేస్తున్నారు. జిల్లాకు అధికారుల లెక్కల ప్రకారం 4,10,000 బుక్స్ అవసరం ఉండగా ఇప్పటివరకు 1,05,420 వచ్చాయి. వాటిని కొత్తపల్లి మండల కేంద్రంలోని గోదాంలో భద్రపరిచారు.

ముందే మేల్కొన్న యంత్రాంగం..

2022–23 విద్యాసంవత్సరంలో అన్ని ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. పుస్తకాల ముద్రణ ఆలస్యమవడంతో జిల్లాలకు సకాలంలో చేరలేదు. ఫలితంగా విద్యార్థులకు అగచాట్లు తప్పలేదు. దీనికితోడు 2020 నుంచి కోవిడ్ ప్రభావంతో పూర్తిస్థాయిలో పుస్తకాలు ఇవ్వలేదు. గతేడాది నవంబరు వరకు సరఫరా చేస్తూనే ఉన్నారు. ఈసారి అధికార యంత్రాంగం ముందుగానే మేల్కొని, విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పక్కదారి పట్టకుండా..

ప్రభుత్వ పాఠశాలల్లో సరఫరా చేసే పుస్తకాలు పక్కదారి పట్టకుండా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. కిందిస్థాయి సిబ్బంది బహిరంగ మార్కెట్‌కు తరలించి, విక్రయించి సొమ్ము చేసుకోకుండా ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రతీ పుస్తకానికి వరుస సంఖ్య, క్యూఆర్ కోడ్ వేసింది.

ఆర్టీసీ కార్గోలో రవాణా..

పాఠ్యపుస్తకాలను తరలించేందుకు విద్యాశాఖ ఆర్టీసీ కార్గో సర్వీసును వినియోగిస్తోంది. అలాగే జిల్లాకు పూర్తిస్థాయిలో పుస్తకాలు అందిన అనంతరం స్టాక్ పాయింట్ నుంచి మండల కేంద్రాలకు తరలించేందుకు కూడా కార్గో సర్వీసునే ఉపయోగించుకుంటున్నారు. తద్వారా విద్యాశాఖకు రవాణా చార్జీలు చాలా వరకు కలిసి రావడం, మరోవైపు ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పుస్తకాల విషయంలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. తరగతులు ప్రారంభించిన రోజునే అందిస్తాం. మే నెల చివరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు రప్పిస్తాం. ఒకటి నుంచి పదోతరగతి వరకు ప్రతీ విద్యార్థికి ఉచితంగా పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్ ఇస్తాం.

– జనార్దన్‌రావు, డీఈవో

ఇక్కడే ఖరీదైన శస్త్రచికిత్స

- రూ.లక్షల విలువైన తుంటి, మోకీలు మార్పిడి ఆపరేషన్లు
- పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకంలోనే..
- కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేస్తున్న ఆర్థోపెడిక్ సర్జన్లు



మోకీలు మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నవారితో వైద్యులు

కరీంనగర్‌టౌన్: ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమైన మోకీలు మార్పిడి శస్త్రచికిత్స కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చింది. ఏడాదిగా దవాఖానాలో వైద్యులు అరుదైన మోకీలు మార్పిడి, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స చేస్తున్నారు. గతంలో ఇక్కడ అన్ని విభాగాల్లో కలిపి నెలకు 30 నుంచి 40 ఆపరేషన్లు కూడా జరగని పరిస్థితి. ఇప్పుడు రోజుకు పదుల సంఖ్యలో ఆపరేషన్లు జరుగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేటకు చెందిన గుజ్జుల సుమతి మోకీలు అరిగిపోయిందని, ఐదేళ్లుగా బాధపడుతోంది. ఎన్నో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లినా నయం కాలేదు. చివరగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగానే వైద్యులు పరీక్షించి, గత మంగళవారం కీలు మార్పిడి చేశారు. జమ్మికుంట మండలంలోని మోట్లగూడెం గ్రామానికి చెందిన పొనగంటి రాజలింగం మోకాళ్ల నొప్పులతో బాధ పడుతూ దవాఖానాకు వచ్చాడు. నడవడానికి కూడా ఇబ్బందిగా ఉండటంతో వైద్యులు ఎక్స్‌రే తీయించారు. మోకీలు అరిగిందని గుర్తించి, గత బుధవారం కీలు మార్పిడి శస్త్రచికిత్స చేశారు. పేషెంట్లు ఇద్దరూ పూర్తిగా కోలుకున్నారు. పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయడంతో వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మెరుగైన సౌకర్యాలు..

కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ల ఆధునీకరణతో అరుదైన శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఒకప్పుడు చిన్నచిన్న ఆపరేషన్లు మాత్రమే జరిగేవి. మెరుగైన మౌలిక సదుపాయాల కారణంగా ఖరీదైన ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. తుంటి, మోకీలు మార్పిడితోపాటు అన్ని రకాల శస్త్ర ఆపరేషన్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆర్థోపెడిక్ సర్జన్లు నారగోని కుమార్, ధన్‌రాజ్, ఆదిత్య, అనస్తీషియా డాక్టర్ చంద్రశేఖర్ ఆసుపత్రిలో తమ సేవలు అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ ఆసుపత్రిలో తుంటి, మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ఇప్పటికే 10 ఆపరేషన్లు చేశాం. త్వరలో నీ–రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు కూడా చేస్తాం. గతంలో ఇలాంటి కేసులకు వరంగల్, హైదరాబాద్‌లలోనే శస్త్రచికిత్సలు జరిగేవి. ఇప్పుడు కరీంనగర్ ఆసుపత్రిలో చేసేందుకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ నారగోని కుమార్, ఆర్థోపెడిక్ సర్జన్

రాగంపేట ఆర్యవైశ్య సొసైటీ వార్షికోత్సవం



నియో హెల్పింగ్ సంస్థకు కంప్యూటర్ అందిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ కల్చరల్: రాగంపేట ఆర్యవైశ్య సొసైటీ 11వ వార్షికోత్సవం ఆదివారం గాంధీరోడ్డులోని వైశ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ అనాథ, వృద్ధాశ్రమాలకు కావాల్సిన వస్తువులను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ అందజేశారు. పిల్లల ఆలనాపాలన చూస్తున్న నియో హెల్పింగ్ సంస్థకు కంప్యూటర్, వీరబ్రహ్మేంద్ర స్వామి అనాథాశ్రమానికి నాలుగు సీలింగ్ ఫ్యాన్లు, కార్ఖానా గడ్డలోని ప్రభుత్వ వద్ధుల, దివ్యాంగుల ఆశ్రమానికి మూడు కూలర్లు, రేకుర్తిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలకు రెండు పుస్తకాల ర్యాకులు, స్వధార్ బాధిత స్త్రీల పునరావాస కేంద్రానికి ఒక ఫ్రిడ్జ్, బెల్లంపల్లిలోని వనవాసి కల్యాణ పరిషత్‌కు ఆఫీస్ టేబుల్, ఆరు కుర్చీలు, రాగంపేట గ్రామంలోని నిరుపేద వృద్ధులు దాదాపు 200 మందికి చద్దర్లు, రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దాదాపు 150 మంది విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షుడు నాగభూషణం, కోశాధికారి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘భట్టి’ పాదయాత్రకు ఘన స్వాగతం



మంచిర్యాల నుంచి పాదయాత్రగా వస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



నీటి సమస్యను వివరిస్తున్న కస్తూరిబా విద్యార్థినులు

- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- జైకాంగ్రెస్ నినాదాలతో మార్మోగిన ఎల్లంపల్లి

రామగుండం: శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చేరుకుంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చి భట్టికి ఘన స్వాగతం పలికారు. ఆయన అడుగులో అడుగేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వంతెన పార్టీ శ్రేణులతో జనసంద్రంగా మారింది. ఎల్లంపల్లికి చెందిన గంగపుత్రులు చేపలవలను సీఎల్పీ నేతకు బహూకరించి.. సొసైటీల్లో సభ్యత్వాల సమస్య ఉందని ఏకరువు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గంగపుత్రుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మార్గంమధ్యలో ఉన్న కస్తూర్బా విద్యాలయానికి చేరుకోగానే 9వ తరగతి విద్యార్థిని శరణ్య ‘సార్ మాకు తాగునీటి సమస్య ఉంది..’ అని తెలపగా సమస్యను నమోదు చేసుకున్నారు. అనంతరం ముర్మూర్ గ్రామ శివారులోని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గదిలో బస చేసేందుకు వెళ్లారు. సీఎల్పీ వెంట కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక ప్రతినిధులు, పార్టీ శ్రేణులు వేలాదిగా ఉన్నారు.

కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరందించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



వినతి పత్రం అందిస్తున్న సత్తయ్య, నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పర్సనల్ అధికారి నరేష్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ కోసం రూ.20 కోట్లు కేటాయించినప్పటికీ ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. సింగరేణి యాజమాన్యం, తప్పుడు నివేదికలతో కలుషిత నీరు తాగొచ్చని చెబుతున్నారన్నారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సింగరేణి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామగుండం, బెల్లంపల్లి రీజియన్ కార్మికులకు రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ ద్వారా తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి తాగునీరందించేందుకు ఒప్పందం చేసుకున్నారన్నారు. సింగరేణి కార్మికులకు మిషన్ భగీరథ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఇతర ప్రాంతాలకు తాగునీరందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, మాదాసు రవీందర్, పల్లె శ్రీనివాస్, పోరండ్ల వెంకటేశం, ఎల్లావుల కోటయ్య, పెంచాల వెంకటస్వామి, సంగాని సాంబయ్య, పోతరాజు భాస్కర్, నీలం శ్రీనివాస్, ఆరేపల్లి వెంకటరాజం, బిమునిపెల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికవాడలకు సురక్షిత నీరందించాలి

- సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదేశం



ఫిల్టర్ బెడ్ వద్ద పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికవాడలకు సురక్షితమైన మంచినీరందించాలని డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదేశాలు జారీచేశారు. ఆదివారం ఆర్జీ–1 ఏరియాలోని ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. జీఎం చింతల శ్రీనివాస్‌తో కలిసి గంగానగర్ వద్దనున్న 1 మిలియన్ గ్యాలన్ల సామర్థ్యం గల ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేశారు. ఫిల్టర్ బెడ్‌లోని ఇసుకను వెంటనే మార్చాలన్నారు. ఫిల్టర్ బెడ్‌లను పూర్తిస్థాయిలో శుభ్రంచేసి కాలనీలకు సురక్షిత నీరుసరఫరా చేసేలా చూడాలన్నారు. కార్మిక వాడలకు సురక్షిత నీరందించే విషయంపై శాశ్వత ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఇటీవల నిధులు మంజూరైన రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ల నిర్మాణానికి స్థలాన్ని డైరెక్టర్ పరిశీలించారు. అనంతరం జీడీకే–5 ఓసీపీ సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత తీరును వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించారు. డైరెక్టర్ వెంట జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, డీవైఎస్ఈ వసంత్‌కుమార్, సివిల్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రావు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన దేశం ఆవిష్కరణలకు దిక్సూచి



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): మన దేశం సాంకేతిక విప్లవాలకు నిలయమని, పలు ఆవిష్కరణలకు దిక్సూచి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అల్ఫోర్స్ పాఠశాలలకు చెందిన యువ శాస్త్రవేత్తలకు ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మన దేశం సాంకేతిక రంగంలో ఇతర దేశాలకంటే అగ్రగామిగా కొనసాగుతుండటం శుభపరిణామమని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో సుమారు 11 మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో తమ ప్రతిభ చాటి, జాతీయ స్థాయిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, శాస్త్రవేత్తల నుంచి ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులు ఎం.పూజశ్రీ 9వ తరగతి, కె.దేవ్ ఆశిశ్ 9వ తరగతి, వి.సంజీత రెడ్డి 10వ తరగతి, జి.లాస్యశ్రీ 9వ తరగతి, ఎం.సాయి వినీల్ 9వ తరగతి, డి.విష్ణుచరణ్ 9వ తరగతి, షర్మిల 9వ తరగతి, శీజా రీఫాత్ 8వ తరగతి, డి.శ్రీహష్ 9వ తరగతి, సజీనిన్ 8వ తరగతి, రొమైసా ఫాతిమా 8వ తరగతి, ఎం.సాయిరేవంత్ 9వ తరగతి, ఎం.అగస్త్య అభినవ్ 9వ తరగతి, శ్రీజా రెడ్డి 9వ తరగతిలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో వివిధ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైసమ్మ కుంట తూము కబ్జాకు యత్నం

- రైతులు అడ్డుకోవడంతో నిలిచిన ప్రహరీ నిర్మాణ పనులు



తూము మూసి, ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

కరీంనగర్‌రూరల్: భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. తమ కంటపడ్డ ఏ స్థలాన్నీ వదలకుండా కబ్జా చేయాలని చూస్తున్నారు. పంట పొలాలకు సాగు నీరు సరఫరా చేసే కుంట తూమును కూడా వదలలేదు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దుంపూర్‌లో రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న మైసమ్మ కుంట తూము కబ్జా కోరల్లో చిక్కుకుంది. కుంట కట్టకు రాజీవ్ రహదారికి మధ్యనున్న 432 సర్వే నంబర్‌లోని పొలాలను గతంలో రైతుల వద్ద నుంచి పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. తర్వాత నాలా కన్వర్షన్ ద్వారా ప్లాట్లుగా మార్చారు. అయితే కుంట తూమును ఓ వ్యాపారి మూసివేసి, కాలువను పూడ్చి, చుట్టూ ప్రహరీ నిర్మాణం చేర్మిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రైతులు శనివారం సాయంత్రం అక్కడికి చేరుకొని, పనులను అడ్డుకున్నారు. కుంట తూమును కబ్జా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుంట కింద సుమారు వంద ఎకరాల పంట పొలాలకు సాగు నీరందుతుందని తెలిపారు. తూమును మూసివేస్తే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. నాలా కన్వర్షన్ చేసే సమయంలో రెవెన్యూ అధికారులు కుంటలు, తూములను పరిశీలించాలని, కబ్జాలకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తూమునే కాకుండా కుంట కట్ట చివరన ఉన్న రైతులందరికీ సంబంధించిన గుంటన్నర భూమిని కూడా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి, న్యాయం చేయాలని కోరారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

- మృతుడు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి



రాజయ్య (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): కడుపునొప్పి భరించలేక ఓ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి రైలు కింద పడి, ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీ వాడకు చెందిన నరాల రాజయ్య(70) సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. ఆయన ఏడాదిగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. 15 రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తిగా కోలుకున్నాక ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఆదివారం జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ప్రమీల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన చిటికెన రాజయ్య(67) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజయ్య ఈ నెల 6న రోడ్డు దాడుతుండగా వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. కుటుంబసభ్యులు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ రాజయ్య ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కారును అజాగ్రత్తగా నడిపి, ప్రమాదానికి కారణమైన సాహిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిన్నారులకు చేయూత



చెత్త కుప్పల్లో ఆహారం కోసం వెతుకుతున్న పిల్లల పరిస్థితిపై ఆకలి రుచెరగదు.. నిద్ర సుఖమెరగదు అంటూ' సాక్షి' దినపత్రికలో ఈ నెల 14న ప్రచురితమైన కథనానికి మా ఫర్ ద పీపుల్ సంస్థ స్పందించింది. సంస్థ ప్రెసిడెంట్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు, 100 కేజీల బియ్యాన్ని వారి తల్లిదండ్రులకు అందజేశారు. ఆయనతోపాటు కరీంనగర్ ఎన్‌జీవో పావని చిన్నారుల చదువుకు సంబంధించి సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. సంస్థ సభ్యులు చరణ్, గౌతమ్, సుశ్రుత్ లాల్, దినేశ్, వినయ్, రాజేశ్, సతీశ్, అభిలాశ్, బోర్డు మెంబర్లు సుధ, రవీందర్, నవ్య, భారత్ బాబు, అభినయ్, రమేశ్ తదితరులున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

ASTROLOGY

ఉచిత జ్యోతిష్యం శాశ్వత పరిహారం.3రోజుల్లో 100%పరిష్కారం.ఎటువంటి గుప్త సమస్యల కైనా పరిష్కారం చూపబడును. స్పెషలిస్ట్.సాయిరాం శాస్త్రి. ఫోన్ : 9949373448. [H-781464]

WANTED

Wanted Female TeleCallers for Leading a Banking Channel. Salary: 8K to 10K. Q: Any Degree. Direct Job. No Fee. Cont: 6305991862. [WA-5361]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/– సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 9573633520, 9059633520 [M-1190671]

Suitable B.Sc. Agriculture and B.Sc Horticulture graduates in Oil Plam plantation Project in Peddapally District. Salary as per the industry standards for deserving Candidates. Cont: 7893099906 [K-1219921]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని నుస్తులాపూర్ లో సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రంజాన్ ముస్లింలకు పవిత్ర మాసమని, నెల రోజుల ఉపవాస దీక్ష సహనం, ఆకలి బాధను తెలియజేస్తాయన్నారు. పండుగను ఐక్యంగా జరుపుకోవాలన్నారు. అనంతరం మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీకి రుమాల్ టోపీ, ఖజూర్ అందించారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, అబ్దుల్ సత్తార్, సయ్యద్ హుస్సేన్, బాబు పటేల్ జానీ, ఆజు, నిసార్, ఖాసిం, నేహాల్, సోహైల్, తాజుద్దీన్, అజ్జుం, సజ్జు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై విద్యార్థుల అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వరంగల్ వ్యవసాయ కళాశాల బీఎస్సీ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. ఈసందర్భంగా ఆదివారం విద్యార్థులు ఓటుహక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రహదారులు, ఇంటి పరిసరాల్లో వయ్యారిబామా మొక్కలు తొలగించి మొక్కల వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుష, కేవీకే శాస్త్రవేత్త మహేశ్, సర్పంచ్ రాజుకుమార్, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

వీణవంక: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని, సీఎం కేసీఆర్ కృషి ఎంతో ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రైతుబంధు, దళితబంధు పథకాలను ఇతర రాష్ట్రాల సీఎంలు అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జమ్మికుంట: జమ్మికుంట పట్టణానికి చెందిన తెలంగాణ యువత నాయకుడు ఇమ్మడి సతీష్ ఆదివారం సింగర్, పాటల రచయిత(అనితా.. ఓ అనితా..) నాగరాజుకు రూ. పదివేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ, పిల్లల అనారోగ్య సమస్యలతో నాగరాజు ఇబ్బందులకు గురవుతున్నాడని, హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి నగదు అందజేశామన్నారు. యువ కళాకారుడని ఆదుకోవాలని కోరారు.

దహన సంస్కారాలకు...

చొప్పదండి: పట్టణంలోని ఇందిరానగర్ ఐదో వార్డుకు చెందిన కల్లెపల్లి సుశీల అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్థికసాయం కోసం ఆదివారం రామక్రిష్ణ సేవా సమితిని సంప్రదించగా నిజానపురం శంకరయ్య దహన సంస్కారాలకు రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో చెట్ల రాంకిషన్, నిజానపురం చందు, తదితరులు పాల్గొన్నారు.

చిట్టి 'స్వరాలు'

- సంగీతంలో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- ఆన్‌లైన్‌లో చిన్నారులకు మ్యూజిక్ క్లాస్‌లు
- 15 వారాల్లో ఏకంగా ఆరు అల్బమ్‌లలో చిన్నారుల గాత్రం
- స్వరమాధురి కార్యక్రమం ద్వారా సంగీత పాఠాలు


సంగీత పాఠాలు నేర్చుకున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): స్టార్ సింగర్స్.. ఇండియన్ ఐడియల్.. సూపర్ సింగర్స్ లాంటి ఎన్నో కార్యక్రమాలను మనం చూస్తున్నాం.. అలాంటి కార్యక్రమాలతో ఎందరో చిన్నారులు వెలుగులోకి వచ్చి స్టార్ సింగర్లుగా తయారవుతున్నారు. మరి కొందరు సింగర్‌లే కాకుండా ఏకంగా అల్బమ్‌లను తయారు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అదే తరహాలో మట్టిలోని స్వర మాణిక్యాలను వెలికితీయాలనే ఉద్దేశ్యంతో జిల్లా విద్యాశాఖ సహకారంతో ప్రముఖ సంగీత విద్వాంసులు కేబీ శర్మ ఆన్‌లైన్‌లో జూమ్ వేదికగా స్వరమాధురి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వరమాధురి కార్యక్రమం తెలంగాణ విద్యాశాఖలోనే ఒక కొత్త నూతన ఒరవడికి నాంది పలికింది. కాగా ఆదివారంతో స్వరమాధురి కార్యక్రమం ముగియగా.. చిన్నారులందరికీ ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా సంగీత పాఠాలు నేర్చుకున్న చిన్నారులను 'సాక్షి' పలకరించగా తమ మనోభావాలను వెల్లడించారు.

15 వారాలు..

జనవరి నుంచి ఈనెల 16 వరకు సుమారు 15 వారాలు ప్రతి ఆదివారం ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు సంగీతానికి సంబంధించిన పాఠాలు బోధించారు. దైవభక్తి, దేశభక్తి గీతాలు ఆరు పాటలు నేర్పించారు. విద్యార్థులు నేర్చుకుంటున్న తీరు, చక్కగా పాడుతుండగా వీరితో ఒక ఆల్బమ్‌లో సైతం పాడించారు. విద్యార్థులకు నేర్పిన ఆరు పాటలకు సంగీతం సమకూర్చి తాళవాయిద్యాలతో విద్యార్థులతో పాడించారు. మొత్తం 500 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 50 మంది విద్యార్థులు ప్రతి ఆదివారం సంగీత పాఠాలు విన్నారు. అందులో నుంచి 35 మంది విద్యార్థులతో ఆరు అల్బమ్ పాటలు పాడించారు.


అల్బమ్‌లో పాటలు పాడుతున్న విద్యార్థులు


సంగీతంలో శిక్షణనిస్తున్న గురువు కేబీ శర్మ

ఆరు పాటల్లో పాడేలా చేశారు



కరీంనగర్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న. స్వరమాధురిలో ఉచితంగా ప్రభుత్వ విద్యార్థులకు సంగీత శిక్షణ ఇస్తున్నట్లు మా సరళ మేడం తెలుసుకొని నన్ను ఆ గ్రూపులో చేర్పించారు. చక్కగా పాటలు నేర్పించడమే కాకుండా బాగా ప్రోత్సహించి నాతో ఆరు పాటల్లో పాడేలా చేశారు. సంతోషంగా ఉంది. అమ్మ, నాన్న మా కుటుంబం అందరూ సంతోషపడ్డారు. ఎంతో అభినందించారు.

– జాషువా, అంధుల పాఠశాల, కరీంనగర్

ఏటా నిర్వహించాలి



చిన్నప్పటి నుంచి పాటలు పాడటమంటే చాలా ఇష్టం. మా సైన్స్ ఉపాధ్యాయులు నన్ను స్వరమాధురి గ్రూపులో చేర్పించారు. ప్రతి ఆదివారం జూమ్‌లో స్వరమాధురి గ్రూపులో సంగీతం నేర్చుకున్న. సంగీత గురువు ఒకరోజు మా పాఠశాలకు పిలిపించి శిక్షణ కూడా ఇప్పించి ఎంతో ప్రోత్సహించారు. మ్యూజిక్ ఆల్బమ్‌లో ఆరు పాటలు పాడే అవకాశం దక్కింది. ఏటా ఇలాంటి కార్యక్రమం నిర్వహించాలి.

– హాసిని, 6వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, వెల్ది

సంగీత పాఠాలు నేర్పారు



మా స్కూల్ టీచర్ నన్ను ప్రోత్సహించి స్వరమాధురి గ్రూప్‌లో చేర్పించారు. 15 వారాలుగా ప్రతీ ఆదివారం కేబీ శర్మ చక్కగా సంగీతం పాఠాలు నేర్పారు. రికార్డింగ్‌లో కూడా మాతో ఆరు పాటలు పాడించారు. ఒక ఆలబ్మ్‌లో పాట పాడుతామని ఎన్నడూ మేం కలలో కూడా ఊహించలేదు. చక్కని అవకాశం కల్పించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు.

– అక్షయ, 9వ తరగతి, జిల్లా పరిషత్ పాఠశాల, బొమ్మనపల్లి

ఆల్బమ్‌లో పాడా..



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా సంగీతం చెప్తారనే విషయం తెలుసుకొని మా నాన్న ఆ గ్రూపులో చేర్పించారు. ప్రతీ ఆదివారం స్వరమాధురి కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో 15 వారాలు హాజరై సంగీత పాఠాలు నేర్పించారు. శృతి లయబద్ధంగా రికార్డింగ్‌లో పాడే విధానం కూడా నేర్పి మాతో ఆరు పాటలు రికార్డు చేయించారు. నేను ఒక ఆల్బమ్‌లో పాడాను. అదృష్టంగా భావిస్తున్న. భవిష్యత్‌లో మంచి సింగర్ కావాలని ఉంది.

– వైనిత ప్రియదర్శిని, 9వ తరగతి, ప్రభుత్వ బాలికల పాఠశాల, సిద్దిపేట

పాటలన్నా సంగీతమన్నా చాలా ఇష్టం



చిన్నప్పటి నుంచి పాటలన్నా సంగీతమన్నా చాలా ఇష్టం. ఇక్కడ నేర్పే వారు ఎవరు లేరు. మా స్కూల్ టీచర్లు త నను స్వరమాధురి గ్రూపులో చేర్పించారు. చక్కగా పా డితే ఆల్బమ్‌లో పాడిస్తామని చెప్పారు. అది విని చాలా సంతోషపడి శ్రద్ధగా నేర్చుకున్న. ఆల్బమ్‌లో పాటలు పాడే అవకాశం కల్పించారు. అల్బమ్ సీడీ విడుదలైన రోజున స్వరమాధురి గురించి కలెక్టర్ సార్‌కు వివరించారు. సార్ నన్ను మెచ్చుకున్నారు.

– సీహెచ్ మహా, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మడిపల్లి

10 మందికి పంచాలనే లక్ష్యంతో..



నేను ఎంపీయూపీఎస్ వన్నారంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న. ప్రవృత్తిరీత్యా చిన్నప్పటి నుంచి సంగీతంలో ప్రవేశం ఉంది. సంగీతాన్ని 10 మందికి పంచాలనేది నా కోరిక. స్వరమాధురి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతీ ఆదివారం ఆన్‌లైన్ జూమ్ వేదికగా ఉచితంగా సంగీతం నేర్పించా. ఇలాంటి కార్యక్రమం మూడు నెలలే కాకుండా ఏడాది పొడవున నేర్పించాలి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంగీతం నేర్పించి ఒక ఆల్బమ్ పాడించడం సంతోషంగా ఉంది.

– కేబీ శర్మ, సంగీత విద్వాంసులు, ఎంపీయూపీఎస్, వన్నారం

శాతవాహన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం


శేఖర్‌రావు మహేందర్ సత్యం

కరీంనగర్: శాతవాహన లయన్స్ క్లబ్ 2023–24 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కోమల్ల రాజేందర్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా యాదగిరి శేఖర్‌రావు, కార్యదర్శిగా మర్రిపల్లి మహేందర్, కోశాధికారిగా కోట సత్యం ఎన్నికయ్యారు. ఇనుగుర్తి రమేశ్, వి.జగదీశ్వరాచారి, కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, ఎస్.ప్రసాదరావు, బి.నర్సింగరావు, ఎం.సత్యనారాయణరావు, రాజేందర్‌రెడ్డి, జేసీ ప్రకాశ్, వి.నరేందర్‌రెడ్డి, మేకల అరవింద్, సీహెచ్.రామ్మోహన్‌రావులు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌గా నియమించబడ్డారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు. క్లబ్ సభ్యులు అప్పగించిన సేవా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పేదలకు చేయూతనిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు హామీ ఇచ్చారు.

మంత్రి గంగులను పరామర్శించిన వినోద్‌కుమార్


గంగుల కమలాకర్‌ను పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

కరీంనగర్: ఎడమ కాలికి గాయమై కరీంనగర్‌లోని తన నివాసంలో చికిత్స పొందుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వినోద్‌కుమార్ వెంట మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, నాయకులు తదితరులున్నారు.

హరితహారం పేరిట చెరువుశిఖం ఆక్రమణ

- స్థానికుల ఫిర్యాదుతో ఆర్ఐ విచారణ
- రద్దు చేయాలని డిమాండ్


భూమిని చదును చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గోపాల్ చెరువు శిఖం స్థలాన్ని ఓ సంస్థ ప్రతినిధులు హరితహారం పేరిట ఆక్రమించుకోవడం వివాదాస్పదంగా మారింది. ఆదివారం భూమి చదును చేయడంతో స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆర్ఐ విచారణ చేపట్టారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, కృష్ణానగర్ కాలనీ సమీపంలోని సర్వే నం .728లో 28.10 ఎకరాల విస్తీర్ణంలో గోపాల్‌చెరువు శిఖం స్థలం ఉంది. స్థలాల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు నగరానికి చేరువలో ఉండటంతో శిఖం స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో పలువురు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఈక్రమంలోనే ఆదివారం ఐఎంఏ పేరుతో కొందరు చెరువు శిఖం స్థలాన్ని చదును చేసి మట్టిపోసే కార్యక్రమాన్ని చేపట్టారు. కోట్లాది రూపాయల విలువైన శిఖం స్థలం ఆక్రమించుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు ర్యాకం మోహన్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్ఐ రజనీకాంత్ మోఖాపై విచారణ చేపట్టారు. మూడేళ్లక్రితం అప్పటి కలెక్టర్ హరితహారంలో మొక్కలు పెంచేందుకు ఐఎంఏకు మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మొక్కలు నాటేందుకు వీలుగా స్థలాన్ని చదును చేసి చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. కేటాయించిన స్థలంలో మొక్కల పెంపకం మాత్రమే చేపట్టాలని, ఇతర కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని తహసీల్దార్ డాక్టర్ కె.నారాయణ తెలిపారు. అయితే గతంలోనే ఐఎంఏ ప్రతినిధులు స్థలాన్ని చదును చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకోవడంతో విరమించుకున్నారు. ప్రస్తుతం మళ్లీ హరితహారం పేరుతో శిఖం స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ర్యాకం మోహన్ ఆరోపించారు. తక్షణమే ఐఎంఏకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేసేందుకు కలెక్టర్ కర్ణన్ తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఆధ్యాత్మికం | కొనసాగుతున్న ఎల్లమ్మ తల్లి బోనాల జోగు



గౌడ కులస్తుల అధ్వర్యంలో కరీంనగర్ రేణుకదేవి ఎల్లమ్మ తల్లి బోనాల జాతరలో భాగంగా జోగు కార్యక్రమం నగరంలో కొనసాగుతోంది. ఆదివారం మంకమ్మతోటలోని 36వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ నివాసంలో జోగు కార్యక్రమం చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఓడిబియ్యం పోసి పూజలు చేశారు. ఈనెల 25న నిర్వహించే బోనాల జాతరకు గౌడ సోదరులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాగండ్ల రవికుమార్‌గౌడ్, నాగుల కిరణ్‌గౌడ్, పొన్నం మధుగౌడ్, శ్యాంగౌడ్, తిరుపతిగౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న తక్ల నాగరాజు

కరీంనగర్‌కల్చరల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తక్ల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కోతిరాంపూర్‌లో గల ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు కనీసం స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ ఇప్పటివరకు విడుదల చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శనగరపు రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లాలోని పలు సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర గరల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్షుడు గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కంపెల్ అరవింద్, తిప్పారపు రోహిత్, అఖిలాష్, సహాయ కార్యదర్శి వినీషా, వినయ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

వీణవంక: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మడుగూరి సమ్మిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని నర్సింగాపూర్‌లో మాట్లాడారు. వడగండ్ల వానకు మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయని, అధికారులు కేవలం మొక్కజొన్న పంట సర్వే చేసి ఉన్నతాధికారులకు పంపించారని, రోజులు గడుస్తున్నా ఇంతవరకు రైతుల ఖాతాల్లో నగదు పడలేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి త్వరగా పరిహారం అందించాలన్నారు.

'ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు'

హుజూరాబాద్: ముస్లిం మహిళను వేధించిన సర్పంచ్‌కు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వత్తాసు పలకడం సరికాదని ఎంపీపీ ఇరుమల్ల రాణిసురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి నివాసంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెల్పూర్‌కు చెందిన మహిళ గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంటే సర్పంచ్ సెంటర్ తొలగించాలని వేధింపులకు గురిచేయగా పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని, ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. చట్టపరంగా కేసు నమోదు చేసిన సీఐపై ఎమ్మెల్యే విమర్శలు చేయడం సబబుకాదన్నారు. ఈటలను నియోజకవర్గంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్‌కు మద్దతుగా ధర్నా చేస్తున్న ఈటల ప్రజలకు ఏం మెసేజ్ ఇస్తున్నారని ప్రశ్నించారు. మహిళకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు ఉజ్మానూరిన్, రమాదేవి, మారపల్లి సుశీల, నాయకులు పావని తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


గంగాధర: విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే

గంగాధర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేధావి అని, ఆయన రాసిన రాజ్యాంగం ద్వారానే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కొట్లనర్సింహులపల్లి గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరుపెట్టడం, హైదరాబాలో 125 అడుగుల విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడిచి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

రామడుగు: మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు టైలరింగ్ నేర్చుకొని స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పొందాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసిన యూత్ క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల ప్రమీల, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్, నాయకులు అనిల్, ఎండీ మోహీజ్, బుత్కూరి సురేష్, మాస్టర్ ట్రైనర్ మాధవిగౌడ్ పలువురు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రామడుగు: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


జమ్మికుంట: వావిలాలలో...

రామడుగు మండలం గోపాల్‌రావుపేట ప్రగతి విద్యానికేతన్ పాఠశాల 1997–98, జమ్మికుంట మండలం వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1985–86 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. మెమెంటో జ్ఞాపికలు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అనంతరం మృతి చెందిన పలువురికి నివాళి అర్పించారు. – రామడుగు/జమ్మికుంట

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

క్లుప్తంగా...



గర్భిణిని అంబులెన్స్‌లో తరలిస్తున్న ఎంపీపీ సుధీర్‌రెడ్డి

అంబులెన్స్ డ్రైవర్‌గా ఎంపీపీ

బొమ్మలరామారం: అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో.. ఓ ఎంపీపీ డ్రైవర్‌గా మారి గర్భిణీని ఆస్పత్రికి తరలించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఖాజీపేట్ గ్రామంలోని ఇటుక బట్టీలో పని చేసే ఓ వలస కార్మికురాలు గర్భవతి. ఆమె వైద్య పరీక్షల నిమిత్తం ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చింది. మెరుగైన వైద్యం అవసరమని భావించిన సిబ్బంది, ఆమెను భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆమెను తీసుకెళ్లడానికి పీహెచ్‌సీలోని అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో.. నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డికి సిబ్బంది సమాచారం అందించారు. సదరు గర్భిణీకి అత్యవసరంగా వైద్యం అవసరమని తెలిపారు. వెంటనే ఎంపీపీ సుధీర్‌రెడ్డి తానే డ్రైవర్‌గా మారి, గర్భిణీని అంబులెన్స్‌లో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం వైరల్ కావడంతో ఎంపీపీని స్థానికులు అభినందిస్తున్నారు.

బీసీ కుల గణన సాధన కోసం పోరుబాట: జాజుల

లాలాపేట: బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న నల్గొండ నుంచి నడిగడ్డ వరకు 33 జిల్లాల్లో బీసీల పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే క్రమంలో రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న బీసీల పోరుబాటకు బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, ఉద్యోగులు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన చేస్తామని మొట్టమొదటిసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఏపీ సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఏపీ సీఎం జగన్‌ను ఇతర రాష్ట్రాల సీఎంలు ఆదర్శంగా తీసుకుని అంసెబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపాలని కోరారు.

మక్కలు ఇంకెప్పుడు కొంటరు?

ఇంకా ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం మార్క్‌ఫెడ్ ఎదురుచూపులు
- అనుమతితో పాటు బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే ముందుకు సాగే యోచన
- మార్కెట్‌లో పడిపోతున్న ధర
- ఆందోళనలో రైతాంగం



కామారెడ్డి జిల్లా భిక్కనూరులో సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన మక్కలు

సాక్షి, కామారెడ్డి: మక్కల కొనుగోలుపై సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో దళారులు చెప్పిందే ధర అవుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, మార్కెట్‌లో మక్కల ధర రోజురోజుకూ పతనం అవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో 6,48,446 ఎకరాల్లో మక్క పంట సాగైంది. ఈసారి పంట ఆశాజనకంగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని భావిస్తున్నారు. సగటున ఎకరాకు 29 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఈ లెక్కన మొత్తంగా దాదాపు 2 కోట్ల క్వింటాళ్ల మక్కల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. కాగా మక్కల కొనుగోలు వ్యవహారాన్ని మార్క్‌ఫెడ్ చూస్తుంది. అయితే ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇవ్వడంతో పాటు అవసరమైన బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా చేస్తేనే మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు ప్రక్రియ మొదలుపెడుతుంది. కానీ సర్కారు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మక్కల కొనుగోలు వ్యవహారం ముందుకు సాగడం లేదు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో మక్క పంట కోసి, జూళ్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో జూడు తీసి, మక్కలు ఒలిచి ఆరబెడుతున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో మక్క కోయాల్సి ఉంది.

■ తగ్గుతున్న ధర..

మక్క పంట చేతికి అందే సమయంలో తొలుత బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2,400 వరకు ధర పలికింది. కానీ పక్షం రోజులుగా ధర తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.1,800 మాత్రమే చెల్లిస్తున్నారు. గతంలో పౌల్ట్రీ పరిశ్రమలో కోళ్లకు దాణాగా మక్కలను వాడేవారు. ప్రస్తుతం మక్కల కన్నా బియ్యం నూకలు తక్కువ ధరకు లభిస్తుండటంతో పౌల్ట్రీ రంగం మక్కల కొనుగోలుపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో స్థానికంగా మక్కలకు డిమాండ్ పడిపోతోంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తే తప్ప తమకు మద్దతు ధర లభించే అవకాశం లేదని రైతులు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తుందా అని వారు ఎదురుచూస్తున్నారు.

మార్క్‌ఫెడ్ కొనాలి..



నేను మూడు ఎకరాల్లో మక్క పండించిన. ఈసారి పంట మంచిగనే వచ్చింది. అయితే మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదు. మొదట్లో క్వింటాలుకు రూ. 2,400 ధర పలికింది. ఇప్పుడు అమ్ముదామనే సమయానికి రూ.1,800లకు పడిపోయింది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.
–గడ్డం బాల్‌రెడ్డి, రైతు, మోతె, లింగంపేట మండలం, కామారెడ్డి జిల్లా

కేంద్రాలు తెరవకుంటే ఇబ్బందే



ప్రభుత్వం మక్కల కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే మాకు నాలుగు పైసలు మిగులుతయి. లేకుంటే ఏం లాభం ఉండదు. ఇప్పుడు మార్కెట్‌లో ఉన్న ధరకు అమ్ముకుంటే అప్పులే మిగులుతయి. కేంద్రాల ఏర్పాటు ఇప్పటికే ఆలస్యమైంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి.
– బందారి లింగం, రైతు, తాడ్వాయి మండలం, కామారెడ్డి జిల్లా



బీబీనగర్ టోల్‌గేట్ వద్ద నిలిచిన వాహనాలు

హైవేపై వాహనాల రద్దీ

చౌటుప్పల్, బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం ఒక్కసారిగా వాహనాల రద్దీ పెరిగింది. శుభకార్యాలు ఉండడంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల ప్రజానీకం వాహనాల్లో రాకపోకలు సాగించారు. దాంతో చౌటుప్పల్ పట్టణంలో, జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద కూడా వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి పుణ్యక్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున వాహనాల్లో తరలి రావడంతో టోల్‌ప్లాజా వద్ద ఉదయం, సాయంత్రం సమయాల్లో విపరీతమైన రద్దీ ఏర్పడింది.

యూఏఈలో విజిట్ వీసా నిబంధనలు కఠినతరం

- గడువు తీరిన తర్వాత ఉంటే నిషేధిత జాబితాలోకి..
- యూఏఈతో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో ప్రవేశంపై నిషేధం



మోర్తాడ్(బాల్కొండ): వీసా నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కఠిన నిబంధనలను అమలులోకి తీసుకువచ్చింది. విజిట్ వీసాలపై యూఏఈకి వచ్చినవారు గడువు ముగిసిన తర్వాత ఒక్కరోజు కూడా ఎక్కువగా ఉండడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టింది. సాధారణంగా యూఏఈ 30, 60 రోజుల విజిట్ వీసాలను జారీ చేస్తుంటుంది. ఈ వీసాలపై యూఏఈకి వచ్చినవారు గడువు ముగిసిపోకముందే వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఇకపై తమ దేశంలో ఒక్కరోజు ఎక్కువగా ఉన్నా నిషేధిత జాబితాలో చేరుస్తామని అక్కడి సర్కారు ప్రకటించింది. దీనివల్ల వీసా నిబంధనలు ఉల్లంఘించినవారు యూఏఈతో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో ప్రవేశానికి అనర్హులు అవుతారు. విజిట్ వీసాలపై వచ్చి యూఏఈలో చట్టవిరుద్ధంగా ఉంటున్నవారి సంఖ్యను తగ్గించుకోవడంతో పాటు ఎవరైనా చట్టబద్ధంగానే తమ దేశంలో ఉండే విధంగా యూఏఈ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. యూఏఈలో ఉపాధి చూపిస్తామని.. తొలుత విజిట్ వీసాపై వెళ్లాక, తర్వాత వర్క్ వీసా ఇప్పిస్తామని చెప్పే ఏజెంట్ల మాటలను నిరుద్యోగులు నమ్మవద్దని గల్ఫ్ వలస కార్మిక సంఘాల ప్రతినిధులు సూచిస్తున్నారు.



క్యాజువాలిటీలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దాస్పత్రిలో కలెక్టర్ అర్ధరాత్రి తనిఖీ

వైద్య సేవలపై ఆరా

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం అర్ధరాత్రి 2 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన విధుల్లో చేరినప్పటి నుంచి ఈ ఆస్పత్రిపై ప్రత్యేక నిఘా పెట్టారు. తరచూ ఆకస్మిక తనిఖీలు చేపడుతూ వైద్యులు, సిబ్బంది సక్రమంగా పని చేసేలా చూస్తున్నారు. కలెక్టర్ ఏ సమయంలో వస్తారో తెలియక ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ తాజాగా శనివారం అర్ధరాత్రి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఆకస్మిక తనిఖీ చేశారు. మెటర్నిటీ లేబర్ రూమ్‌ను పరిశీలించారు. డాక్టర్, సిబ్బంది విధులపై ఆరా తీశారు. కాజువాలిటీ, ఐసీయూ గదులతో పాటు రిజిస్టర్లు పరిశీలించి డ్యూటీ డాక్టర్లు ఎంతమంది ఉన్నారని తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఎక్కువగా పేదలే వస్తుంటారని, మెరుగైన సేవలు అందించి వారికి నమ్మకం కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని, సిబ్బంది కూడా సక్రమంగా పని చేసి మానవతా దృక్పదంతో మెలగాలని చెప్పారు.

గుర్తుకొస్తున్నాయి..!

- 1980– 81 బ్యాచ్ విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం



1980– 81 జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్: ఆరు పదులకు సమీపిస్తున్న వయస్సు అందరిదీ.. ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో జీవితంలో స్థిరపడ్డారు. కొంత మంది ఉద్యోగ విరమణ పొందారు. పిల్లల వివాహాలు చేసి మనుమలు, మనువరాళ్లతో సరదాగా గడుపుతున్న తాతలు, అమ్మమ్మ, నానమ్మలు. దాదాపు 42 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1980– 81 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

కుటుంబంతో కదిలి వచ్చారు..

నెల రోజులుగా కొంత మంది స్నేహితులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పాత స్నేహితులకు ఫోన్ల ద్వారా సమాచారం చేరవేశారు. సుదూర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు, గురువులు భార్యాపిల్లలతో కదిలి వచ్చారు. పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అంతకు ముందు లోకం విడిచిన గురువులు, మిత్రులకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. గురువులు హరిశ్చందర్ రావు, జగదీశ్వర్, కిష్టయ్య, సత్యమూర్తిను శాలువలు, పూలదండలతో సత్కరించారు. సాయంత్రం ముస్లిం మిత్రులకు అక్కడే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాటిపెల్లి శివప్రసాద్, రఫీక్ జివాని, సాయిని నర్సింహస్వామి, రావుల గురుమూర్తి, గాడెపెల్లి శ్రీనివాస్, మర్యాల ఉదయబాబు, రావుల మురళీధర్, మంథెన మహేశ్, పెండ్యాల సురేశ్, పిన్న వివేక్, రాపర్తి నవీన్, పిన్న రాజేశ్వర్, సాయిని లక్ష్మణమూర్తి, దిలీప్, సంధ్య, రాజేశ్వరి, పుష్పలత, శారద, పద్మజ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

ఆదిలాబాద్‌టౌన్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి స్కైలాబ్ బాబు అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో ఆదివారం రాజ్యాంగ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే విశిష్టమైనదన్నారు. అలాంటి రాజ్యాంగంలోని మూల అంశాలను తొలగించే యత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్షుడు ఎ.స్వామి, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, వివిధ సంఘాల నాయకులు బి.వృకోధర్, ఎం.శ్రీనివాస్, ఎస్ సుదర్శన్, రియాజ్, కాంతం, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.కిష్టన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు సి.లక్ష్మణ్‌రావ్, జిల్లా కార్యదర్శులు సి.విలాస్, ఇస్తారి, శివన్న, శ్యాం సుందర్, మహిళా ప్రతినిధులు రజనీ, శ్రీలత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ

- వివరాలు సేకరించిన ఆర్‌సీవో స్వరూపారాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌సీవో స్వరూపారాణి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల(కాగజ్‌నగర్‌లో)లో శనివారం తొమ్మిదో తరగతి విద్యార్థిని సోదరి శ్రీవాణి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో స్వరూపారాణి గురుకుల పాఠశాలలో ఆదివారం విచారణ చేపట్టారు. విద్యార్థినికి అందించిన వైద్యసేవలపై ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి మృతికి కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్యపరీక్షల రిపోర్టులు పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎడ్లబండిపై చిరుత దాడి



గాయపడిన ఎద్దును పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో హరిలత



గుర్తించిన చిరుత పాదముద్ర

- ఎద్దు, రైతుకు స్వల్ప గాయాలు

కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండలం సూర్యాపూర్ పీరీల గుట్ట అటవీ ప్రాంతంలో ఆదివారం చిరుత సంచారం కలకలం రేపింది. సూర్యాపూర్ గ్రామానికి చెందిన రైతులు రొడ్డ సుధాకర్, రొడ్డ శ్రీనివాస్, ఆయిటి రాజన్న పీరీల గుట్ట సమీపానికి పందిరి వేసేందుకు అవసరమయ్యే పబ్బు కోసం ఎడ్లబండిపై వెళ్లారు. సుధాకర్, రాజన్న పబ్బు తీసుకువచ్చేందుకు వెళ్లారు. ఎడ్లబండిపై రొడ్డ శ్రీనివాస్ (మూగ) ఉండగా అకస్మాత్తుగా చిరుత దాడి చేసింది. ఉలిక్కిపడ్డ శ్రీనివాస్ కేకలు వేయగా ఎద్దు బెదిరిపోగా చిరుత పరారైంది. అదే సమయంలో సుధాకర్, రాజన్న అక్కడికి చేరుకొని చిరుత పారిపోవడాన్ని కళ్లారా చూశారు. చిరుత దాడిలో ఒక ఎద్దుకు, శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎఫ్‌బీవో హరిలత ఘటనా స్థలానికి చేరుకుని చిరుత పాదముద్రలను గుర్తించారు. అటవీ ప్రాంతానికి వెళ్లే రైతులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీజేపీ తీరు దేశానికి పెనుప్రమాదం



మాట్లాడుతున్న సాంబశివరావు, పక్కన వెంకట్‌రెడ్డి



బైక్ ర్యాలీ తీస్తున్న సీపీఐ నాయకులు

- కమ్యూనిస్టులను విమర్శిస్తే సహించబోం
- కరీంనగర్‌కు ఎంపీ బండి సంజయ్ చేసిందేమీ లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్: పల్లెపల్లెకూ సీపీఐ–ప్రజల వద్దకు సీపీఐ ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆది వారం కరీంనగర్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అక్కడి నుంచి నగర వీధుల గుండా తెలంగాణ తొలి అమరుడు, సీపీఐ జిల్లా మొట్టమొదటి కార్యదర్శి అయిన అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అక్కడే బహిరంగ సభ నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పార్టీ కార్యదర్శులు, అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు నాయకులు ఎర్రచొక్కాలు ధరించి, నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కూనంనేని, చాడ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో మతోన్మాదం పేట్రేగి పోయిందని, ధరల పెరుగుదలకు అడ్డూఅదుపు లేదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా విద్యార్థులను, యువతను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుడుతున్న తీరు రానున్న రోజుల్లో దేశానికి పెనుప్రమాదంగా మారనుందని అన్నారు.

అమ్ముడుపోతామనడం సరికాదు..

కమ్యూనిస్టులు అమ్ముడుపోతున్నారంటూ విమర్శిస్తే సహించబోమన్నారు. ఎంపీగా బండి సంజయ్ కరీంనగర్ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణ విషయంలో బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రూ.లక్ష రుణమాఫీ ఒకేసారి చేయాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ వేగవంతం చేయాలని, గృహలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.3 లక్షలను రూ.6 లక్షలకు పెంచాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. బీజేపీని గద్దె దించండి–దేశాన్ని రక్షించండి అనే నినాదంతో ఈ నెల 27 వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలను జాగృతం చేసేందుకు తమ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, మంద పవన్, ఉమ్మడి జిల్లాకు చెందిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కు మార్, బోయిని అశోక్, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, గూడెం లక్ష్మి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, కన్నం లక్ష్మీనారాయణ, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, నాగెల్లి లక్ష్మారెడ్డి, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి

శంకరపట్నం(మానకొండూర్): ఇళ్లు లేని పేదలందరికీ గృహలక్ష్మి పథకం కింద ఇళు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బస్సు జాత ఆదివారం కేశవపట్నం చేరింది. ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని, రైతు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పంటల బీమా పథకం అమలుపై కేంద్రం కుంటిసాకులు చెబుతోందని ఆరోపించారు. సింగరేణి ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీ

జమ్మికుంట(హుజూరాబాద్): కేంద్రంలోని బీజేపీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. జమ్మికుంట పట్టణంలో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పౌర హక్కులను కాలరాస్తోందన్నారు. సీపీఐ జాతీయ పార్టీ గుర్తింపు రద్దు చేసి, బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, పెన్షన్లు ఇవ్వాలని, రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంజాల శ్రీనివాస్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, సిద్దిపేట, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నాయకులున్నారు.

'తాళపు చెవులు మాయం' పై నేడు విచారణ

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్

జగిత్యాల/జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్ రూం తాళపు చెవులు మాయం కావడంపై సోమవారం విచారణ జరుపుతారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపులో అవకతవకలు చోటుచేసుకున్నాయని, ఫలితంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విజయం సాధించారని ఆయనపై పోటీచేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికల సామగ్రి మొత్తం వీఆర్‌కే కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చారు. కోర్టు ఆదేశాలతో కలెక్టర్ యాస్మిన్ బాషా, అప్పటి ఎన్నికల రిటర్నింగ్ అధికారితో కలిసి స్ట్రాంగ్‌రూమ్ తాళం తెరిచేందుకు ఈనెల 12న ప్రయత్నించారు. తాళపు చెవులు సరిపోలేదు. దీంతో లక్ష్మణ్‌కుమార్ మళ్లీ హైకోర్టు మెట్లు ఎక్కారు. తాళపు చెవులు మాయం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు.. పూర్తి స్థాయి విచారణ జరిపి, నివేదిక అందించాలని స్టేట్ చీఫ్ ఎలక్షన్ కమిషన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూలో సోమవారం ఉదయం 11గంటలకు విచారణ జరుగుతుంది. సంబంధిత పత్రాలతో హాజరు కావాలని అప్పటి జిల్లా ఎన్నికల అధికారి, డెప్యూటీ ఎన్నికల అధికారికి ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

నేటి నుంచి పోలీసుల క్రీడాపోటీలు

- ప్రారంభించనున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల పోలీసుల క్రీడా పోటీలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు గోదావరిఖనిలో జరగనున్నాయి. ఈ మేరకు సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూస్టేడియాన్ని ముస్తాబు చేస్తున్నారు. రెండు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, పోలీసులు, మహిళా పోలీసులు, పోటీల్లో పాల్గొనున్నారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షెటిల్, టగ్‌ఆఫ్‌వార్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నారు. ఈపోటీలను రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు.

సన్నిధి



మంచి మాట

ఏదో.. ఏవో అనుకుంటూ...

అనుకోవడం అనేది ప్రతి వ్యక్తికీ ఉండే లక్షణమే. అనుకోవడం అన్న లక్షణం లేని మనుషులు ఉండరు. అయితే మనలో పలువురికి ఏం అనుకుంటున్నాం, ఎందుకు అనుకుంటున్నాం, అనుకునేది సరైందేనా? వంటి వాటిపై ఉండాల్సిన పరిణతి, కచ్చితత్వం ఉండవు. ఈ తీరు పలు సమస్యలకు మూలం అవుతోంది.

ఒక పున్నమి రాత్రిలో తిక్కలోడు ఒకడు దారి వెంబడి నడుస్తూ పోతున్నాడు. కాసేపయ్యాక సేదతీరడం కోసం ఓ చెట్టు కింద నుంచున్నాడు. ఆ చెట్టుకు దగ్గరలో ఓ పెద్ద బావి కనిపిస్తే ఆ బావిలోకి తొంగి చూశాడు. ఆ బావి నీళ్లలో జాబిల్లి ప్రతిబింబం కనిపించింది. జాబిల్లి బావిలో పడిపోయింది అని అనుకున్నాడు. అయ్యో ఇప్పుడు నేనేం చెయ్యగలను? ఎలా ఈ జాబిల్లిని కాపాడగలను? ఇక్కడెవరూ లేరే, ఇప్పుడు ఈ జాబిల్లిని నేను కాపాడకపోతే అది చచ్చిపోతుంది కదా అని అనుకున్నాడు. అంతటితో ఊరుకోలేదు. అక్కడా ఇక్కడా వెతికి ఓ తాడును తీసుకుని దాన్ని బావిలోకి విసిరేశాడు జాబిల్లిని ఆ తాడుతో కట్టి బయటకు తియ్యొచ్చని అనుకుని. ఆ బావిలో ఏదో ఓ రాయికి ఆ తాడు చిక్కుకుపోయింది. ఆ వ్యక్తి చాలబలంగా ఆ తాడును లాగాడు. కానీ రాయికి చిక్కుకుపోయిన తాడు రాలేదు. జాబిల్లి చాల బరువుగా ఉందే, పైగా నేనిక్కడ ఒంటరిగా ఉన్నానే, నేనెలా జాబిల్లిని బయటకు తియ్యగలను? ఈ జాబిల్లి ఎప్పటి నుండి ఈ బావిలో ఉందో తెలియడం లేదు, జాబిల్లి అసలు బతికి ఉందా, చచ్చిపోయిందా కూడా తెలియడం లేదు అని అనుకుంటూ ఆ వ్యక్తి తాడును బలంగా లాగుతున్నాడు. అలా లాగుతూ ఉండగా ఆ తాడు తెగిపోయి అతడు వెల్లకిలా నేలపై పడిపోయాడు. పడిపోవడంవల్ల అతడి కళ్లు మూసుకుపోయాయి. తలకు దెబ్బ తగిలింది. కొద్దిసేపు తరువాత అతడు కళ్లు తెరిచినప్పుడు జాబిల్లి ఆకాశంలో కనిపించింది. దాన్ని చూసి తను జాబిల్లిని కాపాడేశాడనీ, తనకు మాత్రమే కొంచెం దెబ్బ తగిలిందనీ అయినా పరవాలేదనీ తనవల్ల జాబిల్లి కాపాడబడిందనీ తనకు తాను చెప్పుకున్నాడు. ఆ వ్యక్తిని చూసి మనం నవ్వుకుంటాం.

ఒక సందర్భంలో ఓషో చెప్పిన కథ ఇది.

కథలోని వ్యక్తి ఎక్కడ తప్పు చేశాడు? అతడు తన తత్వంతో ఏదో అనుకున్నాడు. ఆ అనుకున్నది సరికాదు. మనం కూడా ఇలాగే ఏదో, ఏవో అనుకుంటూ ఉంటాం. చాలసందర్భాల్లో మనం అనుకునేవి సరైనవి కావు. ఈ తీరు మన సమస్యల్లో ప్రధానమైంది.

అనుకోవడానికి అతీతంగా మనం బతకగలం అన్న చింతన కూడా మనలో చాలమందికి లేదు. ఎప్పుడూ ఏదో ఒకటి అనుకుంటూ ఉండాల్సిందే అన్న స్థితిలో మనం కొట్టుమిట్టాడుతున్నాం. తిక్కవ్యక్తి, జాబిల్లి బావిలో పడిపోయిన ఈ కథలాగానే మానవజాతి మొత్తం ఇలాంటి సమస్యలో ఇరుక్కుపోయి ఉంది. ఈ ప్రపంచమంతా ఈ సమస్య ఉంది అని అంటారు ఓషో.

దేన్నో అనుకుంటూ ఉండడమూ, దేన్ని పడితే దాన్ని అనుకుంటూ ఉండడమూ మనలోని సమస్యలు మాత్రమే కాదు మనం దిద్దుకోవాల్సిన తప్పులు. అభిప్రాయపడడంలాగా అనుకోవడం కూడా మనుషుల రుగ్మతే; కాకపోతే బలమైన బలహీనత.

ఏదో, ఏవో అనుకుంటూ ఉండడంవల్ల మనుషులకు నష్టం, కష్టం, హాని కలుగుతూ ఉంటాయి. ఏదో, ఏవో అనుకుంటూ ఉండడం కాదు పరిస్థితులు, సంఘటనలపై సమగ్రమైన, సరైన అవగాహనను పొందేందుకు పూనుకోవాలి. అలాంటి అవగాహన మాత్రమే మనకు కావాల్సిన మేలు చేస్తుంది.


– రోచిష్మాన్

గురువాణి

అది మాట కాదు.. మంత్రం


సత్యమేవజయతే!... వేదాల చివరి భాగాలయిన ఉపనిషత్తులలో చివరిదయిన ముండకోపనిషత్తులోని ఒక మంత్రం ఇది. అర్థం – సత్యము మాత్రమే జయాన్ని పొందుతుంది..అని. లోకంలో అసత్యం మొదట్లో గొప్పగా ఆకర్షిస్తూ, ప్రచారాన్ని పొందినా సత్యం ముందు నిలబడలేదు. దీనిని నమ్మిన వారు ఓడిపోవడం అన్నమాట ఉండదు. సత్యాన్ని అనుష్ఠించినవారు శాశ్వతులవుతారు.

రామాయణంలో రామచంద్రమూర్తి అంటారు..''సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా/సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరంపదమ్''..అని. లోకాలన్నీ సత్యాన్ని ఆశ్రయించి ఉన్నాయి. మన దేశ రాజముద్రలో కనిపించే సింహాల కింద 'సత్యమేవజయతే' అని రాసి ఉంటుంది. మన మౌలిక సిద్ధాంతం సత్యాన్ని అనుష్ఠించడం. సత్యం కన్నా మరింత గొప్పది అంటూ ఏదీ లేదు. మన దేశంలో మహాత్ములుగా వెలిగిన ఎందరో సత్యాన్ని అనుష్ఠించాలని జీవితాంతం తాపత్రయపడ్డారు.



సత్యం అంటే మాట్లాడడం ఒక్కటే కాదు, తాను ఏది నమ్మాడో, ఏది మాట్లాడుతున్నాడో, ఏది చేస్తున్నాడో మూడూ ఒక్కటై ఉండడం. పైకి ఒకటి, దానికి భిన్నంగా మరొకటి చేస్తూ, మనసులో వేరొకటి పెట్టుకుని ఉంటే దానిని దంభం అంటారు. త్రికరణములు ఏకత్వాన్ని పొంది ఉంటే, ఒకే సరళరేఖలో ఉంటే దాన్ని సత్యం అంటారు. ఆ సత్యమే ఈశ్వరుడు. ధర్మాన్ని నిరంతరం పట్టుకుని సత్యంలోకి ప్రవేశిస్తే ఈశ్వరుడి అనుగ్రహం కలుగుతుంది.

భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మాగాంధీ కూడా అహింస, సత్యం అనే రెండింటిని ఆయుధాలుగా చేసుకొని పోరాడారు. ఆయన కేవలం సత్యాన్ని ప్రబోధించి ఊరుకోలేదు. స్వయంగా అనుష్ఠించి చూపారు. ఆయన కారాగారంలో ఉన్న సమయంలో ఆయన ఖర్చులకు గాను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు ప్రతి నెలా రు.200 లు ఇచ్చేది. కానీ ఆయన తనకు నెల ఖర్చు రు.35లు మాత్రమేనని చెబుతూ మిగిలినది ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసారు. అలా తిరిగిచ్చే బదులు దానిని ఉద్యమానికి వాడుకోవచ్చు కదా.. అని తదనంతరకాలంలో ఎవరో అడిగారు. దానికి ఆయన ''ప్రభుత్వం నాకు ఆ సొమ్ము ఇచ్చిన ప్రయోజనం వేరు. పరాయి ప్రభుత్వం ఇచ్చిన ఆ సొమ్మును మన ఉద్యమానికి ఎలా వాడుకుంటాం? అందుకే తిరిగిచ్చేసాను'' అన్నారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు


ఒకటి కాదు, రెండూ కాదు...అడుగడుగునా ఆయన సత్యాన్ని నిష్ఠగా పాటించడానికి తన జీవితంమీదే ఆయన ఎన్నో ప్రయోగాలు చేసుకున్నారు. అంతటి పారదర్శకత, అంతటి నిబద్ధత, అంతటి స్వచ్ఛత ఉండబట్టే వారి మాటలు కోట్లాదిమందికి శాసనాలయ్యాయి. అహింస, సత్యం .. అనే ఈ రెండు సిద్ధాంతాలనే ఆయుధాలుగా చేసి పోరాడి విజయం సాధించారు. ఈ సిద్ధాంత వైభవం చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది.

సత్యం ఎక్కడ ఉందో అక్కడ గెలుపుంటుంది. ఎవరు చెప్పినా సత్యాన్నే ఆశ్రయించి బతకాలంటారు. మాట చిన్నదే కానీ అది శక్తిమంతమైన మంత్రం. వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేస్తుంది, జన సమూహాలను, చివరకు ప్రభుత్వాలను కూడా ప్రభావితం చేయగలిగే శక్తి దానికుంది.

బౌద్ధవాణి

చేవ గల సందేశం

చదవడం అంటే అక్షరాలను గుర్తించడం కాదు. వాటి సారాన్ని గ్రహించడం. ఆ 'సారాన్ని' గుర్తించడం, గ్రోలడమే చదువు. అలాంటి చదువు వల్ల మనస్సు వికసిస్తుంది. బుద్ధి ప్రకాశిస్తుంది. బతుకు సారవంతమవుతుంది. ఆ సారాన్ని వెదుక్కుంటూ వచ్చాడు. పింగళుడు అనే పండితుడు బుద్ధుని దగ్గరకు.



భగవాన్ బుద్ధుడు అప్పుడు శ్రావస్తి సమీపంలోని అనాథ పిండకుని జేతవనంలో ఉన్నాడు. ఆ సమయంలో ఆరుగురు మహా తాత్వికులు ఉండేవారు. ఒక్కొక్కరు ఒక్కో సిద్ధాంతాన్ని చెప్పారు. పరిపూర్ణ జ్ఞానానికి తమదే సరైన మార్గమని ఎవరికి వారు ప్రబోధించే వారు. విడివిడిగా వింటున్నప్పుడు దేనికదే బాగుంది, సమగ్రంగా ఉంది అనిపించేది పింగళునికి. తనకు తాను ఎటూ తేల్చుకోలేకపోయాడు. ఎంతటి జటిలమైన సమస్యనైనా తేలికగా, అర్థం అయ్యేలా తీర్చగల నేర్పరి బుద్ధుడే అని నిర్ణయించుకున్నాడు. జేతవనానికి వచ్చాడు. తన అనుమానాలు వెళ్లబుచ్చాడు.

అప్పుడు బుద్ధుడు...

''పింగళా! ఒకడు చేవగల చెట్టుకోసం వనానికి వచ్చాడు. అక్కడ ఓ పెద్ద చెట్టు కన్పించింది. దాని కొమ్మలు చాలాదూరం విస్తరించి ఉన్నాయి. ఈ కొమ్మలు చాలా బలమైనవి, చేవగలిగినవి. కాబట్టి ఇవి గట్టిగా విస్తరించాయి'' అనుకున్నాడు. వెంటనే ఆ కొమ్మల్ని నరుక్కుని వెళ్ళాడు.

''చేవగల చెట్టును తెచ్చాను''. అంటూ సంబరపడ్డాడు. అప్పుడు అతణ్ణి చూసినవారు– ''ఇతడు ఒట్టి అమాయకుడు. అజ్ఞాని. చేవగల చెట్టు కాండాన్ని వదిలిపెట్టి, కేవలం కొమ్మలు కొట్టుకు తెచ్చి ''ఇదే చేవ.. ఇదే చేవ'' అనుకుంటున్నాడు. నిజానికి అతనికి చేవ అంటే ఏమిటో తెలియదు'' అనుకున్నారు.

''అలాగే పింగళా! సర్వం త్యజించి, ప్రవ్రజించిన కొందరు కీర్తినీ లాభ సత్కారాలనీ పొందుతారు. వాటికి సంతోష పడతారు. తమ సంకల్పం నెరవేరింది అనుకుంటారు. తమను తామే పొగుడుకుంటారు. ఇతరుల్ని నిందిస్తారు. తమకు తప్ప ఇతరులకు ఏమీ తెలియదని విర్రవీగుతారు. అసలైన జ్ఞానం అంటే ఏమిటో, ధ్యానం అనేది ఎందుకో, సన్యసించడం దేనికోసమో అంతిమంగా దేన్ని సాధించాలో ఎప్పటికీ తెలుసుకోలేరు. ఇలాంటి సన్యాసులు, యోగులు, భిక్షువులు చేవ కోసం ప్రయత్నించి ఆకులు కొమ్మలు తెచ్చుకునే అజ్ఞానులు'' అని చెప్పాడు.

పింగళుని వదనం విప్పారింది. అతని ముఖంలో సంశయ రేఖలు తొలగిపోతున్నాయి. మిగిలిన అనుమానాలూ అడిగాడు...

''పింగళా! మరొకడు చేవ కోసం వెళ్ళి చెట్టుపై బెరడునే చేవగా భావిస్తాడు. ఇంకొకరు లోపలి బెరడునే చేవగా భావిస్తారు. వేరొకరు దాని వెనుక ఉన్న తెల్లటి గుజ్జునే చేవగా భావిస్తారు. వీరంతా అదే చేవ అనుకుంటారు. అదే బలమైందిగా భావిస్తారు. వాదిస్తారు. కానీ నిజమైన చేవ పై బెరడుకీ, లోపల బెరడుకీ, గుజ్జుకీ వీటన్నింటి కంటే లోపల ఉంటుంది. జ్ఞాన దర్శనం కూడా అలాంటిదే! నిజమైన పరిత్యాగి ఈ పై పై విషయాలతో సరిపుచ్చుకోడు. అంతవరకే చాలు అనుకోడు.'' అన్నాడు.

''అంటే... భగవాన్'' అని వినయంగా నమస్కరిస్తూ అడిగాడు పింగళుడు.

''పింగళా! నిజమైన బ్రహ్మచర్యం ప్రవ్రజ్య (కీర్తి) కోసం కాదు. లాభసత్కారాల కోసం కాదు. శీల సంపద కోసమూ కాదు. సమాధి (ఏకాగ్రత) కోసమూ కాదు. జ్ఞానం కోసం కూడా కాదు. చిత్త విముక్తి కోసమే! చిత్తం నుండి సర్వ మలినాల్ని వదిలించుకోవడం కోసమే. చిత్త విముక్తిని సాధించేదే నిజమైన బ్రహ్మచర్యం'' అన్నాడు.

అంతిమ గమ్యానికి బయలుదేరిన వారు కొందరు కొంత దూరం మాత్రమే పోగలరు. ఇంకొందరు మరికొంత దూరం పోగలరు. వేరొకరు దారి తప్పగలరు. ఏ కొందరో సరైన దారిలో ప్రయాణం చేసి గమ్యం చేరుకోగలరు. కాబట్టి అదే పరిపూర్ణ ప్రయత్నం. సరైన ప్రయత్నం. ఆ సరైన మార్గాన్ని ఇన్నాళ్ళకు దర్శించాను'' అనుకుని– సగౌరవంతో శిరస్సు వంచి బుద్ధునికి ప్రణమిల్లాడు పింగళుడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

ఇంతకన్నా మెరుగైన చేతులు ఏముంటాయి?



హ్యారీ కోనిగ్, మహేశ్‌బాబు

హీరో మహేశ్‌బాబు సినిమా షూటింగ్‌లతో ఎంతో బిజీగా ఉంటారు. అయితే ఏ మాత్రం కొంచెం సమయం దొరికినా కుటుంబంతో వెకేషన్‌కు వెళుతుంటారు. అక్కడి ఫొటోలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటారు మహేశ్ బాబు. వెకేషన్‌లో భాగంగా భార్య నమ్రతా శిరోద్కర్, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి వారం రోజులుగా జర్మనీలో ఎంజాయ్ చేస్తున్నారాయన. అయితే తాజాగా మహేశ్ బాబు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ పోస్ట్ ఆయన అభిమానులను కలవరపెడుతోంది. డాక్టర్ హ్యారీ కోనిగ్‌తో దిగిన ఓ ఫోటోను షేర్ చేసి, 'థ్యాంక్యూ డాక్టర్ హ్యారీ కోనిగ్.. ఆరోగ్యం బాగుండటానికి ఇంతకన్నా మెరుగైన చేతులు ఏముంటాయి(డాక్టర్‌ని ఉద్దేశించి)' అంటూ పోస్ట్ చేశారు. దీంతో ఆయనకు ఏమైంది? అంటూ నెట్టింట చర్చ మొదలైంది. అయితే హ్యారీ కోనిగ్ ప్రముఖ నేచురోపతి డాక్టర్. ఆయన ఆధ్వర్యంలో మహేశ్ గత కొన్నాళ్లుగా చికిత్స తీసుకుంటున్నారట. పైగా జర్మనీలో మహేశ్ బాబు ఉంటున్న బ్రెన్నర్స్ పార్క్ హోటల్‌లో నేచురోపతి వైద్య విభాగానికి హ్యారీ కోనిగ్ అధిపతిగా ఉన్నారట. అందుకే మహేశ్ బాబు– హ్యారీ కోనిగ్ క్యాజువల్‌గా కలిసి, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై చర్చించుకున్నారని, దీనిపై కంగారు పడాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. కాగా జర్మనీ నుంచి ఇండియాకి వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు మహేశ్‌బాబు.

బాలీవుడ్ అశ్వత్థామ ఎవరు?



అల్లు అర్జున్
ఎన్టీఆర్

మహాభారతం ఆధారంగా బాలీవుడ్‌లో 'ది ఇమ్మోర్టల్ అశ్వత్థామ' అనే మైథలాజికల్ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' ఫేమ్ దర్శకుడు ఆదిత్యా ధార్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ మూవీలో హీరోగా తొలుత విక్కీకౌశల్, రీసెంట్‌గా రణ్‌వీర్ సింగ్ పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా టాలీవుడ్ హీరోలు ఎన్టీఆర్, అల్లు అర్జున్ పేర్లను మేకర్స్ పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్. వారిద్దరిలో ఎవరో ఒకర్ని హీరోగా తీసుకునేందుకు పరిశీలిస్తున్నారా? లేక ఇద్దర్నీ ఈ సినిమాలో నటింపచేసేలా సంప్రదింపులు జరుపుతున్నారా? అనే విషయంపై ఓ స్పష్టత రావాల్సి ఉంది. రోనీ స్క్రూవాలా నిర్మించనున్న ఈ సినిమాను ఇటీవల జీ స్టూడియో టేకోవర్ చేసిందని బీటౌన్‌లో ప్రచారం సాగుతోంది. అదేవిధంగా ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు సమంత పేరు పరిశీలనలో ఉన్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. మరి.. 'ది ఇమ్మోర్టల్ అశ్వత్థామ' చిత్రంలో ఫైనల్‌గా ఎవరు హీరోగా నటిస్తారు? అనే విషయంపై ఓ క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.

పరాక్రమవంతుడు



సూర్య

సూర్య, దిశా పటానీ జంటగా, యోగిబాబు కీలక పాత్రలో శివ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై వంశీ, ప్రమోద్‌లతో కలిసి జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ సినిమాకు 'కంగువ' అనే టైటిల్‌ను ఖరారు చేసి, వచ్చే ఏడాది ప్రారంభంలో సినిమాని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ శివ మాట్లాడుతూ–''ఈ సినిమాలో సూర్య గంభీరంగా కనిపిస్తారు. 'కంగువ' మాకు ఎంతో ప్రత్యేకమైన చిత్రం. షూటింగ్‌ను పూర్తి చేసి, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు. ''త్రీడీలో పది భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాకు అన్ని భాషల ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేలా కామన్ టైటిల్ పెట్టాల్సి వచ్చింది. అందుకే అన్ని భాషల్లో 'కంగువ' టైటిల్‌ను ఫిక్స్ చేశాం. కంగువ అంటే అగ్నిశక్తి ఉన్న వ్యక్తి, పరాక్రమవంతుడు అనే అర్థాలు వస్తాయి. ఈ సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయ్యింది. మరో నెలలో బ్యాలన్స్ షూటింగ్ పూర్తి చేస్తాం. గ్రాఫిక్స్ వర్క్ ఎక్కువగా చేయాల్సి ఉంది.. దీంతో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కు ఎక్కువ సమయం పడుతుంది. అందుకే 2024 ప్రారంభంలో ఈ సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం''అని చిత్రయూనిట్ పేర్కొంది.

దేశభక్తి చిత్రాలను ఆదరించాలి

– వెంకయ్యనాయుడు

''దేశ సమైక్యత, భారతీయ సైనికుల వీరగాథ గురించి 'భారతీయన్స్' వంటి సినిమా తీయడం అభినందనీయం. ఇలాంటి మంచి దేశభక్తి చిత్రాలను యువత, ప్రేక్షకులు ఆదరించాలి'' అని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. నీరోజ్ పుచ్చా, సోనమ్ టెండప్, సుభా రంజన్, మహేందర్ బర్గాస్ హీరోలుగా, సమైరా సందు, రాజేశ్వరి చక్రవర్తి, పెడెన్ నాంగ్యాల్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భారతీయన్స్'. రచయిత దీన్ రాజ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారత్– అమెరికన్ క్రియేషన్స్‌పై డా.శంకర్ నాయుడు అడుసుమిల్లి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీమియర్‌ని వెంకయ్య నాయుడు వీక్షించి, యూనిట్‌ని అభినందించారు. డా.శంకర్ నాయుడు అడుసుమిల్లి మాట్లాడుతూ– ''భారతీయుల గుండెల్లో ఉన్న ఫిలాసఫీని 'భారతీయన్స్' ద్వారా గుర్తు చేస్తున్నాం. మే నెలలో అన్ని భాషల్లో సినిమా విడుదల చేస్తాం'' అన్నారు. ''ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించే చిత్రమిది'' అన్నారు దీనరాజ్. తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, నీరోజ్, సమైరా సందు తదితరులు మాట్లాడారు. ఈ సినిమాకు కెమెరా:జయపాల్ రెడ్డి నిమ్మల, సంగీతం: సత్య కశ్యప్– కపిల్ కుమార్.




శంకర్, వెంకయ్య నాయుడు, దీన్ రాజ్

కాంబినేషన్ సెట్?



దుల్కర్ సల్మాన్

'మహానటి', 'సీతారామం' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. అయితే ఆయన మరోసారి తెలుగులో ఓ స్ట్రయిట్ ఫిల్మ్ చేసేందుకు చర్చలు జరుగుతున్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇటీవల 'సార్'(తమిళంలో 'వాతి')తో హిట్ అందుకున్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. ఆయన తర్వాతి సినిమాలో దుల్కర్ హీరోగా నటిస్తారని టాక్. సితార ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. 'కింగ్ ఆఫ్ కోతా' చిత్రం షూటింగ్ పూర్తయిన తర్వాతే దుల్కర్–వెంకీ అట్లూరి కాంబినేషన్ సినిమా ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కాంబినేషన్‌పై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.



వెంకీ అట్లూరి

సీక్రెట్ మిషన్

తెలుగులో 'ఘాజీ', 'అంతరిక్షం 9000కేఎమ్‌పీహెచ్' వంటి చిత్రాలను తీసిన సంకల్ప్ రెడ్డి హిందీలో దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'ఐబీ 71'. విద్యుత్ జమాల్ హీరోగా నటించి, నిర్మించిన ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ ఓ లీడ్ రోల్ చేశారు. స్పై జానర్‌లో రూపొందిన ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి, చిత్రాన్ని మే 12న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''1971లో ఇండియా–పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. ఈ వార్‌లో భారతదేశం గెలవడానికి దేశ ఇంటెలిజెన్స్ బ్యూరో చేసిన ఓ సీక్రెట్ మిషన్ ఏ విధంగా దోహదపడింది? అనే అంశాల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించాం'' అని యూనిట్ పేర్కొంది.



విద్యుత్ జమాల్

షూటింగ్‌లో పాల్గొనడం సంతోషం

– సుష్మితాసేన్

''ప్రస్తుతం నా ఆరోగ్యం బాగానే ఉంది. 'ఆర్య 3' షూటింగ్ కోసం జైపూర్‌కు వచ్చాను. తిరిగి షూటింగ్స్‌లో పాల్గొనడం సంతోషంగా ఉంది'' అంటూ ఓ వీడియోను షేర్ చేశారు నటి సుష్మితాసేన్. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుండె నొప్పితో ఆసుపత్రిలో చేరిన సుష్మితాసేన్‌కు ఓ మేజర్ సర్జరీ జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి షూటింగ్స్‌కు కాస్త దూరంగా ఉంటున్న ఆమె ఇప్పుడు కోలుకుని షూటింగ్‌లో పాల్గొంటున్నారు. 'ఆర్య' వెబ్ సిరీస్‌లోని మూడో సీజన్ కోసం సుష్మితాసేన్ ప్రస్తుతం జైపూర్‌లో ఉన్నారు. ఈ విషయాన్ని ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. సుష్మితా సేన్ టైటిల్ రోల్ చేస్తున్న 'ఆర్య 3' వెబ్ సిరీస్‌కు రామ్‌మద్వానీ, సందీప్ మోది దర్శకత్వం వహిస్తున్నారు. డిస్నీప్లస్ హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్ రిలీజ్ డేట్‌పై త్వరలో ఓ స్పష్టత రానుంది. ఇక సుష్మితాసేన్ 'తాలి' అనే మరో వెబ్‌సిరీస్‌లో కూడా నటించిన సంగతి తెలిసిందే. ఇందులో తన పాత్ర డబ్బింగ్‌ని గత నెలలో పూర్తి చేశారామె.



నేను భగవంతుడు రా!



విమలా రామన్, జగపతిబాబు, మమతా మోహన్‌దాస్

'మై నేమ్ ఈజ్ భీం రావ్ దేశ్‌ముఖ్..' అనే జగపతిబాబు డైలాగ్‌తో 'రుద్రంగి' సినిమా టీజర్ విడుదలైంది. జగపతి బాబు, ఆశిష్ గాంధీ, మమతా మోహన్ దాస్, విమలా రామన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రుద్రంగి'. 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాలకు రైటర్‌గా పనిచేసిన అజయ్ సామ్రాట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రసమయి ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మిస్తున్న ఈ మూవీ మే 26న విడుదలకానుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. 'స్వాతంత్ర్యం అన్నది బానిసలకు కాదు.. అది మా కోసం', 'గాడు బలవంతుడే రా.. కానీ నేను భగవంతుడు రా..'(జగపతి బాబు), 'నీకు ఎదురు తిరిగిన మల్లేశ్‌గాడు ఖతం కావాలె(మమతా మోహన్ దాస్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. స్వాతంత్ర్యం తర్వాత ఆనాటి తెలంగాణ సాంఘిక పరిస్థితుల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు టీజర్‌లో కనిపిస్తోంది. ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ శనమోని, సంగీతం: నాఫల్ రాజా.



రుబ్లెవ్ ఖాతాలో తొలి 'మాస్టర్స్' టైటిల్

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో రష్యా ప్లేయర్ ఆంద్రీ రుబ్లెవ్ విజేతగా నిలిచాడు. మొనాకోలో ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్ రుబ్లెవ్ 5–7, 6–2, 7–5తో తొమ్మిదో ర్యాంకర్ హోల్గర్ రూనె (డెన్మార్క్)పై నెగ్గాడు. రుబ్లెవ్ కెరీర్‌లో ఇదే తొలి 'మాస్టర్స్' సిరీస్ టైటిల్ కావడం విశేషం. మూడో సెట్‌లో రుబ్లెవ్ 1–4తో వెనుకబడి పుంజుకున్నాడు. విజేత రుబ్లెవ్‌కు 8,92,590 యూరోల (రూ. 8 కోట్లు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

రంజీ ట్రోఫీ విజేతకు రూ. 5 కోట్లు



దేశవాళీ క్రికెట్ టోర్నీల ప్రైజ్‌మనీ మొత్తాన్ని బీసీసీఐ భారీగా పెంచింది. ఈ ఏడాది నుంచి రంజీ ట్రోఫీ చాంపియన్‌కు రూ. 2 కోట్లు బదులు రూ. 5 కోట్లు చెల్లిస్తారు. రన్నరప్ జట్టుకు రూ. 3 కోట్లు... సెమీఫైనల్లో ఓడిన రెండు జట్లకు రూ. 1 కోటి చొప్పున లభిస్తాయి. దులీప్ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ విజేతలకు రూ. 1 కోటి చొప్పున... ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ విజేతకు రూ. 80 లక్షలు లభిస్తాయి. సీనియర్ మహిళల వన్డే టోర్నీ చాంపియన్‌కు రూ. 50 లక్షలు... టి20 టోర్నీ విజేతకు రూ. 40 లక్షలు చెల్లిస్తారు.

ముంబై ఫటాఫట్...

- 17.4 ఓవర్లలోనే 186 పరుగుల లక్ష్య ఛేదన
- మెరిసిన ఇషాన్, సూర్యకుమార్
- కోల్‌కతాకు మూడో ఓటమి
- వెంకటేశ్ అయ్యర్ సెంచరీ వృథా

ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ తాజా ఐపీఎల్ సీజన్‌లో ఫామ్‌లోకి వచ్చేసింది. ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ముంబై... వరుసగా రెండో విజయంతో ప్రత్యర్థి జట్లకు ప్రమాద సంకేతాలు పంపించింది. సొంత మైదానంలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఇషాన్, సూర్య, తిలక్ వర్మ ధనాధన్ ఆటతో చెలరేగడంతో 186 పరుగుల భారీ లక్ష్యాన్ని ముంబై 14 బంతులు మిగిలి ఉండగానే అందుకుంది. అంతకుముందు కోల్‌కతా బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్ తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసినా చివరకు అతని వీరోచిత ప్రదర్శన వృథా అయింది.



ఇషాన్





ముంబై: లక్ష్యం పెద్దదైనా... ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ముంబై ఇండియన్స్ అనుకున్న ఫలితం సాధించింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆదివారం వాంఖెడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. అస్వస్థతతో ముంబై జట్టు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ బరిలోకి దిగకపోవడంతో సూర్యకుమార్ ఈ మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. టాస్ గెలిచిన సూర్య ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 185 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వెంకటేశ్ అయ్యర్ (51 బంతుల్లో 104; 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) ముంబై బౌలర్లను చితగ్గొట్టి సెంచరీ చేశాడు. అనంతరం ముంబై 17.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 186 పరుగులు సాధించి గెలిచింది. ఇషాన్ కిషన్ (25 బంతుల్లో 58; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), సూర్యకుమార్ (25 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో ముంబై విజయంలో కీలకపాత్ర పోషించారు. రోహిత్ శర్మ (13 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (25 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ డేవిడ్ (13 బంతుల్లో 24 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ ఈ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. గతంలో సచిన్ కూడా ముంబై ఇండియన్స్ తరఫునే ఆడటంతో ఐపీఎల్ టోర్నీ ఆడిన తండ్రీ, కొడుకులుగా సచిన్, అర్జున్ గుర్తింపు పొందారు. ఇదే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ప్లేయర్ దువాన్ జాన్సెన్ కూడా అరంగేట్రం చేశాడు. దువాన్ కవల సోదరుడు మార్కో జాన్సెన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్నాడు. ఐపీఎల్‌లో ఆడిన తొలి కవల సోదర ద్వయంగా మార్కో, దువాన్ గుర్తింపు పొందింది.

ఆరంభం నుంచే...

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై జట్టుకు బౌలర్ మెరిడిత్ స్థానంలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన రోహిత్ శర్మ, మరో ఓపెనర్ ఇషాన్ మెరుపు ఆరంభాన్నిచ్చారు. శార్దుల్ వేసిన రెండో ఓవర్లో ఇషాన్ 4,4,6 బాదగా... మొత్తం 16 పరుగులు వచ్చాయి. ఉమేశ్ యాదవ్ వేసిన మూడో ఓవర్లో రోహిత్ 4, ఇషాన్ 4,6తో చెలరేగగా... 17 పరుగులు వచ్చాయి. నరైన్ నాలుగో ఓవర్లో రోహిత్, ఇషాన్ ఏకంగా 22 పరుగులు రాబట్టారు. దాంతో ముంబై 4 ఓవర్లు పూర్తయ్యే సరికి 57/0తో నిలిచింది. స్పిన్నర్ సుయశ్ వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి సిక్స్ కొట్టిన రోహిత్ అదే ఓవర్ ఐదో బంతికి అవుటయ్యాడు. అనంతరం ఇషాన్‌తో సూర్య జతకలిశాడు. వీరిద్దరు అదే జోరును కొనసాగించారు. పవర్‌ప్లే ముగిసేసరికి ముంబై 72/1తో నిలిచింది. వరుణ్ చక్రవర్తి వేసిన ఏడో ఓవర్లో రెండో బంతిని సిక్స్‌గా మలిచిన ఇషాన్ తర్వాతి బంతికి బౌల్డయ్యాడు. ఎనిమిది ఓవర్లు పూర్తయ్యేసరికి ముంబై 90/2తో గెలుపుదిశగా సాగింది. ఇషాన్ అవుటయ్యాక క్రీజులోకి వచ్చిన తిలక్, సూర్యతో కలిసి ముంబైను ముందుకు నడిపించారు. ఫెర్గూసన్ వేసిన 11వ ఓవర్లో సూర్య రెండు సిక్స్‌లు కొట్టాడు. రసెల్ వేసిన 13వ ఓవర్లో సూర్య, తిలక్ 17 పరుగులు సాధించారు. ముంబై 13 ఓవర్లకే 147/2తో విజయానికి 39 పరుగుల దూరంలో నిలిచింది. సుయశ్ వేసిన 14వ ఓవర్లో తిలక్ వర్మ పెవిలియన్ చేరాడు. క్రీజులో వచ్చిన టిమ్ డేవిడ్ రెండు సిక్స్‌లతో తన ఉద్దేశాన్ని చాటి చెప్పాడు. ముంబై గెలుపునకు 10 పరుగులు ఉన్నాయనగా సూర్య.. ఆ తర్వాత వధేరా అవుటైనా టిమ్ డేవిడ్ మిగతా పనిని పూర్తి చేశాడు.

2008 తర్వాత...

అంతకుముందు వెంకటేశ్ అయ్యర్ అద్భుత ఇన్నింగ్స్‌తో 2008 ఐపీఎల్ తొలి సీజన్ తర్వాత మళ్లీ ఈ టోర్నీలో కోల్‌కతా బ్యాటర్ సెంచరీని నమోదు చేయడం విశేషం. 2008లో బెంగళూరుతో జరిగిన ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో బ్రెండన్ మెకల్లమ్ (158 నాటౌట్; 10 ఫోర్లు, 13 సిక్స్‌లు) భారీ సెంచరీ చేశాడు. కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఒకవైపు వికెట్లు పడుతున్నా...మరోవైపు వెంకటేశ్ ఒక్కడే పోరాటం చేశాడు. ఫోర్లు, సిక్స్‌లతో అదరగొట్టాడు. 49 బంతుల్లో అతను సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో మెరిడిత్ బౌలింగ్‌లో స్కూప్ షాట్ కొట్టిన వెంకటేశ్ షార్ట్ థర్డ్‌మ్యాన్ వద్ద జాన్సెన్ చేతికి చిక్కి పెవిలియన్ చేరాడు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) జాన్సెన్ (బి) చావ్లా 8; జగదీశన్ (సి) షోకీన్ (బి) గ్రీన్ 0; వెంకటేశ్ అయ్యర్ (సి) జాన్సెన్ (బి) మెరిడిత్ 104; నితీశ్ రాణా (సి) రమణ్‌దీప్ సింగ్ (సబ్) (బి) షోకీన్ 5; శార్దుల్ ఠాకూర్ (సి) తిలక్ వర్మ (బి) షోకీన్ 13; రింకూ సింగ్ (సి) నేహల్ వధేరా (బి) జాన్సెన్ 18; రసెల్ (నాటౌట్) 21; నరైన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 185. వికెట్ల పతనం:** 1–11, 2–57, 3–73, 4–123, 5–159, 6–172. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 2–0–17–0, కామెరాన్ గ్రీన్ 2–0–20–1, దువాన్ జాన్సెన్ 4–0–53–1, పీయూష్ చావ్లా 4–0–19–1, హృతిక్ షోకీన్ 4–0–34–2, మెరిడిత్ 4–0–40–1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఉమేశ్ యాదవ్ (బి) సుయశ్ 20; ఇషాన్ కిషన్ (బి) వరుణ్ 58; సూర్యకుమార్ యాదవ్ (సి) గుర్బాజ్ (బి) శార్దుల్ 43; తిలక్ వర్మ (బి) సుయశ్ 30; టిమ్ డేవిడ్ (నాటౌట్) 24; నేహల్ వధేరా (సి) గుర్బాజ్ (బి) ఫెర్గూసన్ 6; గ్రీన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.4 ఓవర్లలో 5 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1–65, 2–87, 3–147, 4–176, 5–184. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 2–0–19–0, శార్దుల్ ఠాకూర్ 2–0–25–1, సునీల్ నరైన్ 3–0–41–0, సుయశ్ శర్మ 4–0–27–2, వరుణ్ చక్రవర్తి 4–0–38–1, ఫెర్గూసన్ 1.4–0–19–1, రసెల్ 1–0–17–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	1.354
లక్నో	5	3	2	6	0.761
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
కోల్‌కతా	5	2	3	4	0.320
చెన్నై	4	2	2	4	0.225
బెంగళూరు	4	2	2	4	-0.316
ముంబై	4	2	2	4	-0.389
హైదరాబాద్	4	2	2	4	-0.822
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

హెట్‌మైర్ తడాఖా...

- 26 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 56 నాటౌట్
- గుజరాత్‌కు రాయల్స్ షాక్
- సామ్సన్ కెప్టెన్ ఇన్నింగ్స్



హెట్‌మైర్

అహ్మదాబాద్: ప్రత్యర్థి ఏదైనా... పరిస్థితి ఎలా ఉన్నా... ఆశ కోల్పోకుండా పట్టుదలతో పోరాడితే విజయం సాధ్యమేనని రాజస్తాన్ రాయల్స్ జట్టు నిరూపించింది. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. గుజరాత్ నిర్దేశించిన 178 పరుగుల లక్ష్యాన్ని రాజస్తాన్ 19.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తద్వారా గత ఏడాది ఐపీఎల్ ఫైనల్లో గుజరాత్ చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. కెప్టెన్ సంజూ సామ్సన్ (32 బంతుల్లో 60; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెట్‌మైర్ (26 బంతుల్లో 56 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో రాజస్తాన్ విజయంలో ముఖ్యపాత్ర పోషించారు. చివరి ఓవర్లో రాజస్తాన్ నెగ్గేందుకు 7 పరుగులు అవసరం కాగా... తొలి బంతికి 2 పరుగులు తీసిన హెట్‌మైర్, రెండో బంతిని సిక్స్‌గా మలిచి రాజస్తాన్‌ను విజయతీరానికి చేర్చాడు. ఒకదశలో రాజస్తాన్ 55 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. అయితే సామ్సన్, హెట్‌మైర్ రాజస్తాన్‌ను ఆదుకున్నారు. ముఖ్యంగా సామ్సన్ గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి సిక్సర్లతో చెలరేగిపోయాడు. రషీద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్లో సామ్సన్ వరుసగా మూడు సిక్స్‌లు కొట్టాడు. 15వ ఓవర్ చివరి బంతికి నూర్ అహ్మద్ బౌలింగ్‌లో సామ్సన్ అవుటయ్యాడు. దాంతో ఐదో వికెట్‌కు 27 బంతుల్లో 59 పరుగుల సామ్సన్, హెట్‌మైర్ భాగస్వామ్యానికి తెర పడింది. అప్పటికి రాజస్తాన్ గెలిచేందుకు 5 ఓవర్లలో 64 పరుగులు చేయాలి. సామ్సన్ అవుటయ్యాక వచ్చిన ధ్రువ్ జురేల్ (10 బంతుల్లో 18; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిగా ఆడాడు. రాజస్తాన్ గెలిచేందుకు 2 ఓవర్లలో 23 పరుగులు అవసరంకాగా... షమీ వేసిన 19వ ఓవర్ తొలి బంతిని ధ్రువ్ సిక్స్‌గా మలిచి తర్వాతి బంతికి అవుటయ్యాడు. వచ్చీరాగానే అశ్విన్ (3 బంతుల్లో 10) 4, 6 కొట్టి పెవిలియన్ చేరాడు. చివరి ఓవర్లో హెట్‌మైర్ మిగతా పనిని పూర్తి చేశాడు. అంతకుముందు గుజరాత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 177 పరుగులు సాధించింది. గిల్ (34 బంతుల్లో 45; 4 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (30 బంతుల్లో 46; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.



సామ్సన్

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి అండ్ బి) బౌల్ట్ 4; గిల్ (సి) బట్లర్ (బి) సందీప్ శర్మ 45; సాయి సుదర్శన్ (రనౌట్) 20; హార్దిక్ పాండ్యా (సి) యశస్వి (బి) చహల్ 28; డేవిడ్ మిల్లర్ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ శర్మ 46; అభినవ్ మనోహర్ (సి) పడిక్కల్ (బి) జంపా 27; తెవాటియా (నాటౌట్) 1; రషీద్ ఖాన్ (రనౌట్) 1; అల్జారి జోసెఫ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1–5, 2–32, 3–91, 4–121, 5–166, 6–175, 7–176. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–46–1, సందీప్ శర్మ 4–0–25–2, జంపా 4–0–32–1, అశ్విన్ 4–0–37–0, చహల్ 4–0–36–1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) గిల్ (బి) హార్దిక్ 1; బట్లర్ (బి) షమీ 0; పడిక్కల్ (సి) మోహిత్ శర్మ (బి) రషీద్ ఖాన్ 26; సంజూ సామ్సన్ (సి) మిల్లర్ (బి) నూర్ అహ్మద్ 60; రియాన్ పరాగ్ (సి) మిల్లర్ (బి) రషీద్ ఖాన్ 5; హెట్‌మైర్ (నాటౌట్) 56; ధ్రువ్ జురేల్ (సి) మోహిత్ శర్మ (బి) షమీ 18; అశ్విన్ (సి) తెవాటియా (బి) షమీ 10; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (19.2 ఓవర్లలో 7 వికెట్లకు) 179. వికెట్ల పతనం:** 1–2, 2–4, 3–47, 4–55, 5–114, 6–161, 7–171. **బౌలింగ్:** షమీ 4–1–25–3, హార్దిక్ పాండ్యా 4–0–24–1, అల్జారి జోసెఫ్ 3–0–47–0, రషీద్ ఖాన్ 4–0–46–2, మోహిత్ శర్మ 2–0–7–0, నూర్ అహ్మద్ 2.2–0–29–1.

భవిత
టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.
• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, న్యూఢిల్లీలో 3055 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(నార్‌సెట్)–4 నోటిఫికేషన్ విడుదలైంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3055
» **సంస్థల వారీగా ఖాళీల వివరాలు:** ఎయిమ్స్ భటిండా–142, ఎయిమ్స్ భోపాల్–51, ఎయిమ్స్ భువనేశ్వర్–169, ఎయిమ్స్ బీబీనగర్–150, ఎయిమ్స్ బిలాస్‌పూర్–178, ఎయిమ్స్ దేవ్‌ఘర్–100, ఎయిమ్స్ గోరఖ్‌పూర్–121, ఎయిమ్స్ జోధ్‌పూర్–300, ఎయిమ్స్ కల్యాణి–24, ఎయిమ్స్ మంగళగిరి –117, ఎయిమ్స్ నాగ్‌పూర్–87, ఎయిమ్స్ రాయ్‌బరేలీ–77, ఎయిమ్స్ న్యూఢిల్లీ–620, ఎయిమ్స్ పాట్నా–200, ఎయిమ్స్ రాయ్‌పూర్–150, ఎయిమ్స్ రాజ్‌కోట్–100, ఎయిమ్స్ రిషికేశ్–289, ఎయిమ్స్ విజయ్‌పూర్–180.
» **అర్హత:** డిప్లొమా(జీఎన్‌ఎం)తోపాటు రెండేళ్ల పని అనుభవం లేదా బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికేట్)/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సులుగా రిజిస్టరై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు,ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.9300 నుంచి రూ.34,800తోపాటు రూ.4600 గ్రేడ్ పే అందుతుంది.
» **ఎంపిక విధానం:** నార్‌సెట్–4 స్కోరు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పరీక్ష వ్యవధి 3 గంటలు. ఆబ్జెక్టివ్ విధానంలో 200 ప్రశ్నలు– 200 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. సబ్జెక్టుకు సంబంధించి 180 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి 20 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కులు కోత విధిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.05.2023
» **సీబీటీ పరీక్ష తేది:** 03.06.2023.
» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

పది తర్వాత దూసుకుపోయేలా..!

» పదో తరగతి తర్వాత అనేక మార్గాలు
» ఎక్కువ మంది చేరేది ఇంటర్మీడియెట్
» టెక్నికల్ విభాగాల్లో ఉపాధికి పాలిటెక్నిక్, ఐటీఐ
» ఆసక్తి, సామర్థ్యం ఆధారంగా కోర్సు ఎంపిక ముఖ్యం



భవిష్యత్తుకు టర్నింగ్ పాయింట్.. టెన్త్‌క్లాస్! పదో తరగతి తర్వాత ఎంచుకునే కోర్సు భవితకు దారి చూపుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని లక్షల మంది విద్యార్థులు ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసారు. ఇప్పుడు వీరంతా.. పది తర్వాత ఏం చేయాలి అనే అన్వేషణలో పడ్డారు. ఏ కోర్సులో చేరాలి.. తమకు సరైన కోర్సు ఏది.. ఏ కోర్సులో చేరితే మెరుగైన ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.. ఇలా వారికి ఎన్నో సందేహాలు! ఈ నేపథ్యంలో..పదో తరగతి తర్వాత అందుబాటులో ఉన్న మార్గాలు, భవిష్యత్ అవకాశాలు, కోర్సు ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వివరాలు..

ఇంటర్మీడియెట్.. పదో తరగతి ఉత్తీర్ణుల్లో అధిక శాతమంది చేరే కోర్సు ఇది. ఇంటర్మీడియెట్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ, అగ్రికల్చర్ డిప్లొమాలు, ఒకేషనల్ కోర్సులు.. ఇలా ఎన్నో కోర్సుల్లో చేరే అవకాశముంది. కాబట్టి విద్యార్థులు వీటిపైనా దృష్టి సారించాలి. కోర్సు ఎంపికలో విద్యార్థులు తమ వ్యక్తిగత ఆసక్తి, అకడమిక్ సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇంటర్.. ప్రతి గ్రూప్ ప్రత్యేకమే

పదో తరగతి తర్వాత ఎక్కువ మంది చేరే ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ గ్రూప్‌లు ఉన్నాయి. వీటిల్లో ప్రతి గ్రూప్ దేనికదే ఎంతో ప్రత్యేకమైనది. అధిక శాతం మంది విద్యార్థులు ఎంపీసీలో చేరుతుంటారు. ఆ తర్వాతి స్థానంలో బైపీసీ ఉంటుంది. సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీల తోనూ భవిష్యత్తులో మంచి అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది. అదే విధంగా సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు అందించే ఒకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఇంజనీరింగ్‌కు మార్గం.. ఎంపీసీ

ఎంపీసీ గ్రూప్‌లో ప్రధాన సబ్జెక్టులు మ్యాథమెటిక్స్,ఫిజిక్స్, కెమిస్ట్రీ. ఈ గ్రూప్ అర్హత ఆధారంగా ఎంసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్ తదితర ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఇంజనీరింగ్ కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చు. భవిష్యత్తులో సైన్స్ రంగంలో స్థిరపడాలనుకుంటే.. ఇంటర్ ఎంపీసీ తర్వాత బీఎస్సీ వంటి కోర్సుల్లో చేరే వీలుంది. ఎంపీసీ విద్యార్థులు ఇంటర్ తర్వాత ఎన్‌డీఏ, 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీం వంటి పరీక్షల ద్వారా డిఫెన్స్ రంగంలో కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చు. ఎంపీసీ విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్ కోర్సులే కాకుండా..ఆర్ట్స్, హ్యుమానిటీస్, లా సంబంధిత కోర్సుల్లోనూ చేరే అవకాశముంది. ఎంపీసీలో చేరే విద్యార్థులకు సహజంగా కొన్ని లక్షణాలు ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు. అవి.. కంప్యుటేషనల్ స్కిల్స్, న్యూమరికల్ స్కిల్స్. దీంతోపాటు మన కళ్ల ముందు కనిపించే మెకానికల్, ఎల్రక్టానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్ వంటి పరికరాల పనితీరును తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న వారు ఎంపీసీ గ్రూప్‌నకు సరితూగుతారని చెబుతున్నారు.

మెడిసిన్‌కు దారి.. బైపీసీ

బైపీసీలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులు. ఇంటర్ బైపీసీ విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ యూజీ పరీక్షలో ర్యాంకు ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర మెడిసిన్, అనుబంధ కోర్సుల్లో చేరే అవకాశముంది.

- రాష్ట్ర స్థాయిలో టీఎస్ ఎంసెట్, ఏపీ ఏఈఏపీసెట్‌లలో ఉత్తీర్ణత సాధించి వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ సైన్స్ వంటి విభాగాల్లోనూ బ్యాచిలర్ డిగ్రీ, ఆ తర్వాత పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశముంది.
- ఇంటర్మీడియెట్ బైపీసీ అర్హతతో బీజెడ్‌సీలో అడుగుపెట్టొచ్చు.ఇప్పుడు బీజెడ్‌సీలోనూ బయో ఇన్ఫర్మాటిక్స్, బయోటెక్, హ్యూమన్ జెనెటిక్స్, జెనెటిక్స్ వంటి వినూత్న సబ్జెక్టులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. ఫార్మా, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తాయి.
- బైపీసీని ఎంపిక చేసుకునే ముందు వ్యక్తిగతంగా కొన్ని అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. అవి..లైఫ్ సైన్సెస్‌పై సహజ ఆసక్తి, పర్యావరణ స్పృహ వంటివి. దీంతోపాటు సహనం, ఓర్పు అనేవి బైపీసీ విద్యార్థులకు ఉండాల్సిన ఇతర ముఖ్య లక్షణాలు.

సీఈసీతో కార్పొరేట్ కెరీర్

- భవిష్యత్తులో కార్పొరేట్ రంగంలో కెరీర్ కోరుకుంటే.. అందుకు చక్కటి మార్గంగా నిలుస్తున్న గ్రూప్.. సీఈసీ. ఈ గ్రూప్ కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్ట్‌ల కలయికగా ఉంటుంది.
- సీఈసీ విద్యార్థులకు ఉన్నత విద్య పరంగా బీకాం ముఖ్య మార్గంగా నిలుస్తోంది. బీకాం చదువుతూనే చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ వంటి కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకోవచ్చు. తద్వారా కార్పొరేట్ కంపెనీల్లో ఇంటర్నల్ ఆడిటర్స్, స్టాక్ ఆడిటర్స్, ఫైనాన్షియల్ మేనేజర్స్, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీస్ వంటి వైట్ కాలర్ ఉద్యోగాలు సొంత చేసుకోవచ్చు.
- బ్యాచిలర్ డిగ్రీ బీకామ్ తర్వాత.. పీజీ స్థాయిలో ఎంకామ్, ఎంబీఏల్లో చేరొచ్చు. -ఐఐఎంలు, ఇతర ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఎంబీఏ కోసం క్యాట్, మ్యాట్, సీమ్యాట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- కాలిక్యులేషన్ స్కిల్స్, గణాంకాల విశ్లేషణ నైపుణ్యాలు, సూక్ష్మ స్థాయి పరిశీలన నైపుణ్యాలుంటే.. సీఈసీ గ్రూప్‌లో సులభంగా రాణించొచ్చు.

ఎంఈసీతో.. విస్తృత అవకాశాలు

- ఎంఈసీలో మ్యాథమెటిక్స్,ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులు ఉంటాయి. ఈ గ్రూప్‌తో ఇంటర్ పూర్తి చేస్తే..ఇటు మ్యాథమెటిక్స్ అర్హతగా బీఎస్సీ.. అటు కామర్స్ అర్హతగా బీకాం..ఇలా రెండు మార్గాలు అందుబాటులోకి వస్తాయి. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులో చేరే వీలుంటుంది.
- ఎంఈసీతో ముఖ్యంగా చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ కోర్సుల్లో రాణించే అవకాశం లభిస్తుంది. కంప్యుటేషనల్, కాలిక్యులేషనల్ స్కిల్స్ ఉన్న విద్యార్థులు ఈ గ్రూప్‌నకు సరితూగుతారు.

పోటీ పరీక్షలకు హెచ్‌ఈసీ

- సివిల్స్,గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల్లో ముందంజలో నిలిపే గ్రూప్‌గా హెచ్‌ఈసీకి పేరుంది. హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌లు. వీటిపై పట్టు సాధించడం ద్వారా పలు ఉద్యోగ పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించొచ్చు.
- హెచ్‌ఈసీ అర్హతగా ప్రవేశం లభించే బీఏలోనూ జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు సొంతం చేసుకోవచ్చు.

అకడమిక్ నైపుణ్యాలకు ఆర్‌జేసీ

- ఇంటర్మీడియెట్ స్థాయిలో అకడమిక్ నైపుణ్యాలను మెరుగుపరచుకొని పోటీ ప్రపంచంలో ముందంజలో నిలిచేందుకు చక్కటి వేదికలు.. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్‌లు. వీటిలో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఆర్‌జేసీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఈ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన వారికి రెసిడెన్షియల్ విధానంలో బోధన ఉంటుంది. విద్యార్థులను ఎంసెట్, సీఏ సీపీటీ తదితర ప్రవేశ పరీక్షలకు సన్నద్ధులను చేసే విధంగా ప్రత్యేక శిక్షణసైతం లభిస్తుంది.
- తెలంగాణ రాష్ట్రంలో..తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా టీఎస్‌ఆర్‌జేసీ సెట్ నిర్వహిస్తారు. ప్రస్తుతం 2023–24 ప్రవేశాలకు సంబంధించి టీఎస్ ఆర్‌జేసీ–సెట్–2023 ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 35 కళాశాలల్లో ప్రవేశానికి టీఎస్‌ఆర్‌జేసీ–సెట్–2023ను మే 6న నిర్వహించనున్నారు. వివరాలకు వెబ్‌సైట్: https://tsrjdc.cgg.gov.in
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో.. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం పది కళాశాలల్లో(గత ఏడాది గణాంకాల ప్రకారం) ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ సెట్‌ను నిర్వహిస్తారు. ఈ సెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. ప్రవేశం ఖరారవుతుంది.
- 2023 ప్రవేశాలకు సంబంధించి ఏపీఆర్‌జేసీ సెట్ తేదీలు వెలువడ్డాయి. విద్యార్థులు ఏప్రిల్ 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రన్స్‌ను మే 20న నిర్వహిస్తారు. వివరాలకు వెబ్‌సైట్: https://aprs.apcfss.in/indexinter.jsp

ఒకేషనల్ కోర్సులు.. ఉపాధి వేదికలు

- ఇంటర్మీడియెట్ తర్వాత సత్వరం ఉపాధి కోరుకునే వారికి మార్గం.. ఒకేషనల్ కోర్సులు. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌షిప్ నుంచి ఆటోమొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ వరకూ.. టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో నైపుణ్యాలు అందించే కోర్సులు ఇవి. -ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్మీడియెట్ బోర్డ్‌లు.. అగ్రికల్చర్; బిజినెస్ అండ్ కామర్స్; ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ; హోం సైన్స్; హ్యుమానిటీస్; పారా మెడికల్ విభాగాల్లో మొత్తం 27 ఒకేషనల్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా సంబంధిత రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చు.
- ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలోని ఆటోమొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ వైరింగ్ అండ్ సర్వీసింగ్ ఆఫ్ ఎలక్ట్రికల్ అప్లయన్సెస్; రూరల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేస్తే..ఎలాంటి ప్రవేశ పరీక్షలు అవసరం లేకుండానే సంబంధిత బ్రాంచ్‌లో నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరొచ్చు.

సాంకేతిక విద్యకు కేరాఫ్.. పాలిటెక్నిక్

- భవిష్యత్తులో ఇంజనీరింగ్ విభాగంలో రాణించాలనుకునే విద్యార్థులకు చక్కటి మార్గం.. పాలిటెక్నిక్స్. మూడు, మూడున్నరేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎల్రక్టానిక్స్, కంప్యూటర్స్, కెమికల్, మెటలర్జీ.. ఇలా అనేక బ్రాంచ్‌లు ఉంటాయి.
- ఈ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల ఉత్తీర్ణులు పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.
- పాలిటెక్నిక్ డిప్లొమా అర్హతతో ఈసెట్‌లో ర్యాంకు ఆధారంగా లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడుగు పెట్టే అవకాశం లభిస్తుంది.
- ఆంధ్రప్రదేశ్‌లో 2023–24 ప్రవేశాలకు సంబంధించి ఏపీ పాలిసెట్ నోటిఫికేషన్ వెలువడింది. మే 10న ఏపీ పాలిసెట్‌ను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. **వివరాలకు వెబ్‌సైట్: https://polycetap.nic.in**
- తెలంగాణ పాలిసెట్–2023 ప్రక్రియ కూడా కొనసాగుతోంది. మే 17న టీఎస్ పాలిసెట్‌ను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 24 వరకు, రూ.100 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. **వివరాలకు వెబ్‌సైట్: https://polycet. sbtet.telangana.gov.in**

ఐటీఐతో.. సత్వర ఉపాధి

పదో తరగతి అర్హతగా వృత్తి విద్య శిక్షణ, స్వయం ఉపాధికి మార్గం.. ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్స్(ఐటీఐ). నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రెనింగ్ పరిధిలోని ఐటీఐల్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్ ఎయిర్ కండిషనింగ్ తదితర పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకు సాధారణంగా ఏప్రిల్ నెలలో నోటిఫికేషన్ వెలువడుతుంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రెనింగ్ పరిధిలో ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న ప్రాంతీయ ఒకేషనల్ ట్రెనింగ్ కౌన్సిల్స్ ఈ ప్రవేశ ప్రక్రియలను నిర్వహిస్తాయి. ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత పారిశ్రామిక సంస్థల్లో ఎంట్రీ లెవల్లో టెక్నీషియన్స్‌గా అడుగు పెట్టొచ్చు. అదే విధంగా అప్రెంటీస్ షిప్ పూర్తి చేసుకుని ఎన్‌సీవీటీ సర్టిఫికెట్ పొందితే ఉద్యోగ సాధనలో ముందంజలో ఉండొచ్చు.

అగ్రి పాలిటెక్నిక్స్

గ్రామీణ యువత స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రత్యేకంగా నెలకొల్పిన ఇన్‌స్టిట్యూట్‌లు..అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్. వీటిలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డిప్లొమా ముఖ్యమైనవి. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ కోర్సుల కాల వ్యవధి రెండేళ్లు. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. వ్యవసాయ డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన వారికి ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సంస్థలు వంటివాటిలో ఉద్యోగాలు లభిస్తాయి.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 38	నిఫ్టీ ▲ 16
60,431	17,828

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	12,123	▽	43
డోజోన్స్	33,886	▽	143
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,872	▲	29
డాక్స్	15,808	▲	78
షాంఘై	3,338	▲	20
నికాయ్	28,493	▲	337

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

ఆరోగ్య బీమా.. పోర్టింగ్‌తో ధీమా!

బీమా సంస్థ సేవల్లో రాజీ పడక్కర్లేదు • మెరుగైన సేవలు అందించే చోటకు వెళ్లొచ్చు
సమగ్ర కవరేజీతో ఉంటే ఆకర్షణీయం • రూమ్‌ రెంట్, ఇతర ఉప పరిమితులు ఉండొద్దు
రెన్యువల్‌కు 60 రోజుల ముందు సంప్రదించాలి

క్లెయిమ్‌ పరిష్కారాల్లో జాప్యం, ఏదో రకమైన కొర్రీ పెట్టి తక్కువ పరిహారాన్ని చెల్లించడం, అధిక ప్రీమియం వసూలు లేదా నాసిరకమైన సేవలతో సరిపెట్టడం.. ఇలా ఎన్నో కారణాలతో పాలసీదారులు ఇబ్బంది పడుతున్నారన్నది వాస్తవం. వైద్య రంగంలో ద్రవ్యోల్బణం అధికంగా ఉంటోంది. దీంతో చికిత్సల వ్యయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. అత్యాధునిక టెక్నాలజీ ఫలితంగా ఎన్నో సర్జరీలకు హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం ఏర్పడడం లేదు. అదే రోజు డిశ్చార్జ్‌ అయి వెళ్లొచ్చు. ఒకవైపు ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తున్నప్పటికీ.. మరోవైపు జీవనశైలి వ్యాధులతో ఔట్‌ పేషెంట్‌ సేవల అవసరం పెరుగుతోంది. మారుతున్న ఈ అవసరాలు అన్నీ మన ఆరోగ్య బీమా కవరేజీలో భాగంగా ఉన్నప్పుడు అనుకున్న ప్రయోజనం నెరవేరుతుంది. అందుకే సమగ్రమైన హెల్త్‌ కవరేజీతో ఇన్సూరెన్స్‌ పాలసీ ఉండాలి. ఇప్పటికే తీసుకున్న పాలసీ సమగ్ర కవరేజీకి భరోసా ఇవ్వనట్టయితే.. చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తుంటే, బీమా సంస్థ సేవలు సంతృప్తికరంగా లేకపోతే, ప్రీమియం భారంగా మారితే అప్పుడు మన ముందు రెండు రకాల ఆప్షన్లు ఉన్నాయి. ఒకటి బీమా సంస్థను మార్చడం. లేదంటే ప్రస్తుత సంస్థలోనే మెరుగైన ప్లాన్‌కు మారిపోవడం (మైగ్రేషన్‌). వీటి గురించి తెలుసుకుందాం.

ప్రస్తుతం మీ హెల్త్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీ సేవల పట్ల సంతృప్తిగానే ఉండి, పాలసీలోని కవరేజీ ఫీచర్లు, ప్రీమియం విషయంలో సంతృప్తిగా లేకపోతే అప్పుడు మీ ప్లాన్‌ను పోర్టింగ్‌ పెట్టుకోవడానికి బదులు, అదే బీమా సంస్థలో మెరుగైన ఫీచర్లతో కూడిన మరో ప్లాన్‌ను మైగ్రేట్‌ అవ్వడం మంచి నిర్ణయం అవుతుంది. పోర్టింగ్‌ అంటే ప్రస్తుత బీమా సంస్థను వీడి, మరో బీమా సంస్థకు మారిపోవడం. మైగ్రేషన్‌ అంటే ప్రస్తుత బీమా సంస్థలోనే మరో ప్లాన్‌కు మారిపోవడం. ''హెల్త్‌ ఇన్సూరెన్స్‌ నిబంధనల కింద ఒక వ్యక్తి తన పాలసీని ఎలాంటి బ్రేక్‌ లేకుండా వరుసగా నాలుగేళ్ల పాటు రెన్యువల్‌ చేసుకుంటే, అప్పుడు ప్రస్తుత బీమా ప్లాన్‌ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా మైగ్రేషన్‌కు అర్హత లభిస్తుంది''అని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్‌ ఇన్సూరెన్స్‌ రిటైల్‌ బిజినెస్‌ ప్రెసిడెంట్‌ పార్థానిల్‌ ఘోష్‌ తెలిపారు.

ఎప్పుడు మార్చుకోవాలి..?

''కస్టమర్లు ప్రస్తుత హెల్త్‌ ప్లాన్‌ కవరేజీ పట్ల అసంతృప్తితో ఉంటే లేదా ప్రస్తుత బీమా సంస్థ సేవలు నచ్చకపోతే లేదా సమగ్రమైన, వినూత్నమైన బీమా పాలసీ అందుబాటు ప్రీమియానికి లభిస్తుంటే పోర్ట్‌ పెట్టుకోవచ్చు. కాకపోతే నూతన పాలసీ ప్రయోజనాలు, నూతన సంస్థ సేవల సదుపాయాలను ప్రధానంగా చూడాలి''అని షా సూచించారు. ''మార్కెట్లో ఉన్న ప్రతీ నూతన ఉత్పత్తి అందరికీ సరిపోకపోవచ్చు. వేరొక సంస్థలోని ప్లాన్‌లో ఉన్న ఆకర్షణీయమైన ఫీచర్లను చూసి మారిపోవడం సరికాదు. మీ అవసరాలు, కుటుంబ సభ్యులు, వయసు తదితర అంశాల ఆధారంగా కొత్త ఉత్పత్తిని మదింపు వేయాలి''అని నివాబూపా హెల్త్‌ ఇన్సూరెన్స్‌ అండర్‌ రైటింగ్‌ డైరెక్టర్‌ బబతోష్‌ మిశ్రా పేర్కొన్నారు. ప్రస్తుత బీమా సంస్థ సేవలు సంతృప్తికరంగా లేకపోయినా, కస్టమర్‌ సేవలు నచ్చకపోయినా, ప్రస్తుత బీమా సంస్థ అందిస్తున్న సేవలు నాసిరకంగా ఉన్నా, సరైన కారణాలు చూపకుండా క్లెయిమ్‌ను తిరస్కరించినా అప్పుడు మారిపోవడాన్ని పరిశీలించొచ్చని యూనివర్సల్‌ సోంపో జనరల్‌ ఇన్సూరెన్స్‌ ఎండీ, సీఈవో శరద్‌ మాథుర్‌ సూచించారు. సరైన సమాచారం పొందలేకపోవడం, పారదర్శకత లేమి, కంపెనీ నుంచి సత్వర స్పందన లేకపోవడం, విలువ ఆధారిత సేవలు లేకపోయినా పోర్టింగ్‌ను పరిశీలించొచ్చని తెలిపారు. ఇప్పటికే బీమా పాలసీ ఉండి, అందులోని నిబంధనల వల్ల సొంతంగా చెల్లింపులు చేసుకోవాల్సి వస్తుంటే, రూమ్‌ రెంట్‌ పరంగా ఉప పరిమితులు ఉంటే, మీకు దీర్ఘకాలిక వ్యాధి ఉండి ఓపీడీ లేదా డేకేర్‌ కవరేజీ లేకపోతే, మీ ప్లాన్‌లో రీస్టోరేషన్‌ (బీమా ఖర్చయితే తిరిగి పునరుద్ధరించడం) ఫీచర్‌ లేకపోయినా, ముందు నుంచి ఉన్న వ్యాధులకు దీర్ఘకాలం వెయిటింగ్‌ పీరియడ్‌ ఉన్నా, అప్పుడు మీ వంతు ఎక్కువ చెల్లించాల్సి రావచ్చు. దీనికి బదులు వేరొక ప్లాన్‌కు మారిపోవడమే నయం. ఉదాహరణకు నివాబూపా సంస్థ రెండు గంటలకు మించి హాస్పిటలైజేషన్‌ అయితే చాలు చెల్లింపులు చేస్తోంది. అదే ఆదిత్య బిర్లా సంస్థ అయితే ఆరోగ్యకర జీవనశైలిని (కంపెనీ చెప్పినట్టు) అనుసరిస్తే అప్పుడు ప్రీమియంలో నూరు శాతం వరకు రాయితీని ఆఫర్‌ చేస్తోంది. సాధారణంగా పోర్టింగ్‌ లేదా మైగ్రేషన్‌కు ప్రీమియం ఒక్కటినే ప్రామాణికంగా తీసుకోవద్దు. ఎందుకంటే అన్ని బీమా సంస్థలు కొన్నేళ్లకోసారి ప్రీమియంను సవరిస్తుంటాయి. అలాగే వయసు వారీగా కూడా ప్రీమియం పెంపు ఉంటుంది. అలాగే, బీమా కవరేజీని పెంచుకునేందుకు సైతం పోర్టింగ్‌ సరికాదు. దీనికి బదులు టాపప్‌ లేదా సూపర్‌ టాపప్‌ రూపంలో అదనపు కవరేజీని యాక్టివేట్‌ చేసుకోవచ్చు. బేసిక్‌ ప్లాన్‌ కవరేజీకి మించి క్లెయిమ్‌ వచ్చిన సందర్భాల్లోనే టాపప్, సూపర్‌ టాపప్‌ చెల్లింపులు చేస్తాయి.

హైదరాబాద్‌కు చెందిన క్రాంతి కుమార్‌ గతేడాది అత్యవసరంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. సింగిల్‌ ఏసీ రూమ్‌ను ఆయన ఆసుపత్రిలో తీసుకున్నారు. మూడు రోజులకు కలిపి రూ.88,000 బిల్లు వచ్చింది. అతడికి రూ.4 లక్షల హెల్త్‌ ఇన్సూరెన్స్‌ కవరేజీ ఉండడంతో నిశ్చింతగా ఉన్నాడు. కానీ, బీమా సంస్థ నుంచి పూర్తి పరిహారం అందలేదు. క్రాంతి తన వంతుగా రూ.33,000ను చెల్లించాల్సి వచ్చింది. అదేమని ప్రశ్నించగా.. బీమా కవరేజీలో రూమ్‌ రెంట్‌ పరిమితి 1 శాతంగా ఉంది. కానీ, అతడు ఎంపిక చేసుకున్న రూమ్‌ రోజువారీ అద్దె 1 శాతం కంటే మించి ఉంది. ఈ షరతు చూసిన తర్వాత అతడు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. దీంతో కొత్త ఇన్సూరెన్స్‌ ప్లాన్‌ కోసం అన్వేషణ మొదలు పెట్టాడు. ఇది క్రాంతి కుమార్‌ ఒక్కడికే ఎదురైన పరిస్థితి అనుకోవద్దు. దశాబ్దం క్రితం హెల్త్‌ ఇన్సూరెన్స్‌ ప్లాన్‌ తీసుకుని, కొనసాగుతున్న వారంతా ఎదుర్కొంటున్నారు.



ఏమి చూడాలి..?

మీ అవసరాలకు సరిపడే ప్లాన్‌ను ఎంపిక చేసుకోవాలి. పాలసీ వర్డింగ్స్, పాలసీ బ్రోచర్‌ను అన్ని పేజీలు చదివితే పూర్తి వివరాలు తెలుస్తాయి. తద్వారా ప్లాన్‌ ఆకర్షణీయమా? కాదా? అన్నది చూడొచ్చు. క్లెయిమ్‌ పరిష్కారాల విషయంలో నూతన సంస్థ పనితీరును విశ్లేషించాలి. క్లెయిమ్‌ సెటిల్‌మెంట్‌ నిష్పత్తి, క్లెయిమ్‌ చెల్లింపుల సామర్థ్యాలను చూడాలి. క్లెయిమ్‌ అభ్యర్థనలను ప్రాసెస్‌ చేయడంతో బీమా సంస్థల స్పందనను చూడాలి. ప్రీమియం ఎక్కువ ఉన్నా సరే, క్లెయిమ్‌ సమయంలో పాలసీదారులపై చెల్లింపుల భారం పడని పాలసీని ఎంపిక చేసుకోవాలి. ఓపీడీ కవరేజీ, డేకేర్, రీస్టోరేషన్‌ కూడా ఉండాలి. ఒక పాలసీ సంవత్సరంలో ఒక క్లెయిమ్‌ వల్ల బీమా కవరేజీ మొత్తం ఖర్చయినప్పుడు.. రీస్టోరేషన్‌ కింద బీమా సంస్థ అంతే మొత్తాన్ని పునరుద్ధరిస్తుంది. దీనివల్ల అదే ఏడాది మళ్లీ ఆసుపత్రిలో చికిత్స అవసరం పడితే క్లెయిమ్‌ చేసుకోవచ్చు. ఇందులోనూ కొన్ని సంస్థలు ఒక ఏడాదిలో ఒకరు ఎన్ని సార్లు ఆసుపత్రిలో చేరినా, గతంలో క్లెయిమ్‌ చేసిన వ్యాధులకు సైతం రీస్టోరేషన్‌ (అన్‌ లిమిటెడ్‌) ఇస్తున్నాయి. వీటిని పరిశీలించొచ్చు. ముందు నుంచి ఉన్న వ్యాధులకు సాధారణంగా 3–4 ఏళ్ల వెయిటింగ్‌ పీరియడ్‌ ఉంటుంది. దీనివల్ల వాటికి కవరేజీ కోసం అన్నేళ్లు ఆగక తప్పదు. దీనికి బదులు ఏడాది, అసలు వెయిటింగ్‌ పీరియడ్‌ లేని (రైడర్‌) పాలసీలు మెరుగైనవి. నో క్లెయిమ్‌ బోనస్‌ అనేది ప్రీమియం తగ్గింపు రూపంలో కాకుండా, బీమా కవరేజీ పెంపు రూపంలో ఉంటే ఎక్కువ ప్రయోజనం. రూమ్‌ రెంట్‌ పరిమితులు లేకుండా చూసుకోవాలి. ఇంటి నుంచే చికిత్స తీసుకోవాల్సి వస్తే (కరోనా వంటి సమయాల్లో) కవరేజీనిచ్చే డోమిసిలరీ ట్రీట్‌మెంట్‌ కవరేజీ ఫీచర్‌ ఉంటే మంచిదే.

దరఖాస్తు తిరస్కరణ..?

మంచి ఆరోగ్య చరిత్ర ఉండి, సరైన వివరాలు, డాక్యుమెంట్లు అందిస్తే నూతన సంస్థ పోర్టింగ్‌ అభ్యర్థనను ఆమోదించి పాలసీ మంజూరు చేస్తుంది. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉండి, ఇచ్చిన సమాచారంలో అస్పష్టత, గోప్యత ఉంటే, లేదా ఇతర కారణాలతో పాలసీ ప్రపోజల్‌ను తిరస్కరించొచ్చు. ఎందుకంటే అప్పటికే ఉన్న ఆరోగ్య చరిత్రను పాత సంస్థ నుంచి నూతన బీమా సంస్థ తీసుకుంటుందన్న విషయాన్ని మర్చిపోవద్దు. పాత బీమా సంస్థకు దరఖాస్తు సమయంలో ఇచ్చిన దానికి భిన్నమైన సమాచారం కొత్త సంస్థకు అందించినట్టయితే తిరస్కరణకు అవకాశాలుంటాయి. అటువంటి సందర్భంలో కొత్త సంస్థను బతిమిలాడే బదులు, ఉన్న సంస్థతోనే కొనసాగడం మంచి నిర్ణయం అవుతుంది. దీనికి బదులు ప్రస్తుత బీమా సంస్థలోనే మెరుగైన ఫీచర్లతో కూడిన ప్లాన్‌కు మైగ్రేట్‌ అవ్వడం మరో మంచి ఆప్షన్‌. అప్పటికే దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే, పోర్టింగ్‌ దరఖాస్తును ఆమోదించాలనేమీ లేదు. ముఖ్యంగా తనకున్న వ్యాధులకు పాత ప్లాన్‌లో క్లెయిమ్‌ చేసుకుని ఉంటే పోర్టింగ్‌ దరఖాస్తు తిరస్కరణకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పాత పాలసీ రెన్యువల్‌కు సంబంధించి ల్యాప్స్‌ ఉంటే అది కూడా తిరస్కరణకు కారణం అవుతుంది. నిబంధనల మేరకు రెన్యువల్‌ సమయంలో సంప్రదించకుంటే అప్పుడు పోర్టింగ్‌ విజయవంతం కాదు. అందుకే రెన్యువల్‌కు 60రోజుల ముందు సంప్రదించాలి. 70 ఏళ్లు దాటిన వారికి పోర్టింగ్‌కు అవకాశం ఉండదు.

పోర్టింగ్‌ ఎలా..?

నూతన సంస్థకు మారిపోవాలని నిర్ణయించుకుంటే రెన్యువల్‌ సమయంలోనే అనుమతిస్తారు. పాలసీ రెన్యువల్‌ తేదీకి 60 రోజుల నుంచి 45 రోజుల్లోపు నూతన బీమా సంస్థకు పోర్టింగ్‌ గురించి తెలియజేయాలి. ఈ సమయంలో వీలు కాకపోతే, తిరిగి రెన్యువల్‌ వరకు వేచి చూడాల్సిందే. ప్రపోజల్‌ పత్రం, పోర్టబులిటీ దరఖాస్తు పత్రాలను నింపాలి. ఆరోగ్య చరిత్ర, బీమా సంస్థ కోరిన అన్ని వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. కేవైసీ, ఇతర పత్రాలను కూడా అందించాలి. గత పాలసీ పరిధిలో క్లెయిమ్‌ చేసి ఉంటే, డిశ్చార్జ్‌ సమ్మరీ జోడించాలి. అనంతరం ప్రస్తుతం బీమా సంస్థకు పోర్టింగ్‌ సమాచారం వెళుతుంది. అప్పుడు ప్రస్తుత సంస్థ సదరు పాలసీదారుకు సంబంధించి క్లెయిమ్, ఇతర సమాచారాన్ని కొత్త సంస్థతో పంచుకోవాలి. అప్పుడు నూతన బీమా సంస్థ 15 రోజుల్లోపు తన నిర్ణయాన్ని తెలియజేస్తుంది. పాలసీ దరఖాస్తును ఆమోదిస్తే ప్రీమియం చెల్లించాలి.

వీటిని గమనించాలి..

- పోర్టింగ్‌ సమయంలో పాత ప్లాన్‌లో నో క్లెయిమ్‌ బోనస్‌ ప్రయోజనాలు ఉంటే, కొత్త ప్లాన్‌లోనూ జతవుతాయి. కానీ, దీనికి కంపెనీలు షరతు పెడుతున్నాయి. ప్రస్తుత కవరేజీ రూ. 5 లక్షలు ఉండి, కొత్త సంస్థలోనూ రూ.5 లక్షలే తీసుకుంటే, పాత ప్లాన్‌ పరిధిలోని నో క్లెయిమ్‌ బోనస్‌ పోర్టింగ్‌ అవ్వదు. అదే రూ.6 లక్షలు తీసుకుంటే నో క్లెయిమ్‌ బోనస్‌ కలుస్తుంది.
- పోర్టింగ్‌ లేదా మైగ్రేషన్‌ను కొత్త ప్రపోజల్‌గానే బీమా సంస్థలు పరిగణిస్తాయి. అండర్‌రైటింగ్‌ నిబంధనల మేరకు ప్రీమియం నిర్ణయిస్తాయి.
- బేసిక్‌ ఇండెమ్నిటీ ప్లాన్‌ను మాత్రమే మరో బీమా సంస్థ పరిధిలోని బీమా ఇండెమ్నిటీ ప్లాన్‌కు మార్చుకోగలరు. అంతేకానీ, టాపప్‌ లేదా క్రిటికల్‌ ఇల్‌నెస్‌ ప్లాన్‌ను మార్చుకోలేరు.
- ఒక బీమా సంస్థ నుంచి మరో బీమా సంస్థకు హెల్త్‌ ప్లాన్‌ను పోర్టింగ్‌ పెట్టుకుంటే ఎలాంటి చార్జీల్లేవు.
- కార్పొరేట్‌ లేదా గ్రూప్‌ ప్లాన్లల ఉన్న వారికి ఇండివిడ్యువల్‌ ప్లాన్‌కు పోర్టింగ్‌ అవకాశం లేదు. వారు అదే సంస్థతో కొసాగాల్సిందే.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ లాభం అప్‌

- క్యూ4లో రూ. 12,595 కోట్లు
- షేరుకి రూ. 19 డివిడెండ్‌



ముంబై: ప్రయివేట్‌ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 21 శాతం ఎగసి రూ. 12,595 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం నికర లాభం ఇదే స్థాయిలో బలపడి రూ. 45,997 కోట్లను అధిగమించింది. వాటాదారులకు షేరుకి రూ. 19 చొప్పున డివిడెండు ప్రకటించింది. మొత్తం బ్రాంచీల సంఖ్య 7,821కు చేరింది. క్యూ4లో 6,000 మందికి ఉపాధి కల్పించింది. మొత్తం సిబ్బంది సంఖ్య 1,73,222ను తాకింది.

స్టాండెలోన్‌ సైతం

క్యూ4లో స్టాండెలోన్‌ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ నికర లాభం 20 శాతం పుంజుకుని రూ. 12,048 కోట్లకు చేరగా.. నికర వడ్డీ ఆదాయం 24 శాతం జంప్‌చేసి రూ. 23,352 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.1 శాతంగా నమోదుకాగా.. 17 శాతం రుణ వృద్ధిని సాధించింది. ఇతర ఆదాయం రూ. 7,637 కోట్ల నుంచి రూ. 8,731 కోట్లకు పెరిగింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,312 కోట్ల నుంచి రూ. 2,685 కోట్లకు తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 0.4 శాతం బలపడి 19.3 శాతాన్ని తాకింది. అనుబంధ సంస్థలలో బ్రోకింగ్‌ విభాగం లాభం రూ. 236 కోట్ల నుంచి రూ. 194 కోట్లకు నీరసించగా.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ లాభం 28 శాతం ఎగసి రూ. 545 కోట్లను దాటింది.

స్టాక్స్‌ వ్యూ

లారస్‌ ల్యాబ్స్‌	కీనోట్‌ క్యాపిటల్స్‌	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 314 టార్గెట్‌: రూ. 396

ఎందుకంటే: దేశీ ఫార్మాస్యూటికల్‌ కంపెనీ లారస్‌ ల్యాబ్స్‌ను డాక్టర్‌ చావా సత్యనారాయణ 2005లో ఏర్పాటు చేశారు. ప్రధానంగా యాంటీరిట్రోవైరల్‌(ఏఆర్‌వీ) యాక్టివ్‌ఫార్మాస్యూటికల్‌ ఇన్‌గ్రెడియంట్‌(ఏపీఐ) తయారీతో ప్రారంభమైంది. తదుపరి ఫార్ములేషన్స్‌లోకి ప్రవేశించడంతోపాటు, కాంట్రాక్ట్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ మ్యాన్యుఫాక్చరింగ్‌(సీడీఎంవో) సర్వీసుల్లోనూ కార్యకలాపాలు విస్తరించింది. తద్వారా సమీకృత ఫార్మాస్యూటికల్‌ కంపెనీగా ఆవిర్భవించింది. ప్రస్తుతం కంపెనీ జెనరిక్స్‌ ఏపీఐ, ఫార్ములేషన్స్, సీడీఎంవో సర్వీసులు, బయోటెక్నాలజీలలో కార్యకలాపాలు కలిగి ఉంది. ప్రపంచవ్యాప్తంగా 60 దేశాలలో ప్రాడక్టులను విక్రయిస్తోంది. మొత్తం ఆదాయంలో 72 శాతంవరకూ ఎగుమతుల నుంచే ఆర్జిస్తోంది.




మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో తొలి 9 నెలలు(ఏప్రిల్‌–డిసెంబర్‌) ఏఆర్‌వీ విభాగంలో ధరల ఒత్తిడిని ఎదుర్కొంది. ఈ విభాగంలో అధిక ప్రాడక్టుల కారణంగా మొత్తం మార్జిన్లపై ప్రభావం పడింది. అయితే ఏఆర్‌వీయేతర, సీడీఎంవో విభాగాలలో సామర్థ్య విస్తరణకు దిగడం ద్వారా ప్రాడక్టు ధరల రిస్కులను తగ్గించుకోనుంది. అంతేకాకుండా పేటెంట్‌ గడువు ముగియడం(ఎక్స్‌పైరీ)తో లభించే అవకాశాలను సైతం అందిపుచ్చుకునే వీలుంది. ప్రత్యేక ప్రాడక్టులను అభివృద్ధి చేయడం ద్వారా అభివృద్ధి చెందిన మార్కెట్లలో విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తోంది.

టీసీఎస్‌	రెలిగేర్‌ బ్రోకింగ్‌	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,190 టార్గెట్‌: రూ. 3,882

ఎందుకంటే: టాటా గ్రూప్‌ దిగ్గజం టీసీఎస్‌ సాఫ్ట్‌వేర్‌ సేవలకు దేశంలోనే నంబర్‌ వన్‌ కంపెనీగా నిలుస్తోంది. అటు ప్రాంతాలవారీగా ఇటు విభాగాలవారీగా డైవర్సిఫైడ్‌ కార్యకలాపాలను కలిగి ఉంది. ఐటీ సేవలకు అతిపెద్ద మార్కెట్‌ ఉత్తర అమెరికా నుంచి 55 శాతంపైగా ఆదాయాన్ని సాధిస్తోంది. ఐటీ సేవలకు అతిపెద్ద విభాగమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్‌ సర్వీసెస్, ఇన్సూరెన్స్‌(బీఎఫ్‌ఎస్‌ఐ) నుంచి 31 శాతం అమ్మకాలు అందుకుంటోంది. భవిష్యత్‌లోనూ కంపెనీ అమెరికా, యూరోపియన్‌ ప్రాంతాలలో పట్టును కొనసాగించే వీలుంది. తద్వారా భారీ ట్రాన్స్‌ఫార్మేషన్‌ డీల్స్‌ను కుదుర్చుకోవడంలో మరింత పురోగతిని చూపనుంది. విభిన్న విభాగాల(వర్టికల్స్‌)లో ప్రత్యేకతరహా(యూనిక్‌) సొల్యూషన్స్‌ అందించడం ద్వారా పటిష్ట వృద్ధిని సాధిస్తోంది. చౌక వ్యయాల ప్రాడక్టులు, వివిధ ప్లాట్‌ఫామ్స్‌తో క్లయింట్లను ఆకట్టుకుంటోంది. ఇందుకు ఆటోమేషన్, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌(ఏఐ), బ్లాక్‌చైన్‌ తదితర ఆధునిక టెక్నాలజీలను ఆఫర్‌ చేస్తోంది. 2021–22కల్లా కంపెనీ ఆర్డర్‌బుక్‌ 34.6 బిలియన్‌ డాలర్లను తాకింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. 2022–23 తొలి 9 నెలల్లో 24.1 బిలియన్‌ డాలర్ల ఆర్డర్‌బుక్‌ను పొందింది. 2023 జనవరి–మార్చిలో భారీ డీల్స్‌ ద్వారా 10 బిలియన్‌ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది. క్లౌడ్‌ మైగ్రేషన్, డిజిటల్‌ ట్రాన్స్‌ఫార్మేషన్‌ తదితర సర్వీసులకు పెరుగుతున్న డిమాండ్‌ కంపెనీకి లబ్ధిని చేకూర్చనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మిడ్, స్మాల్‌ క్యాప్‌లో ఎక్కువ పెట్టుబడులు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్‌

పదేళ్లకు మించి నేను సిప్‌ ద్వారా ఇన్వెస్ట్‌ చేయగలను. నా ఈక్విటీ పెట్టుబడుల్లో 50 శాతం నుంచి 60 శాతం మేర స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేసుకోవచ్చా..? – ఉమేష్‌ యాదవ్‌

దీర్ఘకాల పెట్టుబడులకు సంబంధించి ఈక్విటీలకు పదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం సరైనది. ఒకే రకం ఫండ్‌ లేదా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌ ఫండ్స్‌లోనే ఎక్కువ పెట్టుబడులు పెట్టడానికి దూరంగా ఉండాలి. 50–60% మేర మిడ్, స్మాల్‌ క్యాప్స్‌ పెట్టుబడులతో ప్రధాన పోర్ట్‌ఫోలియో నిర్మించుకోవడం అన్నది సూచనీయం కాదు. దీనికి బదులు ఫ్లెక్సీ క్యాప్‌ ఫండ్స్‌ రూపంలో ఇన్వెస్ట్‌ చేసుకోవడం మంచిది. ఇలా చేస్తే మిడ్, స్మాల్‌క్యాప్‌ పెట్టుబడులు 25–30 శాతానికి పరిమితం అవుతాయి. లార్జ్‌క్యాప్‌ పెట్టుబడులు 70% మేర ఉంటాయి. వృద్ధికితోడు, స్థిరత్వాన్ని ప్రదర్శించే స్టాక్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. రిస్క్‌ ఎక్కువగా ఉండే సాధనాలకు తక్కువ కేటాయింపులు చేసుకోవాలి. మిడ్, స్మాల్‌క్యాప్‌ ఫండ్స్‌ అనేవి దీర్ఘకాలంలో ఫ్లెక్సీక్యాప్‌ కంటే ఎక్కువ రాబడులను ఇస్తాయి. కానీ, స్వల్పకాలంలో తీవ్ర అస్థిరతల మధ్య చలిస్తాయి. కనుక వీటిల్లో రిస్క్‌ ఎక్కువగా ఉంటుంది. అందుకే వీటికి 50–60% కేటాయింపులు చేయడం వల్ల పెట్టుబడుల్లో అధిక భాగం అస్థిరతలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అధిక అస్థితరలు ఉన్నా సరే, దీర్ఘకాలంలో అధిక రాబడులు కోరుకుంటే అప్పుడు ఫ్లెక్సీక్యాప్‌తోపాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్‌ చేసుకోవచ్చు.

నేను ఒకే విడతలో రూ.3 లక్షలు ఇన్వెస్ట్‌ చేద్దామని అనుకుంటున్నాను. ఇండెక్స్‌ ఫండ్‌లో ఇన్వెస్ట్‌ చేయవచ్చా? లేదా నెలవారీ, త్రైమాసికం వారీ ఆదాయం వచ్చేలా ఎస్‌డబ్ల్యూపీ ఎంపిక చేసుకోవాలా? – శంకర్‌ నారాయణన్‌

ఇండెక్స్‌ ఫండ్‌ అనేది నిఫ్టీ 50 లేదా సెన్సెక్స్‌ తదితర సూచీల్లో (ఇండెక్స్‌ల్లో) ఇన్వెస్ట్‌ చేసేది. మరోవైపు సిస్టమ్యాటిక్‌ విత్‌డ్రాయల్‌ ప్లాన్‌ (ఎస్‌డబ్ల్యూపీ) అనేది పెట్టుబడులను క్రమంగా ఉపసంహరించుకునే సాధనం. ఇండెక్స్‌ ఫండ్‌లో ఇన్వెస్ట్‌ చేస్తే సంబంధిత సూచీ రాబడులకు అనుగుణంగానే ఉంటాయి. ఎస్‌డబ్ల్యూపీ ద్వారా మీరు కోరుకున్నంత ప్రతి నెలా ఉపసంహరించుకోవచ్చు. రూ.లక్షను 10 నెలల్లో ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకుంటే ప్రతి నెలా రూ.10వేలను ఎస్‌డబ్ల్యూపీగా ఎంపిక చేసుకోవాలి. మీ దగ్గర కొంత మొత్తం ఫండ్‌ ఉండి, ఇన్వెస్ట్‌ చేద్దామని అనుకుంటుంటే దాన్ని ఒకే విడత కాకుండా ఆరు నుంచి 12 నెలల పరిధిలో సిస్టమ్యాటిక్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ప్లాన్‌ (సిప్‌) రూపంలో పెట్టుబడులు పెట్టుకోవాలి. క్రమం తప్పకుండా ఆదాయ మార్గం ఏర్పాటు చేసుకోవాలంటే.. మూడింట ఒక వంతును ఈక్విటీల్లో ఇన్వెస్ట్‌ చేసుకోవచ్చు. రిస్క్‌ వద్దనుకునే వారు లార్జ్‌క్యాప్‌ ఫండ్‌ లేదా ఇండెక్స్‌ ఫండ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఒక ఏడాది అవసరాలకు సరిపడా (మొత్తం పెట్టుబడిలో 6 శాతం మించకుండా) లిక్విడ్‌ ఫండ్‌లో ఇన్వెస్ట్‌ చేసుకోవాలి. మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్‌ ఇన్‌కమ్‌లో, అది కూడా షార్ట్‌ డ్యురేషన్‌ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టుకోవాలి. ఏడాదికోసారి మీ ఈక్విటీ పెట్టుబడులు 33–35 శాతం మించకుండా, తగ్గకుండా రీబ్యాలన్స్‌ చేసుకుంటూ ఉండాలి. ప్రతి ఏటా ఏడాది అవసరాలకు సరిపడా మొత్తాన్ని లిక్విడ్‌ ఫండ్స్‌లోకి మళ్లించుకోవాలి. ఈ మొత్తాన్ని ఏటా 5 శాతం పెంచుకుంటూ వెళ్లాలి. అలాగే, ఉపసంహరించుకునే మొత్తం ఏటా పెట్టుబడిలో 6 శాతం మించకుండా చూసుకోవాలి.



బరోడా బీఎన్‌పీ పారిబా ఫ్లోటర్‌ ఫండ్‌



బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్‌ ఫండ్‌ కొత్తగా ఫ్లోటర్‌ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది ఓపెన్‌ ఎండెడ్‌ డెట్‌ స్కీము. ప్రధానంగా ఫ్లోటింగ్‌ వడ్డీ రేట్ల సాధనాల్లో ఇన్వెస్ట్‌ చేస్తుంది. ఏప్రిల్‌ 24 వరకు ఇందులో ఇన్వెస్ట్‌ చేయొచ్చు. గడిచిన కొన్నాళ్లుగా వడ్డీ రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో ఫ్లోటింగ్‌ రేట్‌ సెక్యూరిటీలపై వచ్చే ఆదాయాలు కూడా పెరుగుతున్నాయని, దీంతో ఇవి ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మారాయని సంస్థ సీఈవో సురేశ్‌ సోనీ తెలిపా రు. ఈ ఫండ్‌కు ప్రశాంత్‌ పింప్లే, మయాంక్‌ ప్రకాష్‌ ఫండ్‌ మేనేజర్లుగా వ్యవహరిస్తారు. క్రిసిల్‌ లో డ్యూరేషన్‌ డెట్‌ సూచీ దీనికి ప్రాతిపదికగా ఉంటుంది.

ఐసీఐసీఐ ప్రు ఇన్నోవేషన్‌ ఫండ్‌



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్‌ మ్యుచువల్‌ ఫండ్‌ తాజాగా ఇన్నోవేషన్‌ ఫండ్‌ పేరిట న్యూ ఫండ్‌ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ థీమాటిక్‌ ఫండ్‌ ఏప్రిల్‌ 24 వరకు అందుబాటులో ఉంటుంది. కొత్త ఆవిష్కరణ వ్యూహాలు, థీమ్‌లతో ప్రయోజనం పొందే కంపెనీల షేర్లు, అంతర్జాతీయ మ్యూచువల్‌ ఫండ్‌లు, ఈటీఎఫ్‌ల యూనిట్లలో ఇది ఇన్వెస్ట్‌ చేస్తుంది. మార్కెట్‌ క్యాప్‌పరమైన పరిమితులు లేవు. స్కీమ్‌ ద్వారా సేకరించిన నిధుల్లో కనీసం 80 శాతం భాగాన్ని ఇన్నోవేషన్‌ వ్యూహాలు అమలు చేసే కంపెనీల్లో పెట్టుబడి పెడతారు. 20 శాతం వరకు మొత్తాన్ని ఏడీఆర్, జీడీఆర్, విదేశీ సెక్యూరిటీలు, మ్యుచువల్‌ ఫండ్లు, ఈటీఎఫ్‌లు మొదలైన వాటిలో ఇన్వెస్ట్‌ చేయొచ్చు. మహమ్మారి అనంతర పరిస్థితులు, ద్రవ్యోల్బణం, భౌగోళిక–రాజకీయ పరిస్థితులు, వడ్డీ రేట్లు ఒక స్థాయిలో కుదురుకుంటూ ఉండటం మొదలైన అంశాలు ఇన్నోవేషన్‌ థీమ్‌కు సానుకూలంగా ఉండగలవని సంస్థ హెడ్‌ (ఇన్వెస్ట్‌మెంట్‌ స్ట్రాటజీ) చింతన్‌ హరియా తెలిపారు.

క్లుప్తంగా...

సుందరీకరణకు హెచ్‌యూఎల్‌తో ఒప్పందం

మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై మున్సిపల్ శాఖ సంతకాలు



సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాలు, మురికివాడల్లో నిరుపయోగంగా ఉన్న ఖాళీ ప్రదేశాలను సుందరీకరించేందుకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా హైదరాబాద్ అర్బన్ ల్యాబ్ ఫౌండేషన్ (హెచ్‌యూఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. మున్సిపల్‌శాఖ మంత్రి కె. తారక రామారావు సమక్షంలో ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్‌యూఎల్‌కు చెందిన అనంత్ మరింగంటి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. హైదరాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న స్థలాలను ఇప్పటికే జీహెచ్ఎంసీ గుర్తించిన నేపథ్యంలో వాటిని నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి చేసే బాధ్యతను ఈ ఫౌండేషన్‌కు అప్పగించారు. స్థానికులు, ప్రైవేటు ఆర్గనైజేషన్లు, కళాశాలల ఆర్కిటెక్చర్ విద్యార్థులు తదితరులతో కలిసి ఈ కార్యక్రమాన్ని హెచ్‌యూఎల్ నిర్వహించనుంది.

'21న టీ-ఇన్నోవేషన్ మహోత్సవ్'



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలు, గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి టీ-ఇన్నోవేషన్ దోహద పడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ గ్రామాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీఎస్ఐసీ ఈనెల 21న టీ-ఇన్నోవేషన్ మహోత్సవ్‌ను నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సామాజిక, గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి వినూత్న ఆలోచనతో ముందుకు రావడం సంతోషకరం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి, ప్రజల ఆలోచనల్లో రావాల్సిన మార్పులపై దృష్టి సారించి, ప్రమాణాల మెరుగుదలకు పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలను అధ్యయనం చేసి, నూతన పరిష్కారాలు కనుగొనాలని మంత్రి సూచించారు. పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, అట్టడుగున ఉన్న ప్రజల సమస్యలకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు కొత్త ఆవిష్కరణలకు దారి చూపుతాయన్నారు. ఇందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. తెలంగాణ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీఐవో) డాక్టర్ శాంత తౌటం మాట్లాడుతూ, టీఎస్ఐసీ గ్రామీణ ప్రజల్లో కూడా ఆవిష్కరణలపై ఆలోచనలను రేకెత్తించి, ప్రోత్సాహించాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. తెలంగాణ ఇన్నోవేషన్ సెల్, ఐటీ, పంచాయితీ రాజ్ శాఖ కలిసి ఈ నెల 21న టీ-ఇన్నోవేషన్ మహోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

బీసీలు ఉద్యమించాల్సిన సమయమిదే: దాసు సురేశ్



హసన్‌పర్తి: రాజ్యాధికారాన్ని చేపట్టడం కోసం బీసీలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. బీసీల తల రాతలని మార్చే రాజ్యాధికారం ఇప్పుడు కాక ఇంకెప్పుడు? అని ప్రశ్నించారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట వద్ద ఆదివారం బీసీ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలు అధిక సంఖ్యలో ప్రవేశించే దిశగా కార్యచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా త్వరలోనే భారీ బహిరంగసభలు నిర్వహిస్తామని ప్రకటించారు. న్యాయవాది పులి సత్యనారాయణ మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థలోనూ బీసీలకు రిజర్వేషన్లు అవసరమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర నాయకులు పోదుల సాయిబాబా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మ డి జిల్లా అధ్యక్షుడు శ్యాం యాదవ్, తెలంగాణ సోషల్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేముల సదానందం, నా యకులు ఓదెలు యాదవ్, చింతం అనిల్, దిలీప్, కుమారస్వామి, యాదగిరి పాల్గొన్నారు.

300 మందిని ముంచిన మైత్రి రియల్‌ఎస్టేట్!

రూ.50 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన సంస్థ

- మియాపూర్ ఆల్విన్ క్రాస్ రోడ్స్ కేంద్రంగా వ్యవహారం
- నెల రోజుల క్రితమే పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- పట్టించుకోలేదని నిరసనకు దిగిన బాధితులు



మియాపూర్ (హైదరాబాద్): పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి కూడబెట్టుకున్న డబ్బును ప్లాట్ల కొనుగోలు కోసం చెల్లిస్తే.. మైత్రి ప్రాజెక్ట్స్ రియల్‌ఎస్టేట్స్ సంస్థ వారిని నిండా ముంచింది. సుమారు 300 మంది నుంచి రూ.50 కోట్ల వరకు వసూలు చేసి.. వారికి ప్లాట్లు ఇవ్వకుండా, డబ్బులూ తిరిగివ్వకుండా బోర్డు తిప్పేసింది. దీనితో హైదరాబాద్‌లోని మియాపూర్ ఆల్విన్ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న మైత్రి ప్రాజెక్ట్స్ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయం ముందు బాధితులు ఆదివారం ధర్నాకు దిగారు. కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో అక్కడి నుంచి మియాపూర్ పోలీస్‌స్టేషన్ వరకు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఒక్కొక్కరి నుంచి రూ.30 లక్షలదాకా..

బాధితులు వెల్లడించిన వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన జానీ బాషాషేక్ రామంతాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ.. మియాపూర్‌లో మైత్రి ప్రాజెక్టు రియల్ ఎస్టేట్స్ పేరిట కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. హైదరాబాద్ శివార్లలోని గాగిలాపూర్‌లోని రాయల్ లీఫ్, రామేశ్వర్‌బండలోని రాయల్ ప్యారడైజ్, మామిడిపల్లిలో రాయల్ వింట్, హంబ్టాన్ ఫామ్స్ పేరుతో వెంచర్లు వేసి.. ఓపెన్ ప్లాట్లను విక్రయిస్తున్నట్టు ప్రచారం చేశాడు. తప్పుడు డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లు చూపించి తక్కువ ధరకే ప్లాట్లను ఇస్తామంటూ ప్రజలను నమ్మించాడు. పలు ప్రాంతాలకు చెందిన 300 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.10 లక్షల నుండి రూ.30 లక్షల మేర కట్టించుకున్నాడు. కానీ రిజిస్ట్రేషన్లు చేయకుండా బాధితులను మూడేళ్లుగా తిప్పించుకుంటూ వచ్చారు. చివరికి మకాం మార్చి సంస్థకు తాళం వేసి పారిపోయాడు.

నెల రోజుల కిందే ఫిర్యాదు చేసినా..

తమకు న్యాయం చేయాలని కోరుతూ మియాపూర్, పటాన్‌చెరువు, సంగారెడ్డి పోలీస్ స్టేషన్లలో నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. పోలీసుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మైత్రి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, మియాపూర్ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశామని వివరించారు. మైత్రిలో డబ్బులు కట్టినవారంతా పేద, మధ్య తరగతికి చెందినవారమేనని.. తమ కలలు కల్లలు అవుతున్నాయని వాపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అవినీతికి పాల్పడితే సీఎంలనూ వదలం

మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తేలేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్థాయిలో అవినీతి, కుంభకోణాలు పాల్పడటానికి ప్రత్యేక అధికారాలేవీలేవని ఆయన ఘాటుగా స్పందించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు నోటీసులు ఇవ్వడాన్ని పలువురు తప్పుపడుతున్నారని, అక్రమాలకు పాల్పడినవారికి కొందరు బహిరంగంగా మద్దతు తెలుపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి అయినా, ఆ స్థాయి వ్యక్తి కుటుంబసభ్యులైనా అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం ఇక్కడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అతీక్ అహ్మద్ వందకుపైగా కేసుల్లో నిందితుడని, అనేకమందిని హతమార్చిన చరిత్ర అతనిదని పేర్కొన్నారు. పాతబస్తీలో నడిరోడ్డుపైనే హత్యలు జరుగుతున్న ఉదంతాలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సింగరేణి నష్టాల్లో ఉందని, కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, దీంతో కల్వకుంట్ల కుటుంబం కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు సింగరేణి ప్రైవేటీకరణ నాటకాన్ని సాగిస్తోందని పేర్కొన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే స్పష్టం చేశారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అదేపనిగా ప్రచారం చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే నిజాం షుగర్స్‌ను వందరోజుల్లో తెరుస్తామని చెప్పి తొమ్మిదేళ్లైందన్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలు మూతపడుతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం విశాఖ స్టీల్ పరిశ్రమ కొనుగోలు చేస్తామని అనడం హాస్యాస్పదమన్నారు. గతంలో ముఖ్యమంత్రులు ట్యాంక్ బండ్‌కు వచ్చి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించేవారని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకంగా 9 ఏళ్ల తర్వాత అంబేడ్కర్ జయంతి వేడుకలో పాల్గొనడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రికి ఇఫ్తార్ విందుకు వెళ్లే సమయం ఉంటుందని, కానీ రామనవమికి భద్రాచలం వెళ్లే తీరిక మాత్రం లేదన్నారు.

శబరిమల విమానాశ్రయం భక్తులకు వరం

శబరిమలలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం తెలుగు రాష్ట్రాల భక్తులకు వరమని కేంద్ర పర్యాటకమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అంగీకరించిన ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్ర పౌర విమానయాన మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఏటా కోట్ల సంఖ్యలో శబరిమలను సందర్శించే భక్తులకు విమాన సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను ప్రధానికి వివరించగా, సూత్రప్రాయంగా అంగీకరించారని చెప్పారు. విమానాశ్రయ ఏర్పాటుకుగాను ప్రధాని మోదీ సైట్ క్లియరెన్స్‌కు ఆమోదం తెలిపారని, ఇంకా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించారు.

ఏపీలో ఎలిస్టా టీవీ తయారీ యూనిట్

- రూ.250 కోట్లతో ఎల్ఈడీ టీవీ, మానిటర్స్ తయారీ

సాక్షి, అమరావతి: ప్రముఖ హోమ్ అప్లియన్సస్ సంస్థ ఎలిస్టా రూ.250 కోట్లతో ఆంధ్రప్రదేశ్‌లో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. కడపలో 1,32,300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎలిస్టా సీఎండీ సాకేత్ గౌరవ్ ప్రకటించారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో ఈ పెట్టుబడులకు సంబంధించి ఒప్పందం చేసుకున్నామని, త్వరలోనే యూనిట్ నిర్మాణ పనులు మొదలు పెడతామని మీడియాకు తెలిపారు. తొలుత ఏడాదికి పదిలక్షల టీవీలు, పదిలక్షల ఎల్ఈడీ మానిటర్స్ తయారీ సామర్థ్యంతో ఈ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. దేశీయ హోమ్ అప్లియన్సస్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. 2021లో రూ.5,36,370 కోట్లు ఉన్న హోమ్ అప్లియన్సస్ మార్కెట్ పరిమాణం 2027 నాటికి రూ.12,89,889 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈ యూనిట్ వచ్చే ఏడాది ప్రారంభానికి వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా అంతర్జాతీయ అవసరాలను కూడా తీర్చనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సై తుదిపరీక్ష 'కీ'పై అభ్యంతరాలకు నేడు గడువు



సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన ఎస్సై తుది రాతపరీక్షల ప్రాథమిక 'కీ'ని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక 'కీ'లో ఏవైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు బోర్డుకు తెలియజేసేందుకు ఇచ్చిన గడువు సోమవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. ప్రాథమిక 'కీ'లోని జవాబులు, ప్రశ్నలకు ఇచ్చి ఐచ్ఛికాలలో ఏవైనా తప్పుగా ఉన్నా తెలియజేసేందుకు టెంప్లెట్లలో ఫార్మెట్‌ను సైతం బోర్డు అధికారులు పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్ (www.tslprb.in)లో సూచించారు. అభ్యంతరం ఉన్న ప్రతి ప్రశ్నకు సూచించిన విధానంలో వేర్వేరుగా అభ్యంతరాలు పంపాల్సి ఉంటుంది. కాగా, సివిల్ ఎస్సై, కమ్యూనికేషన్ ఎస్సై, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై, ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు మొత్తం 62,342 మంది అభ్యర్థులకుగాను 59,534 మంది అభ్యర్థులు తుది రాతపరీక్షకు హాజరైన విషయం తెలిసిందే. అభ్యర్థుల నుంచి ప్రిలిమినరీ 'కీ'పై అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత వాటిని విశ్లేషించి, అందులో పరిశీలనకు అర్హమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది 'కీ'ని రూపొందించనున్నట్టు అధికారులు తెలిపారు.

భద్రాద్రిలో నూతన ఆర్జిత సేవలకు శ్రీకారం

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నూతన ఆర్జిత సేవలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వేదాశీర్వచనం కోసం భక్తులు కొనుగోలు చేసిన టికెట్లను ఈఓ రమాదేవి వారికి అందజేసి, సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తులను స్వామి వారి సేవకు మరింత చేరువ చేసేందుకే ఈ అవకాశమన్నారు. ఆలయంలో వేదాశీర్వచనం, స్వామికి తులసీమాల అలంకరణ, నిత్య సర్వ కైంకర్య సేవ, శ్రీరామనవమి ముత్యాల సమర్పణ, నిత్య పూల అలంకరణ సేవ, తులాభారం తదితర సేవలను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

'ఆడి' కారు అమ్మి.. అడ్వాన్సు ఇచ్చి

టీఎస్‌పీఎస్సీ డీఏవో పరీక్ష పేపర్ కోసం..

ఎల్బీనగర్‌లో మాస్టర్ పేపర్ ఇచ్చిన ప్రవీణ్ ● సిట్ విచారణలో వెల్లడించిన 'ఖమ్మం జంట'

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పరీక్ష పేపర్ ఖరీదు చేసిన కేసులో అరెస్టయిన ఖమ్మం జంట సాయి లౌకిక్, సాయి సుస్మిత విచారణలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. వీరిద్దరినీ సిట్ అధికారులు న్యాయస్థానం అనుమతితో తమ కస్టడీలోకి తీసుకుని మూడు రోజులపాటు విచారించారు. ఆదివారం ఆ గడువు ముగియడంతో సోమవారం వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు. సాయి సుస్మిత గ్రూప్-1 పరీక్ష రాసిన తర్వాత ఓఎంఆర్ షీట్‌లో జరిగిన పొరపాట్లు సరి చేసుకోవడానికి కమిషన్‌కు వచ్చిన సందర్భంలో ప్రవీణ్‌కుమార్‌తో పరిచయమైంది. డీఏఓ మాస్టర్ క్వశ్చన్ పేపర్ తన వద్ద ఉందని ఫిబ్రవరి మూడో వారంలో ఈమెతో చెప్పిన ప్రవీణ్ రూ.10 లక్షలకు విక్రయిస్తానన్నాడు. ఈ విషయాన్ని సుస్మిత తన భర్త లౌకిక్‌కు చెప్పింది. అప్పటికప్పుడు అంత డబ్బు లేకపోవడంతో తమ వద్ద ఉన్న రెండు కార్లలో 'ఆడి' కారును తన స్నేహితుడికి విక్రయించిన లౌకిక్ అతడి నుంచి అడ్వాన్స్‌గా రూ.6 లక్షలు తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని ప్రవీణ్‌కు ట్రాన్స్‌ఫర్ చేసి మిగిలిన మొత్తం చెల్లింపునకు గడువు కోరాడు. దీంతో భార్యాభర్తల్ని ఎల్బీనగర్ వద్దకు రమ్మని ప్రవీణ్ చెప్పాడు.

> **'ఆ పేపర్ మేం ఎవ్వరికీ ఇవ్వలేదు'**
>
> ఫిబ్రవరి 23 రాత్రి ఖమ్మం నుంచి నగరానికి వచ్చిన దంపతులు ఎల్బీనగర్‌లోని డీ మార్ట్ వద్ద ఉండి ప్రవీణ్‌కు సమాచారం ఇచ్చారు. బడంగ్‌పేట్‌లోని మల్లికార్జున కాలనీలో తన ఇంటి నుంచి అక్కడకు వచ్చిన ప్రవీణ్ మాస్టర్ క్వశ్చన్ పేపర్ ఇచ్చి వెళ్లాడు. ఆ రాత్రి అల్కాపురిలోని లాడ్జిలో బస చేసిన ఈ దంపతులు మరుసటి రోజు ఖమ్మంలోని సమీప బంధువు ఇంటికి వెళ్లారు. అక్కడే రెండు రోజులు ఉండి పరీక్షకు సిద్ధమైన సుస్మిత ఫిబ్రవరి 26న పరీక్ష రాసింది. సిట్ అధికారులు వీరిద్దరినీ తీసుకుని శనివారం ఖమ్మం రాపర్తినగర్‌లోని వారి ఇంట్లో సోదాలు చేశారు. మాస్టర్ ప్రశ్నపత్రంతో పాటు హాల్‌టికెట్ స్వాధీనం చేసుకున్నారు. తాము ఆ ప్రశ్నపత్రాలు మరెవరికీ ఇవ్వలేదని ఇరువురూ సిట్ అధికారులకు తెలిపారు.

నేను కష్టపడి చదివా.. మీరు అపోహపడుతున్నారు

న్యూజిలాండ్ నుంచి సిట్‌కు ఈ-మెయిల్ చేసిన నిందితుడు ప్రశాంత్

గ్రూప్-1 ప్రశ్నా పత్రాన్ని ప్రధాన నిందితులలో ఒకడైన రాజశేఖర్‌రెడ్డి, న్యూజిలాండ్‌లో ఉన్న తన బావ ప్రశాంత్‌రెడ్డికి పంపించాడు. న్యూజిలాండ్‌లో పరీక్షకు సిద్ధమై, హైదరాబాద్‌కు వచ్చి ప్రశాంత్ గ్రూప్-1 పరీక్ష రాసి వెళ్లాడు. పేపర్ లీకేజీ ఘటన వెలుగులోకి రావడంతో వందకుపైగా మార్కులు వచ్చిన వారిని ఆరా తీస్తున్న క్రమంలో ప్రశాంత్ రెడ్డికి వందకుపైగా మార్కులు వచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. విచారణలో తన బావకు ప్రశ్న పత్రాన్ని పంపించానని రాజశేఖర్ అంగీకరించాడు. ఈ మేరకు న్యూజిలాండ్‌లో ఉన్న ప్రశాంత్‌కు వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా సిట్ నోటీసులు పంపించింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్‌రెడ్డి సిట్‌కు ఈ మెయిల్ పంపించాడు. 'నేను కష్టపడి చదివానని, నేను ఎవరి వద్ద నుంచి ప్రశ్నా పత్రం తీసుకోలేదు, నాకు మార్కులు ఎక్కువగా రావడంతో మీరు అపోహపడుతున్నారు' అని ఈ మెయిల్‌లో పేర్కొన్నాడు. కాగా ప్రశ్నా పత్రాన్ని న్యూజిలాండ్‌లో ఉన్న ప్రశాంత్‌కు రిమోట్‌యాప్ అయిన ఎనీడెస్క్ ద్వారా రాజశేఖర్‌రెడ్డి పంపించిన విషయం విచారణలో వెల్లడైన విషయం తెలిసిందే.

చలాకీగా ఉండే ఓ 35 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. ఉన్నట్టుండి ముభావంగా మారిపోయాడు. బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు.. ఎవరితోనూ పెద్దగా మాట్లాడటం లేదు. ఎవరితోనూ కలవడం లేదు. అసలు ఇల్లు వదిలి బయటికి రావడం లేదు.

డిగ్రీ చదువుతున్న ఓ అమ్మాయి.. కాలేజీకి వెళ్లడం మానేసింది.. అలాగని స్నేహితులతో షికార్లు, కబుర్లు వంటివి కూడా లేవు.. ఎప్పుడు చూసినా ఇంట్లోనే ఓ గదిలో కూర్చుండి పోతోంది.. ఏమిటని అడిగితే బాగానే ఉన్నానంటోంది..

.. ఏమైంది ఈ ఇద్దరికి? వారు దారుణమైన ఘటనలేమీ ఎదుర్కోలేదు.. తీర్చలేని ఇబ్బందేమీ ఎదురుకాలేదు.. కానీ 'హికికోమోరి'బారినపడ్డారు. అందరికీ దూరంగా ఏకాంతంగా గడిపేస్తున్నారు. అసలు ఏమిటీ 'హికికోమోరి'? అదేమైనా మానసిక సమస్యా? దానికి కారణాలేమిటి? నిపుణులు ఏం చెప్తున్నారో తెలుసుకుందామా..

ఒంటరి.. హికికోమోరి



జపాన్‌లో 15లక్షల మందికి..

జపాన్ ఆరోగ్య శాఖ ఇటీవల ఓ సర్వే చేసింది. దాదాపు 15 లక్షల మంది 'హికికోమోరి'పరిస్థితిలో ఉంటున్నారని గుర్తించింది. నెలలు, సంవత్సరాలుగా వారు ఎవరితోనూ కలవడం లేదని తేల్చింది. వారి మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీన్ని చక్కదిద్దడానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. దానిపై స్పందించిన పలు స్థానిక సంస్థలు.. 'హికికోమోరి'లతో మెటావర్స్ వేదిగా సమావేశాలు నిర్వహించనున్నట్టు ప్రకటించాయి. దీనికి సంబంధించి భారత్ సహా పలు దేశాల ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి.



ఏమిటీ హికికోమోరి?



సామాజిక జీవనానికి దూరంగా దాదాపు ఒంటరితనంతో కూడిన జీవితాన్ని గడపడమే 'హికికోమోరి'. 1980వ దశకంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం, ఉద్యోగాలు, ఉపాధి దెబ్బతినడంతో.. తొలిసారిగా ఇలాంటి పరిస్థితిని గుర్తించారు. దానికి 'హికికోమోరి (అంతర్ముఖులుగా మారిపోవడం)'అని పేరుపెట్టారు. దీనిబారిన పడినవారు తమచుట్టూ తామే గిరి గీసుకుని బతికేస్తుంటారు. అలవాట్లను మార్చుకుంటారు. మానసిక ఆందోళన (యాంగ్జైటీ), కుంగుబాటు (డిప్రెషన్), అందరి మధ్య ఉన్నా ముభావంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కొందరిలో అయితే ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు కూడా వస్తుంటాయని నిపుణులు చెప్తున్నారు. అయితే ఇప్పటివరకు అధికారికంగా దీనిని మానసిక సమస్యగా ప్రకటించలేదు.

దీనికి కారణాలేమిటి?



సామాజిక, విద్య, ఉద్యోగ పరమైన ఒత్తిళ్లు, కుంగుబాటు, ఆర్థికపరమైన సమస్యలతో ఆందోళన, వివిధ రకాల వేధింపులు వంటివి 'హికికోమోరి'పరిస్థితికి దారితీస్తాయని నిపుణులు చెప్తున్నారు. ''ఉమ్మడి కుటుంబాలు, సామాజిక సంబంధాలు తగ్గిపోవడం, విద్య, ఉద్యోగాల్లో తీవ్రమైన పోటీ వంటివి కూడా హికికోమోరి సింట్రోమ్‌కు దారితీస్తాయి. ఇది వారిపై వ్యక్తిగతంగా, పరోక్షంగా సమాజంపైనా వ్యతిరేక ప్రభావం చూపుతుంది''అని కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ విష్ణుప్రియ భగీరథ్ తెలిపారు.

బయటపడేందుకు డబ్బులిస్తూ..

దక్షిణకొరియాలో 19 ఏళ్ల నుంచి 39 ఏళ్ల మధ్య వయసున్న మూడున్నర లక్షల మంది 'హికికోమోరి' సమస్యతో బాధపడుతున్నట్టు ఆ దేశ ఆరోగ్యశాఖ ఇటీవల గుర్తించింది. ముఖ్యంగా తొమ్మిదేళ్ల నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులు, ఉద్యోగులపై ప్రభావం ఎక్కువగా ఉందని తేల్చింది. వారిని ఈ సమస్యనుంచి బయటపడేలా ప్రోత్సహించేందుకు నెలకు సుమారు రూ.40 వేలు (490 డాలర్లు) లివింగ్ అలవెన్స్‌గా ఇవ్వనున్నట్టు ఆ దేశ ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

కుటుంబం, దగ్గరివారితో పరిష్కారం!



'హికికోమోరి'బారినపడినవారు అందరికీ దూరంగా, ఏకాంతంగా గడపడం వల్ల మరింతగా మానసిక, శారీరక సమస్యలు చుట్టుముడతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక్కోసారి ఇవి తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరిస్తున్నారు. దీని బాధితులు మందుల కంటే.. కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల సాంత్వన వంటి మార్గాల ద్వారానే త్వరగా కోలుకుంటారని స్పష్టం చేస్తున్నారు. ఇదే సమయంలో అవసరమైతే డిప్రెషన్ వంటి కొన్ని సమస్యలకు మందులు వాడితే సరిపోతుందని అంటున్నారు. సంస్థలు, కార్యాలయాలు తమ ఉద్యోగుల్లో, విద్యా సంస్థలు తమ విద్యార్థులలో ఒత్తిడి తగ్గించేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

భారత్ సహా అన్ని దేశాల్లోనూ..

అన్ని రంగాల్లో పోటీ విపరీతంగా పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితులకు తోడు కరోనా మహమ్మారి దెబ్బతో 'హికికోమోరి'పరిస్థితి పెరిగిపోయిందని నిపుణులు చెప్తున్నారు. ''ఆర్థిక మాంద్యం, ఉద్యోగాలు పోవడం, ఉపాధి దెబ్బతినడం, నెలలకు నెలలు లాక్‌డౌన్, కోవిడ్ బారినపడి ఆరోగ్యం దెబ్బతినడం వంటివాటి నుంచి కోలుకోవడానికి చాలా మంది ఇంకా ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారు హికికోమోరి బారినపడుతున్నారు..''అని ఢిల్లీకి చెందిన లైఫ్ కోచ్, సైకాలజిస్ట్ నిఖిలా దేశ్‌పాండే వివరించారు. వర్క్ ఫ్రం హోం, అన్నిరకాల సరుకుల హోం డెలివరీ వంటివి దీనికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఒక్క జపాన్ అనే కాకుండా ప్రపంచదేశాలన్నిటా ఇలాంటి పరిస్థితి కనిపిస్తోందని వెల్లడించారు. భారతదేశంలో మానసిక ఆరోగ్యంపై దృష్టిపెట్టడం చాలా తక్కువకావడంతో.. 'హికికోమోరి'సమస్య తలెత్తినా గుర్తించడం కష్టమని పేర్కొన్నారు.




8% 2017 నాటి అస్పెన్ అధ్యయనం ప్రకారం.. భారతదేశంలో ఒంటరితనంతో బాధపడుతున్న యువత

- సాక్షి సెంట్రల్ డెస్క్

ఏడాది చివరినాటికి దేశమంతటా 4జీ కనెక్టివిటీ

డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం కార్యదర్శి కె.రాజారామన్



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చివరికల్లా దేశం మొత్తం 4జీ మొబైల్ టెక్నాలజీ కనెక్టివిటీ సాధిస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం కార్యదర్శి కె.రాజారామన్ తెలిపారు. 4జీ శాచురేషన్ ప్రాజెక్టులో భాగంగా దేశవ్యాప్తంగా 4జీ కనెక్టివిటీకి దూరంగా ఉన్న 30 వేల పల్లెలను ఈ ఏడాదిలోగా అనుసంధానించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని వెల్లడించారు. తద్వారా మొత్తం కనెక్టివిటీ సాధిస్తామన్నారు. జీ-20 సమావేశాల్లో భాగంగా సోమవారం నుంచి హైదరాబాద్‌లో డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూపు సమావేశాలు జరగనున్నాయి. మూడు రోజుల (ఏప్రిల్ 17 - 19) పాటు జరిగే ఈ సమావేశాల వివరాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అల్కేశ్ కుమార్ శర్మ, డీఓటీ కార్యదర్శి రాజారామన్ వెల్లడించారు. రాజారామన్ మాట్లాడుతూ 4జీ టెక్నాలజీ కోర్ ఇప్పటికే సిద్ధమైందన్నారు. బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని మరింత విస్తృతం చేయడంతోపాటు కొత్త కొత్త టెక్నాలజీలను అతితక్కువ ఇంధన వినియోగంతో నడపడం ఎలా అన్న అంశంపై కూడా జీ-20 దేశాల డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూపు సమావేశాల్లో చర్చిస్తామని చెప్పారు.

ఆన్‌లైన్ వ్యవహారాలకు 'స్టే సేఫ్ ఆన్‌లైన్'

అల్కేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రధాన ఇతివృత్తంగా జీ-20 డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూపు సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. సురక్షిత ఆన్‌లైన్ వ్యవహారాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్టే సేఫ్ ఆన్‌లైన్ పేరుతో ప్రచారం మొదలు పెట్టామని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఆర్థిక రంగాల్లో కృషి చేస్తున్న స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు డిజిటల్ ఇన్నోవేషన్ అలయన్స్ ప్రారంభించామని ఆయన వెల్లడించారు.

1.08 కోట్ల మందికి 'కంటి వెలుగు'



సాక్షి, హైదరాబాద్: 'కంటి వెలుగు'కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1.08 కోట్ల మందికి కంటిపరీక్షలు చేశారు. దృష్టిలోపం ఉన్న 17.20 లక్షల మందిని గుర్తించి ఉచితంగా మందులు, రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. 13.11 లక్షల మందిని ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కోసం గుర్తించారు. 78.67 లక్షలమందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారణ అయింది.

మహిళా ఆరోగ్య కేంద్రాలు...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం అన్నిజిల్లాల్లో ఆరోగ్య మహిళాకేంద్రాలను ప్రారంభించింది. వంద ఆరోగ్య కేంద్రాలలో ఇప్పటివరకు పదివేల మందికిపైగా మహిళలకు 8 రకాల వైద్యసేవలను అందించింది. అన్ని జిల్లాల్లోని మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో ప్రతి మంగళవారం మహిళలకు పరీక్షలు నిర్వహించి తదుపరి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మహిళలకు 8 విభాగాల్లో వైద్యులు పరీక్షలు చేస్తున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.